# ప్రజాబలం

23.04.2024 మంగళవారం


## దేశం నిజంగా అభివృద్ధి చెందిదా!

కర్నాటకలో ఆరు గ్యారంటీలు ప్రకటించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి 'మోడీ గ్యారంటీ' అంటూ బిజెపి ప్రచారం చేపట్టింది. ఈ ఎన్నికలలో 400 సీట్లతో తిరుగులేని విజయం సాధించాలని బిజెపి పట్టుదలతో కృషి చేస్తున్నట్లుంది. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న కీలక అంశాలను ప్రస్తావించకుండా కేవలం మోడీ నాయకత్వం తిరుగులేదని చూపుతూ ఆయన 'శ్రీరాముడి అవతారం'గా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. బిజెపి ఎన్నికల ప్రణాళికలో ఆయన ఫోటోలు 53 కనిపించడం, ఆయన పేరును 69 సార్లు ప్రస్తావించడం గమనిస్తే పార్టీ పేరును మార్చేశారా? అనే అనుమానాలు కలుగక మానదు. కొద్ది ఏళ్ళ క్రితం వరకు తమది 'విలక్షణమైన పార్టీ' అని బిజెపి నేతలు గర్వంగా చెప్పుకొంటుండేవారు. మిగిలిన పార్టీలు వ్యక్తుల చుట్టూ తిరుగుతూ ఉంటె బిజెపి మాత్రం విధానాలు, దేశభవిష్యత్, ప్రజల శ్రేయస్సు ఆధారంగా నిర్ణయాలు తీసుకొంటుండేది. వ్యక్తులు ఎంతటి గొప్పవారైనప్పటికీ వారికి కొన్ని పరిమితులు ఉండేవి. జనసంఘ్ ఆవిర్భావం నుండి ఆ పార్టీకి ఓ సైద్ధాంతిక భూమిక ఏర్పాటులో కీలక పాత్ర వహించిన బలరాజ్ మధోక్ వంటి నేతలను సైతం 'గీత దాటారు' అని బైటకు పంపారు. బిజెపి ఎదుగుదలలో కీలక పాత్ర వహించిన ఎల్‌కె అద్వానీని సైతం పార్టీ అధ్యక్ష పదవి నుండి దించేశారు.చివరకు పార్టీని అందరికి ఆమోదయోగ్యమైన పార్టీగాతీర్చిదిద్దడంలో ముఖ్యమైన పాత్ర వహించిన విశేష ప్రజాదరణ గల వాజపేయి ప్రతిపాదించిన 'గాంధేయ సామ్యవాదం' సిద్ధాంతాన్ని వదిలివేశారు.

బిజెపిలో వాజపేయి, అద్వానీ తిరుగులేని నేతలుగా ఉన్న సమయంలో కూడా అంతర్గతంగా కీలక అంశాలపై గంభీరమైన వాదోపవాదాలు జరుగుతూ ఉండెడివి.వారిద్దరూ ప్రతిపాదించిన అంశాలను సైతం కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తూ తమ వాదనలు వినిపించుకోగలిగేవారు.కానీ ఇప్పుడు అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. హెూం మంత్రి అమిత్ షా తాజాగా చెప్పినట్లు ఈ ఎన్నికలు కేవలం మోడీని మూడోసారి ప్రధానిగా ఎన్నుకునేందుకు మాత్రమే జరుగుతున్నాయి. అంతకు ముందు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, దేశం ఎదుర్కొంటున్న సవాళ్ళను పరిగణనలోకి తీసుకోవలసిన అవసరంలేదంటూ పరోక్షంగా సంకేతాలిచ్చారు.కేవలం రష్యా, చైనా వంటి కమ్యూనిస్టు దేశాలలో మాత్రమే ఎన్నికలు ఆ విధంగా జరుగుతూ ఉంటాయి. ఎమర్జెన్సీ సమయంలో 'ఇందిర ఇండియా- ఇండియా ఇందిర' అని పేర్కొనడం ద్వారా అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు దేవకాంత్ బారువా రాజకీయాలలో వ్యక్తి ఆరాధనను పరాకాష్ఠకు తీసుకెళ్లారు. కానీ నేడు పరిస్థితులు అంతకన్నా దారుణంగా మారుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలకు బిజెపి విడుదల చేసిన ఎన్నికల ప్రణాళిక 'సంకల్ప్ పత్ర' అందుకు అద్దంపడుతుంది.

గత డిసెంబర్‌లో జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయం నుండి బిజెపి ఎన్నికల ప్రణాళికలను సైతం 'మోడీ గ్యారంటీలు'గా పేర్కొంటున్నారు. కర్నాటకలో ఆరు గ్యారంటీలు ప్రకటించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి 'మోడీ గ్యారంటీ' అంటూ బిజెపి ప్రచారం చేపట్టింది. ఈ ఎన్నికలలో 400 సీట్లతో తిరుగులేని విజయం సాధించాలని బిజెపి పట్టుదలతో కృషి చేస్తున్నట్లుంది. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న కీలక అంశాలను ప్రస్తావించకుండా కేవలం మోడీ నాయకత్వం తిరుగులేదని చూపుతూ ఆయన 'శ్రీరాముడి అవతారం'గా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. బిజెపి ఎన్నికల ప్రణాళికలో ఆయన ఫోటోలు 53 కనిపించడం, ఆయన పేరును 69 సార్లు ప్రస్తావించడం గమనిస్తే పార్టీ పేరును మార్చేశారా? అనే అనుమానాలు కలుగక మానదు. ఇతరులు ఆయనను ఓ గొప్ప నేతగా పేర్కొనడాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ స్వయంగా ఆయన కూడా 'మోడీ ఉన్నారు కాబట్టి దేశం అభివృద్ధి చెందుతుంది.

దేశం భద్రంగా ఉంది. ప్రజలు సంతోషంగా ఉన్నారు%ొ%' అన్నట్టు మాట్లాడుతున్నారు. తమ పార్టీ, ప్రభుత్వం కాకుండా తాను ప్రజలకు భరోసా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పార్టీకి అతీతమైన నేత గా చెప్పుకొనే ధోరణి ప్రజాస్వామ్య స్ఫూర్తిని అపహాస్యం చేస్తున్నట్లే కాగలదు.ఎన్నికల ప్రణాళికలో నిర్దుష్టమైన హామీలు, కార్యప్రణాళికలను ప్రజల ముందుంచే ప్రయత్నం చేయలేదు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రైతుల ఆందోళనలు, చైనా నుండి ఎదురవుతున్న ఆర్థిక దురాక్రమణలు వంటి తీవ్రమైన అంశాలను ప్రస్తావించే సాహసం చేయలేదు. కేవలం పక్షం రోజుల ముందు నియమించిన ఎన్నికల ప్రణాళిక కమిటీ ఓ ఎన్నికల ప్రసంగం మాదిరిగా 'సంకల్ప్ పత్ర'ను తయారు చేసినట్లు కనిపిస్తుంది. ఇప్పటికే అమలులో ఉన్న సంక్షేమ పథకాలను మరింత విస్తృతంగా, మరింత ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరే విధంగా అమలు పరుస్తామని, పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చేపడతామని, ఆయుధాలను దిగుమతి చేసుకొనే స్థాయి నుండి ఎగుమతి చేసే స్థాయికి దేశాన్ని తీసుకెడుతున్నామని.. ఇటువంటి కొన్ని అంశాలను ప్రముఖంగా ప్రస్తావించారు. వీటితో పాటు ఒకే దేశం ఒకే ఎన్నికలు, ఉమ్మడి పౌరస్మృతి అంశాలను కీలకంగా ప్రస్తావించారు.

ఆర్టికల్ 370 రద్దు కావడం, అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తి కావడంతో గత దశాబ్దాలుగా బిజెపి ఎన్నికల ప్రణాళికలలో కనిపించే ఈ అంశాలు ఇప్పుడు ప్రస్తావించాల్సిన అవసరం ఏర్పడలేదు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో శాంతిభద్రతలు మెరుగన్నట్లు పేర్కొనడం మినహా ఆ ప్రాంత సమస్యలను ప్రస్తావించలేదు. కొద్ది రోజుల క్రితమే జమ్మూ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోడీ త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని, తిరిగి రాష్ట్ర హెూదా లభిస్తుందని ప్రకటించారు. కనీసం ఆ అంశాలను ఇప్పుడు ప్రస్తావించే ప్రయత్నం చేయలేదు. 2019 ఎన్నికల ప్రణాళికలో దశాబ్దాల క్రితం ఉగ్రవాదం కారణంగా ప్రాణభయంతో ఇక్కడి నుండి పారిపోయిన కశ్మీరీ పండితులు తిరిగి గౌరవంగా వచ్చి, స్థిర నివాసం ఏర్పాటు చేసుకొనే విధంగా చూస్తామని బిజెపి హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ హామీకి తిలోదకాలిచ్చారు. కనీసం కశ్మీర్ లోయలో ప్రాణభయంతో ఉన్న కొద్ది మంది కశ్మీరీ పండితులలో స్థైర్యం నింపే ప్రయత్నాలు కూడా చేయడం లేదు. రెండేళ్లుగా తమ సమస్యలు చెప్పుకునేందుకు గవర్నర్‌ను కలిసేందుకు ప్రయత్నం చేస్తుంటే వారికి అవకాశం కలగడం లేదు. అదే విధంగా పశ్చిమ పాకిస్తాన్, ఆక్రమిత కశ్మీర్ వంటి ప్రాంతాలనుండి వచ్చే వారి పునరావాసం కోసం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇస్తామని 2019 ప్యాకేజీలో ఇచ్చిన హామీని ఇప్పుడు ప్రస్తావించలేదు. ఈశాన్య రాష్ట్రాల్లో అక్రమ వలసలను అరికట్టేందుకు జాతీయ పౌరసత్వ రిజిస్టర్ తయారు చేస్తామని 2019లో చేసిన హామీ గురించి ఇప్పుడు కనీసం ప్రస్తావించలేదు. ఈ విషయమై మాట్లాడేందుకు కూడా బిజెపి నేతలు ఎవ్వరూ సిద్ధపడటం లేదు. పైగా, ఇప్పుడు ఈశాన్య రాష్ట్రాలలో 'శాంతియుత పరిస్థితులు నెలకొల్పడం', రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదాలు పరిష్కరించడం, సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని దశలవారీగా ఉపసంహరించడం వంటి కొత్త అంశాలను ప్రస్తావించారు.

2019 ఎన్నికల ప్రణాళికలో 2022 నాటికి రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చారు. తాజా ఎన్నికల ప్రణాళికలో కనీసం ఆ అంశాన్ని ప్రస్తా వించనేలేదు. గత రెండు, మూడేళ్ళుగా రైతుల ఆదాయం గురించి బిజెపి నేతలు ఎవ్వరూ మాట్లాడటం లేదు. కనీసం వారి ఆదాయం ఏమేరకు పెరిగిందో కూడా చెప్పే ప్రయత్నం చేయడం లేదు. వీలయినంతగా వ్యవసాయ ఉత్పత్తులకు కనీసం మద్దతు ధర పెంచుతామని స్పష్టతలేని హామీ ఇవ్వడం మినహా ఈ విషయమై చట్టబద్ధమైన హామీ కోసం రైతులు చేస్తున్న ఆందోళనల గురించి స్పందన కనిపించడం లేదు. స్వయంగా ప్రధాన మంత్రి పార్లమెంట్‌లో ఈ విషయమై అధ్యయనం చేసేందుకు ఓ నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సుమారు ఏడాది తర్వాత ఓ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కానీ ఆ కమిటీ ఏమి చేస్తుందో ఎవ్వరికీ తెలియదు. ఈ విషయమై బిజెపి విధానం ఏమిటో చెప్పే ధైర్యం చేయలేకపోతున్నారు. మొదటి సారి మైనారిటీల గురించి బిజెపి ఎన్నికల ప్రణాళిక మౌనం వహిస్తున్నది. కేవలం, ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేయడం ద్వారా అనాగరికమైన ఇటువంటి విధానం అమలు నుండి ముస్లిం మహిళల సాధికారికతకు దోహదం చేశామని మాత్రమే పేర్కొన్నారు.

## గడివేముల లో గౌరు చరిత ప్రచారం



పాణ్యనీ నియోజకవర్గనీ- గడివేముల మండలం ఆళ్లగడ్డ, భుజునూరు,గ్రంథివేముల గ్రామలలో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాలలో పాణ్యం మాజీ ఎమ్మెల్యే టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత రెడ్డి పర్యటించారు. స్థానిక సమస్యలు తెలుసుకుంటూ రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లు సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో గ్రామాలలో అభివృద్ధి చేసే బాధ్యత నాది అని,ఈ వైసిపి ప్రభుత్వం లో ఏ అభివృద్ధి జరగలేదు అని,చంద్రబాబు గారిని ముఖ్యమంత్రి గా గెలిపించుకోవాల్సిన అవసరం మన రాష్ట ప్రజలకు చాలా అవసరం అని అభ్యర్థించారు. బుజునూరు గ్రామానికి సుబ్బారాయుడు తో పాటు 10 కుటుంబాలు గౌరు చరిత రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి,మురళీ రెడ్డి,చిందుకురు సర్పంచ్ అనసూయమ్మ, బిలకల గూడూరు రఫిక్,ఫరూఖ్ బుజునురు పంట రామచంద్ర రెడ్డి,దిలీప్ కుమార్ రెడ్డి,బొల్లవరం సుభద్రమ్మ, పెసరవాయి వద్దు లక్ష్మీ దేవీ, గ్రంధి వేముల రామ్మోహన్ రెడ్డి,సుధాకర్ రెడ్డి,రసూల్ జామల్, గని హర్ష,బిలకల గూడూరు ప్రకాష్ రెడ్డి,మరియు టీడీపీ బిజెపి జానసేనా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## అకాల వర్షాలు వస్తున్నాయి,

## రైతులు జాగ్రత్తలు పాటించాలి

## అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



జయశంకర్ భూపాలపల్లి, యాసంగి ధాన్యం విక్రయాల్లో రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం చిట్యాల మండలంలోని అందుకుతండా, గిద ముత్తారం గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అకాల వర్షాలు వస్తున్నాయని రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం అకాల వర్షాలకు తడవకుండా తగు చర్యలు చేపట్టాలని కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు తరలించాలన్నారు. రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు దాన్యం విక్రయించొద్దని,రైతులు పండించిన పంటకు మద్దతు ధర చెల్లించడానికి జిల్లాలో 189 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏ గ్రేడ్ రకం ధాన్యానికి 2203 రూపాయలు, బి గ్రేడ్ రకానికి 2183 రూపాయలు మద్దతు ధర కల్పించినట్లు తెలిపారు. నిర్ణయించిన కనీస మద్దుతు దరకంటే తక్కువకు విక్రయించొద్దని, ఎవరైనా తక్కువ ధరకు కొలుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రైతులు ఒకేసారి మూకుమ్మడిగా ధాన్యాన్ని మార్కెట్ తీసుకురాకుండా దశల వారిగా వ్యవసాయ అధికారులు సూచించిన తేదీల్లో కొనుగోలు కేంద్రాలను తీసుకురావాలని రైతులకు సూచించారు. రైతులు ధాన్యం విక్రయాలకు కొనుగోలు కేంద్రాలకు తెచ్చినపుడు వ్యవసాయ అధికారులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాసు పుస్తకం మొదటి రెండు పేజీలు, ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ పత్రాలను వెంట తెచ్చుకోవాలని ఆయన తెలిపారు.

## అందరికి అందుతున్న సంక్షేమ పథకాలు సజ్జల

పెనమలూరు ప్రభుత్వ సలహదారుడు సజ్జల రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు అందరికి అందుతున్నాయి. అజెండా లేకుండా, అధికారం కోసం చంద్రబాబు నాయుడు పోరాటం. 14 నుండి 19 వరకు ఉన్న చీకటి పాలన కావాలా, దేశానికే పేరుగాంచిన జగన్మోహన్ రెడ్డి కావాలా. పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు జోగి రమేష్ కు గతంలో వచ్చిన మెజారిటీ కంటే ఎక్కువ వస్తుంది. చంద్రబాబు నాయుడు వైసిపి పార్టీ కి అంకితం అయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ తెరపైన జగన్మోహన్ రెడ్డి ఒక వైపు, మిగతా పార్టీలు మరొక వైపని అన్నారు.

## తిరుమల శేషాచల కొండల్లో మంటలు

తిరుమల శేషాచలం కొండల్లో మంటలు చేలరేగాయి. పాపవినాశనం దగ్గర అడవిలో మంటలు వ్యాపించాయి. సవితో అటవి ఎండిపోవడంతో చాల దూరం వరకు మంటలు వ్యాపించాయి. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. మంటలను అదుపు చెయ్యడానికి అటవీశాఖ సిబ్బంది రంగంలోకి దిగారు.

## 2030 వరకు తెలంగాణ ఎడారిగా మారబోతుంది

### మీరు వింటున్నది నిజమే

### ప్రముఖ వ్యాసకర్త సయ్యద్ జావిద్ పాషా



కమాన్ పూర్ రాబోయే 2030 వరకు తెలంగాణ ప్రాంతం ఎడారిగా మారబోతుందని ప్రముఖ వ్యాసకర్త ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ కి చెందిన సయ్యద్ పాషా తెలిపారు.

తెలంగాణ ప్రాంతంలోని నది మానేరు పరిహక ప్రాంతాలలో ఇసుకను తీయడం వల్ల నీటిమట్టం పడిపోతుంది.

10 అడుగుల లోతులో ఉండే నీటి మట్ట ఇప్పటికే ముప్పై అడుగుల వరకు పడిపోయింది భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి ఇప్పటికే పంట పొలాల్లో నీరందకా రైతులు ఇబ్బంది పడుతున్నారు పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఇక తాగునీటికి ఇబ్బంది తప్పడం లేదు వర్షాకాలంలో ఎప్పుడో పోయిన వాన ఇంతవరకు జాడలేదు. వర్షాకాలంలో వర్షాలు అధికంగా పడిన నిల్వ చేసుకునే ప్రాజెక్టులు ఎన్ని ఉన్నా అవి తాగు నీటిని సరఫరా చేయడం భవిష్యత్తులో చాలా కష్టంగా మారబోతుంది . ఇక సాగునీరు విషయానికి వస్తే పంటలకు నీరు అందక రైతులు వ్యవసాయం మానుకునే పరిస్థితి ఏర్పడుతుంది. ఇక పల్లెల్లో పని లేక పల్లెవాసులంతా పట్నం పోయే పరిస్థితి ఏర్పడుతుంది. రైతులు పంటలు పండిస్తేనే మన 5 వేళ్ళు లోపలికి పోతున్నాయి. అలాంటి రైతుకు ఆధారమైన అటువంటి వనరులైన ఇసుకను తరలించడం వలన భవిష్యత్తులో ఏం జరుగుతుందో భయం వేస్తుంది. ప్రభుత్వాలు ఆదాయాన్ని తప్ప రైతుల భవిష్యత్తు గురించి ఆలోచించడం లేదు రైతులే దేశానికి వెన్నుముక అన్నారు

వెన్నుముకనే విరిగా కొట్టారు.

మన కంట్లోకి మన వేలును గుచ్చుకున్నట్టుంది . బాధ ఇప్పుడు తెలియకపోయినా భవిష్యత్తులో చాలా బాగా తెలుస్తుంది. ఇప్పటికైనా మొద్దు నిద్రను వీడి మన వనరులను మనం కాపాడుకుందాం. మన పిల్లల భవిష్యత్తును కాపాడుదాం.

## మున్సిపాలిటీలో నిరంతరాయంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు జరగాలి

### డ్రైనేజీలో వ్యర్థాలు వేయకుండా నియంత్రణ చేయాలి

### ప్రతి ఇంటి నుండి తడి, పొడి వ్యర్థాలు సేకరణ జరగాలి ...

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 22 మున్సిపాలిటీ లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ మిని కాన్ఫరెన్స్ హాలు నందు భూపాలపల్లి మున్సిపాలిటీలో పారిశుద్య కార్యక్రమాలు నిర్వహణపై మున్సిపల్, సింగరేణి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు శాఖల మధ్య సమన్వయ లేకపోవడం వల్ల పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా జరగడం లేదని అన్నారు. సింగరేణి సంస్థ పరిధిలోని అవాసాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాల్సిన బాధ్యత సంస్థదేనని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య. కార్యక్రమాలు నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందని, పారిశుద్ధ్య కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రతి రోజు ఇంటింటి నుండి తడి, పొడి వ్యర్ధాల సేకరణ జరగకపోతే అట్టి వ్యర్ధాలు మురుగు కాలువల్లో వేస్తుంటారని తద్వారా మురుగునీరు నిల్వలు పేరుకుపోతాయని అన్నారు. మున్సిపల్. కమిషనర్ సోమవారం నుండి అన్ని వార్డుల్లో ద్వి చక్ర వాహనంపై పర్యటించి అన్ని వార్డులను తనిఖీ చేయాలని తెలిపారు. ఎక్కడైనా వ్యర్థాలు పేరుకు పోతే తక్షణమే నోటీస్ జారీ చేసి ఫైన్ విధించాలని ఆదేశించారు. రామప్ప కాలానికి వెళ్ళు మార్గంలో వ్యర్ధాలు పేరుకుపోయానని ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పరిశుభ్రం చేయాలని సింగరేణి అధికారులకు సూచించారు. ప్రతి ఇంటి నుంచి తడి,పొడి వ్యర్ధాలు సేకరించాలని, నిరంతరాయంగా జరగకపోవడం వల్ల అపరిశుభ్రత ఏర్పడుతుందన్నారు.

వ్యర్థాలను ఆరుబయట వేస్తే జరిమానా విధించాలని అన్నారు. దుకాణాల ముందర వ్యర్థాలు వేయొద్దని వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేయాలని ఆయన సూచించారు. సింగరేణి, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పట్టణాన్ని పరిశుభ్రంగా తయారు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు,మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, సింగరేణి అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బహు ప్రత్యేకతల సమాహారం ఒంటిమిట్ట కోదండ రామాలయం

దుష్టశిక్షణ కోసం, శిష్ట రక్షణ కొరకు శ్రీ మహా విష్ణువు యుగయుగాలలో అవతరిస్తూ ఉంటాడు. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడుగా అవతరించి దండకారణ్యంలో సీతాలక్ష్మణ సమేతుడై సంచరించాడు. సీతాదేవి దప్పిక తీర్చడానికి భూమిలోనికి బాణం వేయగా నీటి బుగ్గ పుట్టింది. అదే ఒంటిమిట్టలోని రామతీర్థం అయింది. సీతాన్వేషణ కోసం, రావణ సంహారం కోసం శ్రీ రామచంద్రునికి సహకరించిన హనుమత్, సుగ్రీవాదులతో పాటు జాంబవంతుడున్నాడు. ఆయన ద్వాపరయుగం లోనూ ఉండి శ్రీ కృష్ణ భగవానునికి తన కూతురునిచ్చి పెండ్లి చేశాడు. ఆ జాంబవంతుడు సేవించిన సీతాలక్ష్మణ సమేత శ్రీ రామచంద్రుడే నేడు ఒంటిమిట్ట గుడిలో కొలువై ఉన్నాడు. ఒకే రాతిపై సీతారామ లక్ష్మణ దేవతా మూర్తులుండడం వల్ల ఒంటిమిట్టను ఏకశిలానగరం అని కూడా అంటారు. కోదండ రామాలయం భారతదేశంలోని ఆంధ్ర రాష్ట్రంలోని కడప జిల్లా వొంటిమిట్ట మండలంలో వొంటిమిట్ట పట్టణంలో ఉన్న రామ దేవునికి సంబంధించిన హిందూ దేవాలయం.. క్రీ.శ.1356లో బుక్కరాయలు ఆలయాన్ని ప్రారంభించాడు. ఆ తరువాత కాలంలో విజయనగర రాజులు, చాళుక్య రాజులు క్రమంగా గుడికి అంతరాలం, రంగమంటపం, మహాప్రాంగణం, గోపురాలు, రథం నిర్మించారు. ఒంటిమిట్ట చుట్టుప్రక్క గ్రామాల రాబడి ఆలయ కైంకర్యాలకు వినియోగించారు. ఈ దేవాలయం మూడు దఫాలుగా నిర్మించారు. 14 శతాబ్దంలో ప్రారంభమై 17 శతాబ్దానికి పూర్తి అయినట్లు ఇక్కడ ఉన్న శాసనాలు తెలుపుతున్నాయి విజయనగర నిర్మాణ శైలిని పోలి ఉన్న ఆలయం ఇది.

ఒంటడు, మిట్టడు అనే ఇద్దరు దొంగలు ఇక్కడ రాముణ్ణి కొలిచి తమ వృత్తిని మానుకుని నిజాయితీగా బ్రతికారని, వారి పేరు మీదుగానే ఒంటిమిట్ట అని పేరు వచ్చిందని ఇంకొక కథనం కూడా ఉంది. మిట్టను సంస్కృతంలో శైలమంటారు. ఈ ఆలయంలో సీతారామలక్ష్మణులు ఒకే రాతిలో చిత్రించబడ్డారు. కాబట్టి ఏకశిలానగరమనీ పేరు వచ్చింది. హనుమంతుడు లేని రామాలయం భారతదేశంలో ఇదొక్కటే. ఈ గ్రామాన్ని గురించి తొలి తెలుగు యాత్రాచరిత్రయైన కాశీయాత్ర చరిత్రలో ప్రస్తావనలున్నాయి. ఆ గ్రంథకర్త ఏనుగుల వీరాస్వామయ్య కాశీయాత్రలో భాగంగా మజిలీలైన అత్తిరాల నుంచి భాకరాపేట వెళ్ళే మార్గమధ్యలో ఒంటిమిట్టను దాటి వెళ్ళారు. దీనివల్ల 1830 నాడు గ్రామ స్థితిగతులు తెలియవస్తున్నవి. అప్పటికి గ్రామంలో నాల్గుపక్కల కొండలే కలిగిన భారీ చెరువున్నది.

చెరువు కట్టమీద ఉన్న బాటపైనే వారి ప్రయాణం సాగింది. ఆ ఒంటిమిట్టలో చూడచక్కనైన గుళ్ళు ఉన్నాయన్నారు. గ్రామంలో ఓ ముసాఫరుఖానా యాత్రికుల నిలయం ఉండేదని, అప్పటికే అది బస్తీ గ్రామమని పేర్కొన్నారు. రామ లక్ష్మణులు చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు, విశ్వామిత్రుడు వారిని తమ యాగరక్షణకు తీసుకు వెళ్ళాడు. సీతారామ కల్యాణం జరిగాక కూడా, అలాంటి సందర్భమే ఒకటి ఏర్పడింది. అప్పుడు మృకండు మహర్షి, శృంగి మహర్షి రాముని ప్రార్థించడంతో దుష్టశిక్షణ కోసం, ఆ స్వామి సీతా లక్ష్మణ సమేతుడై అంబుల పొది, పిడిబాకు, కోదండం, పట్టుకుని ఈ ప్రాంతానికి వచ్చి యాగ రక్షణ చేశాడని పురాణం చెబుతుంది. అందుకు ప్రతిగా ఆ మహర్షులు సీతారామ లక్ష్మణుల విగ్రహాలను ఏకశిలగా చెక్కించారనీ, తరువాత జాంబవంతుడు ఈ విగ్రహాలను ప్రాణప్రతిష్ఠ చేశారనీ ఈ ప్రాంత ప్రజల విశ్వాసం.

ఆలయ మండపంలో 32 స్తంభాలు ఉన్నాయి, ఈ ఆలయ ప్రధాన విగ్రహం రాముడు కోదండ రామ స్వామిగా పూజించబడ్డాడు. కుడి చేతిపై విల్లు, ఎడమ చేతిలో బాణం, ఒకే రాతితో చేసిన సీత మరియు లక్ష్మణుడితో పాటు నిలబడి ఉన్న భంగిమలో ఉన్నాడు. ఇక్కడ పరమేశ్వరుని లింగం, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, భ్రమరాంబ, నందీశ్వరుడు, భృంగీశ్వరుడు, కాలభైరవుల విగ్రహాలు కొలువై ఉన్నాయి. ఎందరో మహాకవులు శ్రీరామచంద్రుని కరుణకు పాత్రులైనారు. పోతన ఇక్కడే భాగవతాన్ని తెనిగించి నట్లు చెపుతారు. అయ్యలరాజు తిప్పయ్య ఒంటిమిట్ట శ్రీ కోదండరామునిపై రఘువీరశతకం రచించి, అంకితమిచ్చారు. రామభద్రకవి రామాభ్యుదయమును రచించారు. నల్లకాల్వ అయ్యప్ప ఒంటిమిట్ట రాముని వరం పొంది వరకవి అయ్యారు. ఉప్పుగుండూరు వేంకటకవి ఒంటిమిట్ట దశరథరామ శతకం రచించారు. ఆంధ్రవాల్మీకిగా ప్రసిద్ధి పొందిన వావిలికొలను సుబ్బారావు గారు ఆంధ్రవాల్మీకి రామాయణం మందరవ్యాఖ్యతో రచించారు. తాళ్ళపాక అన్నమయ్య రామునిమీద సంకీర్తన చెప్పారు.శ్రీ కోదండరామస్వామివారి దేవాలయాన్ని దేవదాయ ధర్మాదాయశాఖ నుంచి 9-9-2015వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం విలీనం చేసుకున్నది. ఈ సంవత్సరం స్వామి వారి క్షేత్రంలో ఏటా శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఒంటిమిట్టలో ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ నవమి నుండి బహుళ విదియ దాకా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. చతుర్దశి నాడు కళ్యాణం, పౌర్ణమి నాడు రథోత్సవం ఉంటాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 23న రథోత్సవం, ఏప్రిల్ 25న చక్రస్నానం, ఏప్రిల్ 26న పుష్పయాగము నిర్వహించనున్నారు.

# కొల్హాపూర్ మహాలక్ష్మి రథోత్సవం

ప్రతి సంవత్సరం చైత్ర మాసంలో చైత్ర పౌర్ణమి రోజున ఈ ఉత్సవం జరుగుతుంది. ఈ ఏడు ఏప్రిల్ 23వ తేదీన మంగళ వారం లక్ష్మీ దేవి మూర్తిని కలిగి ఉన్న రథాన్ని రాత్రి 7:30 నుండి ఊరేగింపుగా తీసుకు వెళతారు.. ఈ సందర్భంగా వెండి రథాన్ని ప్రత్యేక దీపాలు, పూలతో అలంకరించారు. హిందూ సాంప్రదాయంలో లక్ష్మీదేవిని పూజించడం సర్వత్రా కనిపించే దయినా, అనునిత్యం పూజలందుకునే శ్రీమహాలక్ష్మికి మన దేశంలో విడిగా వున్న ఆలయాలు తక్కువే. లక్ష్మీదేవికి ప్రత్యేకించి వున్న ఆలయాలలో కొల్హాపూర్ ఆలయం ముఖ్యమయినది. ఈ ఆలయం మహారాష్ట్రలోని కొల్హాపూర్ లో పంచగంగ నది ఒడ్డున బెంగళూరు మరియు పూణే మధ్య జాతీయ రహదారిపై ఉంది. ఇది అమ్మవారి అష్టాదశ శక్తి పీఠాలలో ఏడవది. స్కాంద పురాణం, దేవీ భాగవతాలలోఈ క్షేత్రాన్ని కరవీర నగరమని, దేవిని కరవీర మహాలక్ష్మి అని ప్రస్తుతించారు. పరమశివుడికి కాశీ ఎలా అవిముక్త క్షేత్రమో, శ్రీ మహావిష్ణువుకి, లక్ష్మీదేవికి ఇది అవిముక్త క్షేత్రం. వారీ క్షేత్రాన్ని ఎప్పుడూ విడవకుండా వుంటారు. అగస్త్య మహాముని అచంచల శివభక్తుడు. ఏటా కాశీ వెళ్లి విశ్వనాథుణ్ణి దర్శించుకునేవాడు. వృద్ధాప్యంలో అగస్త్యుడికి సుదూరంలో ఉన్న కాశీనగరాన్ని దర్శించుకోవడం కష్టమనిపించి, శివుడి గురించి తపస్సు చేయగా, శివుడు ప్రత్యక్షమై, వరం కోరుకోమన్నాడు. అగస్త్యుడు తాను వయోభారంతో ఏటా కాశీలో ఉన్న విశ్వనాథుణ్ణి దర్శించుకోలేకపోతున్నానని, కాశీకి ప్రత్యామ్నాయంగా తనకో క్షేత్రాన్ని చూపిస్తే, అక్కడే తాను శివుణ్ణి దర్శిస్తానని కోరాడు.

కాశీతో సమానమైన ప్రాశస్త్యం గల నగరం కొల్హాపురమని, అక్కడ శ్రీ మహాలక్ష్మి అమ్మవారు కొలువై ఉన్న క్షేత్ర సందర్శనం తనను కాశీలో దర్శించుకున్నంత పుణ్యఫలాలనిస్తుందని చెప్పాడట.శివుని ఆనతిమేరకు అగస్త్యుడు కొల్హాపూర్‌లో మహాలక్ష్మిని, అతిబలేశ్వరస్వామిని దర్శించి పునీతుడయ్యాడని ఇక్కడి స్థలపురాణాల ద్వారా స్పష్టం అవుతున్నది. ప్రళయకాలంలో శివుడు తన త్రిశూలంతో కాశీ పట్టణాన్ని ఎత్తి రక్షించినట్లు, మహాలక్ష్మి ఈ క్షేత్రాన్ని తన కరములతో ఎత్తి రక్షించింది. అందుకే ఆమె కరవీర మహాలక్ష్మి అయింది అంటారు. భృగు మహర్షి చేసిన అవమానాన్ని తట్టుకోలేని మహాలక్ష్మి వైకుంఠాన్ని విడిచి సహ్యాద్రి పర్వత ప్రాంతంలోని కొల్హాపూర్‌లో వెలిశారని ఒక కథ. శంకరాచార్యులవారు ఈ ఆలయాన్ని దర్శించి ఇక్కడ శ్రీ చక్రాన్ని స్థాపించారు. తర్వాత విద్యాశంకర భారతి ఈ క్షేత్ర వైశిష్ట్యాన్ని గుర్తించి ఇక్కడ ఒక మఠం నిర్మించారు. దత్తాత్రేయుడు ప్రతి రోజూ మధ్యాహ్నం ఇక్కడ భిక్ష చేస్తారని ప్రతీతి. దానికి చిహ్నంగా ఇక్కడ ఆయనకి ఉపాలయం వున్నది. షుమారు 6 వేల సంవత్సరాల క్రితం ఆలయంగా భావిస్తారు. తర్వాత అనేక రాజుల సమయాలలో అభివృద్ధి చెందిన ఈ మందిరం విశాల ప్రాంగణంలో హేమాడ్ పంత్ శైలిలో, శిల్పకళా నైపుణ్యంతో నిర్మింపబడింది. 7 వ శతాబ్దం లోని ఈ దేవాలయాన్ని చాళుక్య వంశ రాజైన కరన్దేవ్ తిరిగి చాలాకాలం తరువాత దీని నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పవిత్ర స్థల నిర్మాణ శైలి హేమండ్ పతి ప్రేరణతో చేయబడింది. ఈ ఆలయాన్ని యాదవ వంశీయులు 8 వ శతాబ్దంలో మరింత అందంగా తీర్చిదిద్దారని చెపుతారు. ఈ నగరాన్ని కోల్‌పూర్ అని కోల్‌గిరి అని, కొలదిగిరి పట్టణ్ అని పిలిచేవారు.

‘కొల్లా’ అంటే ‘లోయ’అని, ‘పూర్’ అంటే పట్టణమనే అర్థంలో ఈ క్షేత్రం విలసిల్లిందని చెబుతారు. కొల్హాపూర్ క్షేత్రాన్ని 1359వ సంవత్సరం వరకు శివాజీ మహారాజు పూర్వికులు పాలించగా, 17వ శతాబ్దంలో ఛత్రపతి శివాజీ ఏలుబడిలో దినదిన ప్రవర్ధమానమైందని తెలుస్తోంది.నాలుగు దిక్కులా ముఖద్వారాలు కలిగి ఆలయం 5 గోపురాలకింద వుంటుంది. మధ్యలో ఒక గోపురం, నాలుగు దిక్కులా నాలుగు గోపురాలు. తూర్పు గోపురం కింద మహాలక్ష్మి, మధ్య కుమార మండపం, పడమర గణపతి, ఉత్తర దక్షిణ గోపురాల కింద మహాకాళి, మహా సరస్వతి కొలువుతీరి వున్నారు. ఉపాలయాలలో వెంకటేశ్వరస్వామి, నవగ్రహాలు, రాధాకృష్ణ, కాలభైరవ, వినాయకుడు, సింహవాహిని, తుల్జాభవాని వగైరా అనేక దేవీ దేవతలున్నారు.గర్భగుడిలో అమ్మవారి విగ్రహం సుమారు ఆరడుగుల చదరంగా ఉన్న ఎత్తైన వేదిక మీద రెండడుగుల పీఠం, దానిమీద మహాలక్ష్మి కూర్చొని ఉన్న భంగిమలో ఉంటుంది. చతుర్భుజి. నాలుగు చేతులలో పండు, గద, డాలు, పానపాత్ర ధరించి వుంటుంది మూడడుగుల ఎత్తున్న మూర్తి, అనేక ఆభరణాలతో సుసజ్జిత. చాలా అందంగా ఆకర్షణీయంగా ఉంటుంది. వెనుక సింహ వాహనము కనబడుతుంది. మూలవిరాట్ పడమటి ముఖంగా వుంటుంది.ఇక్కడ సూర్యకిరణాలు ప్రతిరోజూ దేవతా విగ్రహానికి బంగారు సొగసులు అందిస్తూ తాకే విధంగా ఈ ఆలయం నిర్మించబడింది.

సంవత్సరానికి 2, 3 సార్లు...సూర్యాస్తమయం అయినపుడు సూర్యుని కిరణాలు ఈ కిటికీ గుండా ప్రతి సంవత్సరం 21 మార్చి, 21 సెప్టెంబరు లలో మూడు రోజులపాటు విగ్రహంపై పడతాయి. పడమటి దిక్కులోగల చిన్న కిటికీగుండా అమ్మవారి ముఖాన్ని తాకుతాయి. ఈ ప్రత్యేక దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. గర్భగుడి గోడపై శ్రీచక్రం వుండటం ఇక్కడ ప్రత్యేకం... మొదట ఒక్క మహాలక్ష్మినే ప్రతిష్టించారు. తర్వాత 11వ శతాబ్దంలో గండరాదిత్య హయాంలో మరమ్మత్తులు, ప్రదక్షిణబాట, మహాకాళీ, మహాసరస్వతి ప్రతిష్ట జరిగాయి. మూలవిరాట్ కి మహాకాళికి మధ్య మహలక్ష్మి యంత్రం స్థాపించ బడింది. దీనిపైన గాజుపలక వుండటంతో భక్తులు దర్శించుకోవటానికి వీలుగా వుంటుంది. మహారాష్ట్రీయులకు కొల్హాపూర్ మహాలక్ష్మి అత్యంత పవిత్ర యాత్రాస్థలం. వీరు అమ్మవారిని ‘అంబాబాయి’ అని పిలుస్తారు. అమ్మవారికి రోజూ అయిదు సార్లు అర్చన జరుగుతుంది. ఉదయం అయిదు గంటలకు శ్రీ మహా లక్ష్మీ దేవికి సుప్రభాత సేవ చేస్తారు. కాకడ హారతి ఇస్తారు. ఉదయం ఎనిమిది గంటలకు షోడశోపచార పూజ నిర్వహిస్తారు. మధ్యాహ్నం, సాయంత్రాలలో పూజ, శేజ్ హారతి జరుపుతారు. అమ్మవారికి ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. చైత్రమాసంలో వచ్చే పౌర్ణమితో పాటుగా నవరాత్రులపుడు అమ్మవారికి వేడుకలు జరుపుతారు. ప్రతి శుక్రవారం సాయంత్రాలలో, పౌర్ణమి నాడు, అమ్మవారిని ఆలయం వెలుపల ఊరేగిస్తారు.

# సినీ వినీలాకాశంలో ధృవతార సత్యజిత్ రాయ్

సత్యజిత్ రాయ్... సినిమాల గురించి ఏ కొంచెం అవగాహన ఉన్నా, ఈ పేరు సుపరిచితమే. ప్రపంచం లోని సినీ దర్శకులలో అగ్రశ్రేణికి చెందిన ప్రతిభాశాలి సత్యజిత్ రాయ్. దర్శకత్వం మటుకే కాక, కథారచన, స్క్రీన్ ప్లే, ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ, సంగీత దర్శకత్వం, కళా దర్శకత్వం ఇలా సినిమాలకు సంబంధించిన శాఖలలోనే కాకుండా చిత్రకళ లోనూ, సాహిత్యం లోనూ సాటి లేని మేటిగా తనదైన ప్రత్యేకత చాటుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి. సత్యజిత్ రాయ్ (మే 2 1921-ఏప్రిల్ 23 1992) భారత దేశంలోని బెంగాల్ రాష్ట్రానికి చెందిన సినీ దర్శకుడు, రచయిత. అయన ప్రపంచ సినిమాలో 20వ శతాబ్దపు ఉత్తమ దర్శకుల్లో ఒకడుగా పేరు గడించారు. కలకత్తాలో బెంగాలీ కళాకారుల కుటుంబములో జన్మించి ప్రెసిడెన్సీ కాలేజ్‌లో ఎకనామిక్స్ చదువుకున్న సత్యజిత్ 1940-41లో తమ కుటుంబానికి మిత్రుడైన రవీంద్ర నాథ ఠాకూర్ బతికుండగానే శాంతినికేతన్ వెళ్ళి చిత్రకళ అభ్యసించారు. సినిమాలూ, గ్రామఫోన్ రికార్డ్ల మోజుతో 1942లో కలకత్తాకు తిరిగి వచ్చారు. 1943 నుంచి సుమారు పన్నెండేళ్ళపాటు ఒక బ్రిటిష్ అడ్వర్టైజింగ్ కంపెనీలో పని చేశాక సినీ రంగంలో కాలు మోపారు. 1955లో పథేర్ పాంచాలీ సినిమాకు దర్శకత్వం వహించిన తరవాత దర్శకుడుగా దేశవిదేశాల్లో పేరు సంపాదించు కున్నారు. అంతకు ముందే కలకత్తా ఫిల్మ్ సొసైటీని స్థాపించడంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. 1949లో కలకత్తాకు వచ్చిన ప్రసిద్ధ ఫ్రెంచ్ దర్శకుడు ఝూఁ రెన్వార్ వెంట తిరిగి సమకాలీన సినిమా గురించి అవగాహన చేసుకున్నారు.

సంవత్సరానికి ఒక సినిమా చొప్పున అతను దర్శకత్వం వహించిన సినిమాలన్నీ ప్రపంచ ప్రసిద్ధిని పొందాయి. కొన్ని బెంగాలీ సాహిత్యం నుంచి తీసుకున్న కథలైతే కొన్ని స్వయంగా రాసుకున్నవి. సీరియస్ కళాఖండాలే కాక పిల్లల కోసం సాహసాలూ, హాస్యంతో కూడిన సినిమాలూ తీశారు. సున్నితమైన హాస్యం, వ్యంగ్యం, వాస్తవిక జీవిత చిత్రణ, అపూర్వం అనిపించే సినీ పరిభాషా, కళా నైపుణ్యం అడుగడుగునా ఆయన సినిమాల్లో కనిపిస్తాయి. ప్రపంచంలోని ఫిల్మ్ ఇన్స్టిట్యూట్‌లన్నీ ప్రత్యేకంగా అధ్యయనం చేసే దర్శకుల్లో రాయ్ ఒకరు. రవీంద్రుడి ‘చారులతా’ మొదలుకొని పిల్లల సినిమా ‘గోపీ గాయేన్’ వంటి జానపద చిత్రాలూ, హిందీలో ప్రేంచంద్ కథ ఆధారంగా ‘శత్‌రంజ్ కే ఖిలాడీ’, రవీంద్రనాథ ఠాకూర్ మీద అద్భుతమైన డాక్యుమెంటరీ ఒకటీ ఇలా ప్రతీ ఒక్కటీ కళాఖండం అనిపించేట్టుగా నిర్మించారు. ఆయనకు దర్శకత్వమే కాక, సినిమా తీయడంలోని ఇతర విభాగాల పట్ల కూడా మంచి పట్టు ఉండేది. తమ సినిమాలో చాలా వాటికి స్క్రీన్ ప్లే, కేస్టింగ్, సంగీతము, సినిమాటోగ్రఫీ, కళా దర్శకత్వము, కూర్పు, పబ్లిసిటీ డిజైన్ చేసుకోవడము - వంటివి కూడా ఆయనే చూసుకునేవారు. రాయ్ సినిమాలు, లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలు కలిపి మొత్తము ముప్పై ఏడు చిత్రాలకు దర్శకత్వము వహించాడు. ఆయన మొదటి సినిమా పథేర్ పాంచాలీ, కేన్స్ చలనచిత్రోత్సవములో 11 అంతర్జాతీయ బహుమతులు గెలుచుకుంది. కంప్యూటర్ ఫాంట్‌లు వ్యాప్తిలోకి రాకముందే రాయ్ బెంగాలీ అక్షరమాలలో కొత్త శైలులని ప్రవేశపెట్టారు. బెంగాలీలో అనేక కథలూ, వ్యాసాలూ, నవలలూ కూడా రాశారు. సైన్స్ ఫిక్షన్, డిటెక్టివ్ సాహిత్యం మొదలైన ప్రత్యేక విషయాల గురించి కథలు రాసి, ఫేలూ దా మొదలైన పాత్రలతో జైసల్మేర్ కోట నేపథ్యంతో ‘షోనార్ కెల్లా’ వగైరా సినిమాలు కూడా తీశారు.

బెంగాలీ సంస్కారాన్నీ, భారతీయతనూ ఒంట పట్టించుకుని ప్రపంచ స్థాయికి ఎదిగిన సత్యజిత్ రాయ్ ఏ ప్రక్రియను చేపట్టినా ప్రతిభా వంతంగా నిర్వహించ గలిగారు. తన చిన్నతనంలోనే ఆర్థర్ కోనన్ డాయిల్ డిటెక్టివ్ కథలనూ, ఎచ్.జి.వెల్స్ తదితరుల సైన్స్ ఫిక్షన్ సాహిత్యాన్నీ అభిమానించే వారు. సత్యజిత్ రాయ్ పిల్లల కోసం “ఫెలూదా” అన్న డిటెక్టివ్ ని సృష్టించారు. 1965 మొదలుకుని 1994 దాకా 35 ఫెలూదా నవలలు రాసారు. ఇందులో - ఫెలూదా, అతని కజిన్ తపేష్, జటాయు అని పిలువబడు లాల్ మోహన్ గంగూలీ ప్రధాన పాత్రలు. వీరు ముగ్గురు కలిసి పరిష్కరించే సమస్యల సంకలనమే ఫెలూదా కథలు. ఇది కాక సత్యజిత్ రాయ్ ప్రొఫెసర్ శొంకు అన్న మరో పాత్రని కూడా సృష్టించి నవలలు రాసారు. బెంగాలీ పిల్లల సాహిత్యంలో ఈ రెండు పాత్రలకి ఓ విశిష్ట స్థానం ఉంది.సినిమాలు తీయడమే కాక రాయ్ ఎన్నో పుస్తకాలు, వ్యాసాలు కూడా రాసాడు. అలాగే, ఆయన ప్రచురణ కర్త కూడా. బెంగాలీ పిల్లల పత్రిక “సందేశ్”ను చాలా ఏళ్ళు నిర్వహించాడు. అనేక అవార్డులు పుచ్చుకున్న రాయ్ 1992 లో ఆస్కార్ కూడా అందుకున్నారు. 40 ఏళ్ళు సినీరంగంలో ఓ వెలుగు వెలిగి, మరణించేందుకు 23 రోజుల ముందు ఆ పురస్కారాన్ని స్వీకరించి, ఆస్కార్ పురస్కాన్ని అందుకున్న తొలి భారతీయునిగా, ఆపైన భారతరత్న పురస్కారం పొందిన తొలి చలనచిత్ర రంగ ప్రముఖునిగా నిలిచారు. సత్యజిత్ రాయ్ మరణానంతరం భారత ప్రభుత్వ తపాలా శాఖ ఆయన పై ఓ స్టాంపును విడుదల చేసింది.

# ఆంగ్ల సాహిత్య శిఖరం విలియమ్ షేక్స్‌ఫియర్

23 ఏప్రిల్ 1564న ఇంగ్లాండ్, స్టాన్ఫర్డ్‌లోని తోలు వ్యాపారి కుటుంబంలో మేరీ ఆర్డన్, జాన్ షేక్స్‌ఫియర్ దంపతులకు జన్మించిన విలియమ్ షేక్స్‌ఫియర్ 26 ఏప్రిల్‌న బాప్టిజమ్ స్వీకరించారు. విలియమ్ షేర్స్‌ఫియర్ తల్లితండ్రులతో పాటు సంతానం కూడా నిరక్షరాస్యులే అయినప్పటికీ విలియమ్ షేక్స్‌ఫియర్ మాత్రమే ప్రపంచ ఆంగ్ల సాహిత్య చరిత్రలో చెరగని ముద్రను వేశారు. ప్రఖ్యాత నాటక రచయిత, కవి, రంగస్థల నటుడైన షేక్స్‌ఫియర్ స్ట్రాట్‌ఫర్డ్ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. ‘ఇంగ్లాండ్ జాతీయ కవి’గా పేరుగాంచిన షేక్స్‌ఫియర్ 39 నాటకాలు, 154 సోనెట్స్, మూడు దీర్ఘ కవితలు, ఇతర రచనలు ఎన్నో చేశారు. వారు రచించిన అత్యద్భుత నాటకాలను అనేక ప్రపంచ భాషల్లోకి కూడా అనువదించారు. తన 18వ ఏట 26 ఏండ్ల వయస్సుగల ‘అన్నే హాత్‌వే’ను వివాహమాడి ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చారు. ప్రథమ సంతానంగా 1583లో కూతురు ‘సుసన్నా’, 1585లో కవల పిల్లలు ‘హామ్‌నెట్’, ‘జూడిత్’లు జన్మించారు. 1985 తరువాత 7 సంవత్సరాలు ఏమి చేశారో తెలియని (బహుశ ఉపాధ్యాయుడిగా లేదా వేటగాడిగా చేసి ఉండవచ్చని) అజ్ఞాత చరిత్రను ‘లాస్ట్ ఇయర్స్’గా రికార్డు చేశారు.

షేక్స్‌ఫియర్ ప్రముఖ రచనల్లో హామ్లెట్, రోమియో అండ్ జూలియట్, ఒథెల్లో, కింగ్ లియర్, కింగ్ జాన్, జూలియస్ సీజర్, క్వీన్ ఎలిజబెత్, మర్చంట్ ఆఫ్ వెన్నిస్, 3 భాగాల హెన్రీ ?%ు%, కామెడీ ఆఫ్ ఎరర్స్, ది టెంపెస్ట్, మాక్‌బెత్ లాంటి అనేక సాహిత్య కళాఖండాలు ఉన్నాయి. నాటి సాంప్రదాయ కుటుంబ శైలికి దగ్గరగా ఉండేలా, నూతనత్వం మేళవించి, ప్రేమల నుండి యుద్ధాల వరకు ఆకర్షణీయంగా, వాస్తవానికి దగ్గరగా, తనదైన సరళ శైలిలో తన రచనలను చేశారు. విశ్వవిద్యాలయ విద్య కూడా చదవని విలియమ్ షేక్స్‌ఫియర్ తన జీవిత కాలంలో హాస్య, ప్రేమకథా, చారిత్రక, విషాద రచనలు ఎన్నో చేశారు. తన వ్యక్తిగత జీవితం గూర్చి స్పష్టమైన వివరాలు తెలియనప్పటికీ, ఆయన రచనల్లో మానవీయ భావోద్వేగాలు, సంఘర్షణలు గత నాలుగు శతాబ్దాలుగా కొనయాడబడుతున్నవి.

విలియమ్ షేక్స్‌ఫియర్ ప్రపంచ ప్రఖ్యాత అత్యుత్తమ ఆంగ్ల సాహిత్యకారుడే అయినప్పటికీ, అతని జీవిత విశేషాలు సవివరంగా తెలియక పోవడం విచారకరం. తన జన్మదినం రోజుననే తన 52వ ఏట 23 ఏప్రిల్ 1616న తుది శ్వాస విడవడం జరిగింది. విలియమ్ షేక్స్‌ఫియర్ భౌతికంగా మన ముందు లేకపోయినా, తన నాణ్యమైన రచనలు కాలం ఉన్నంత వరకు మనల్ని నడిపిస్తూ, ఉల్లాస పరుస్తూ, జీవిత కష్ట సుఖాలను రుచి చూపిస్తూ, విశ్వ మానవాళికి మార్గదర్శకంగా ఉంటాయనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.ఖ

## ఏజెన్సీలో గర్భిణీల కష్టాలు

కాకినాడ, ఏప్రిల్ 22 ఏజెన్సీలో గర్భిణీల కష్టాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఆస్పత్రికి వెళ్లేందుకు కనీస సదుపాయాలు లేక, డోలీలనే నమ్ముకోవాల్సి వస్తుంది. తాజాగా అల్లూరి జిల్లాలో మరో ఘటన వెలుగులోకి వచ్చింది.అల్లూరి జిల్లా డుంబ్రిగూడ మండలం బొడ్లమామిడిలో నిండు గర్భిణీకి డోలి కష్టాలు ఎదురయ్యాయి. రోడ్డు సదుపాయం సరిగా లేక అంబులెన్స్ రాలేక సన్యాసమ్మ అనే గర్భిణీ నరకయాతన అనుభవించింది. దాదాపు రెండు కిలోమీటర్లు డోలి మోత మోయాల్సి వచ్చింది. పక్కా రోడ్డు నిర్మించాలని విన్నవిస్తున్నారు స్థానిక గిరిజనులు.డుంబ్రిగుడ మండలం కొల్లాపూట్ పంచాయతీకి చెందిన బొడ్ల మామిడి గ్రామస్తురాలు సన్యాసమ్మకు డెలివరీ సమయం కావడంతో పురిటి నొప్పులు మొదలయ్యాయి. వెంటనే 108కు గ్రామస్తులు ఫోన్ చేశారు. అయితే గ్రామం వరకు రోడ్డు సరిగా లేక.. అంబులెన్స్ రాలేదని డ్రైవర్ చెప్పాడు. దీంతో ఇక చేసేది లేక సన్యాసమ్మకు డోలి కట్టారు. రెండు కిలోమీటర్లు డోలిమోత మోసుకెళ్ళి గ్రామస్తులు అంబులెన్స్ ఎక్కించారు.రోడ్డు పనులు ప్రారంభించి చాలాకాలం అవుతున్నా పూర్తి కాకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా రోడ్లు భవనాల శాఖ రోడ్డు మరమ్మత్తులు పూర్తి చేసి ముమ్ముందు తమకు ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సంచలనంగా మారిన వీడియో

విజయవాడ, ఏప్రిల్ 22 ఏపీలో రాజకీయాల్లో ఓ వీడియో సంచలనంగా మారింది. రాజకీయాల్లో ఒక్కసారిగా హీట్ పెంచింది. టీడీపీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీడియోను వైసీపీ రిలీజ్ చేసింది. వైసీపీ 147 స్థానాల్లో ముందంజలో ఉన్నట్లు అధికార పార్టీ రిలీజ్ చేసిన టీడీపీ వీడియోలో ఉంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. టీడీపీ అంతర్గత సమావేశానికి సంబంధించిన వీడియోను వైసీపీ విడుదల చేసింది.అందులో వైసీపీ గెలుపు అంచనాలపై డిస్కషన్ జరిగినట్లుగా ఉంది. టీడీపీ స్టేట్ ఎలక్షన్ సెల్ కోఆర్డినేటర్ గా ఉన్న కోనేరు సురేశ్ టీడీపీ నేతలకు చెబుతున్న వివరాలు ఆ వీడియోలో ఉన్నాయి. గడిచిన ఎన్నికల్లో ఓట్ల షేరింగ్ ఏ విధంగా జరిగింది, రానున్న రోజుల్లో ఓట్ల షేరింగ్ ఏ విధంగా జరగబోతోంది? అన్నది పూర్తిగా వివరిస్తూ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారుఇందులో భాగంగానే 147 స్థానాల్లో వైఎస్ఆర్ సీపీ ముందుంది అని టీడీపీ నేతలే ఒప్పుకున్నారు, అందుకు సంబంధించిన వీడియోను మేము బయటపెడుతున్నాం అంటూ వైసీపీ విడుదల చేసింది. వైసీపీ 147 స్థానాల్లో ముందుంది అని స్వయంగా టీడీపీనే ఒప్పుకుంది, అందుకు సాక్ష్యం ఇదిగో అంటూ వీడియోను వదిలింది వైసీపీ.టీడీపీ సంచలన వీడియో లీక్.. ఓటమిని ముందే ఒప్పుకున్న టీడీపీ.. రాష్ట్రంలో 147 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసీపీ ముందంజలో ఉందని టీడీపీ ఒప్పుకుంది. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా టీడీపీ నేతలకు ఆ పార్టీ స్టేట్ ఎలక్షన్ సెల్ కోఆర్డినేటర్ కోనేరు సురేశ్ దిశానిర్దేశం చేశారు” అంటూ వీడియోను జతపరిచి ట్వీట్ చేసింది

# రాయలసీమపై కాంగ్రెస్ దృష్టి

తిరుపతి, ఏప్రిల్ 22 ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీని షర్మిల వ్యూహాత్మకంగా ఎన్నికల పోరాటంలో బరిలో నిలుపుతున్నట్లుగా కనిపిస్తోంది. ఏపీ కాంగ్రెస్ వ్యవహారాలపై తెర వెనుక కొంత మంది సీనియర్లు పని చేస్తున్నారు. కేవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి లాంటి వాళ్లు బయట పెద్దగా కనిపించడం లేదు. కానీ తెర వెనుక మాత్రం చురుగ్గా వ్యవహరిస్తున్నారు. వైసీపీలో అసంతృప్తికి గురైన నేతల్ని తీసుకుని పోటీకి ఒప్పిస్తున్నారు. రాయలసీమతో పాటు కోస్తాలో బలమైన నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రచారం చేస్తున్నారు. అయితే వీరి వ్యూహాలన్నీ గెలవడానికి కాదు.. ఓడించగలిగే శక్తి ఉందని నిరూపించడానికి అన్నట్లుగా రాజకీయం నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీ బలాన్ని రాయలసీమలో బలంగా చూపించేలా షర్మిల ప్రయత్నం చేస్తున్నారు. విస్తృత పర్యటనలు చేస్తున్నారు. కడప పార్లమెంట్ నియోజవకర్గం మొత్తం ఓ సారి సంచలనం రేపారు. కొంగు చాపి న్యాయం చేయాలని ప్రజల్ని కోరారు. ఆమె ప్రకటనతో ఒక్క సారిగా వైసీపీలో ప్రకంపనలు వచ్చాయి. అలాగే వైఎస్ వివేకా హత్య కేసును చర్చనీయాంశం చేశారు. అయితే కోర్టుకెళ్లి ఎవరూ మాట్లాడకుండా ఆర్డర్స్ తెచ్చుకున్నారు వైసీపీ నేతలు. కానీ ప్రజల్లో చర్చ మాత్రం ఆగే అవకాశం కనిపించడం లేదు. కడప నుంచి ప్రారంభించి షర్మిల కర్నూలులోనూ ప్రచారం చేశారు. షర్మిల సభలకు జనం ఉరకలెత్తకపోయినా కాంగ్రెస్ పార్టీకి కూడా ఆదరణ ఉంది అనిపించేలా వస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి కనీసం సభలు పెట్టేంత వెసులుబాటు ఉండేది కాదు. కానీ ఇప్పుడు షర్మిలసభ అంటే.. జన సమీకరణ చూపించగలుగుతున్నారు. కడప, కర్నూలు జిల్లాల్లో షర్మిల చేసిన ప్రచారానికి పెద్ద ఎత్తున స్పందన వచ్చిందని కాంగ్రెస్ వర్గాలు సంతృప్తిగా ఉన్నాయి. సునీత కూడా షర్మిలతో ప్రచారం చేస్తున్నారు. నామినేషన్ల దాఖలు తర్వాత కూడా రాయలసీమలోనే షర్మిల ఎక్కువగా ప్రచారం చేసే అవకాశం ఉంది. కొన్ని కీలక నియోజకవర్గాలపై గురి పెట్టి.. ప్రచారం చేయనున్నారు. కాంగ్రెస్ కు వచ్చే ప్రతి ఓటు వైసీపీదేనన్న అభిప్రాయం ఉంది. ముస్లిం, దళిత ఓటర్లు ఈ సారి కాంగ్రెస్ వైపు మొగ్గే అవకాశాలు ఉన్నాయి. వైఎస్ వివేకా హత్య కేసు వ్యవహారంతో మహిళా ఓటర్లూ వైసీపీకి దూరమవుతారని.. తమకు దగ్గరవుతారని కాంగ్రెస్ అనుకుంటోంది. షర్మిల రాయలసీమలో సీట్లు గెలవలేకపోవచ్చు కానీ.. వైసీపీ ఓటమిని శాసిస్తే మాత్రం.. తర్వాత ఆమెదే రాజకీయ భవిష్యత్ అయ్యే అవకాశం ఉంది. షర్మిలనే ప్రజలు వారసురాలిగా గుర్తిస్తున్నరన్న అభిప్రాయం పెరుగుతుంది. వైసీపీ ఉనికి ప్రమాదంలో పడుతుంది.. మళ్లీ కాంగ్రెస్సే ముందుకు వస్తుంది. ఈ వ్యూహంతోనే షర్మిల అడుగులు వేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఓ ప్రత్యేక వ్యూహంతోనే రాజకీయం చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. షర్మిల ప్రత్యేకంగా ఓ బ్యాకప్ టీమును ఏర్పాటు చేసుకుని కీలకమైన నియోజకవర్గాల్లో అవకాశం ఉన్న చోట ప్రభావం చూపే నాయకుల్ని ఆకర్షించి మరీ టిక్కెట్లు ఇచ్చేందుకు వెనుకాడటం లేదు. ఇప్పటికి నలుగురు ఎమ్మెల్యేలు, ఓ కేంద్ర మాజీ మంత్రి వైసీపీలో చేరి అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. ఎమ్మెల్యేలంతా దళితులే. అంతే కాదు నియోజకవర్గాల్లో అభ్యర్థులుగా ఖరారు చేసిన వారిలో చాలా మంది తమ తమ సామాజికవర్గాల్లో అంతో ఇంతో పట్టున్నవారే. పైగా ఆర్థికంగానూ బలంగా ఉండే వారిని ఎంపిక చేసుకున్నారు. నందికొట్కూరు నుంచి ఆర్థర్, చింతలపూడి నుంచి ఎలీజా, పూతలపట్టు నుంచి ఎంఎస్ బాబు, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కాంగ్రెస్ లో చేరారు. వీరంతా వైసీపీకి వీర విధేయులు. టిక్కెట్ ఇవ్వకపోయినా చాలా రోజులు పార్టీని వీడలేదు. అయినా ఆ పార్టీని వదిలేసి వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. టిక్కెట్ ఇవ్వకపోయినా చాలా రోజులుగా సైలెంట్ గా ఉన్న తర్వాత షర్మిల టీం చర్చలు జరిపి వీరిని పోటీకి అంగీకరింప చేసింది. ఇక కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి .. జగన్ పై తీవ్ర ఆరోపణలు చేసి కాంగ్రెస్ లో చేరి.. టెక్కలి నుంచి పోటీ చేయడానికి సిద్ధమయ్యారు. ఇలా కనీసం 30 నుంచి 40 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ బలమైన అభ్యర్థుల్ని నిలబెడుతోంది. అయితే వీరి బలం గెలవడానికి సరిపోదు. కానీ ఓడించడానికి ఉపయోగపడుతుంది. కాంగ్రెస్ పార్టీకి గత ఎన్నికల్లో ఏ స్థానంలోనూ నోటాను మించి ఓట్లు రాలేదు. కానీ ఈ సారి షర్మిల ప్రభావం గట్టిగా కనిపించనుంది. కీలకమైన స్థానాల్లో పది నుంచి పదిహేను వేల ఓట్లు చీలిస్తే పోటీలో ఉన్న కొంత మంది అభ్యర్థుల జాతకాలు తారుమారు అవుతాయి. అంత బలం చూపించేవారినే అభ్యర్థులుగా ఖరారు చేశారు. కర్ణాటక,తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి. అక్కడ్నుంచి ఏపీ కాంగ్రెస్ పార్టీకి సాయం అందుతోంది. రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తున్నారు. విశాఖ బహిరంగసభలోనూ ప్రసంగించారు. . కాంగ్రెస్ పార్టీ చీల్చే ప్రతి ఓటు వైసీపీకి లాసే. పీసీసీ చీఫ్ గా షర్మిల బాధ్యతుల తీసుకుంటే తాను పూర్తి స్థాయిలో సహకరిస్తానని గతంలో రేవంత్ ప్రకటించారు. ఆ ప్రకారం ఆపరేషన్ నిర్వహిస్తున్నారని అంటున్నారు. కాంగ్రెస్ కు పని చేస్తే.. టీడీపీకి ఎలా మేలు చేసినట్లన్న డౌట్ రావొచ్చు. అదే రాజకీయం. కాంగ్రెస్ ఎన్ని ఓట్లు చీలిస్తే.. వైసీపీకి అంత డ్యామేజ్. కర్ణాటక నుంచి కూడా సహకారం అందుతోందని చెబుతున్నారు. అన్నీ కలసి వస్తే షర్మిల కాంగ్రెస్ పార్టీ ఉనికిని ఏపీలో బలంగా చాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రజల సానుభూతి లభించి.. కడపలో సంచలనం సృష్టిస్తే.. ఇక తిరుగు ఉండదని అనుకోవచ్చు.

# నాలుగు స్థానాలు మార్పు... పక్కా

విజయవాడ, ఏప్రిల్ 22 ఏపీలో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. టీడీపీ – జనసేన – బీజేపీ పార్టీల పొత్తుల్లో బాగంగా టీడీపీ అసెంబ్లీ స్థానాలకు గాను, 17 ఎంపీ స్థానాలకు గానూ అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, టికెట్లు దక్కని నాయకులు చాలా చోట్ల అసహనం వ్యక్తం చేస్తుండగా.. తాజాగా 4 చోట్ల టీడీపీ అభ్యర్థులను మార్చనున్నట్లు తెలుస్తోంది. ఆయా స్థానాల్లో మారిన రాజకీయ సమీకరణలు, శ్రేణులు, నేతల అభిప్రాయం మేరకు చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఉండి, పాడేరు, మాడుగుల, మడకశిర, వెంకటగిరి అసెంబ్లీ స్థానాల్లో మార్పులు జరిగే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణ, ఎంపీ రఘురామకృష్ణంరాజు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఎస్సీ సెల్ నేత ఎంఎస్ రాజు ఆదివారం చంద్రబాబు నివాసానికి చేరుకుని ఆయనతో భేటీ అయ్యారు. పాడేరు – గిడ్డి ఈశ్వరి, ఉండి – రఘురామకృష్ణంరాజు, మడకశిర – ఎంఎస్ రాజు, మాడుగుల – బండారు సత్యన్నారాయణకు కేటాయించే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం. అటు, వెంకటగిరి స్థానాన్ని ఇదివరకూ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీప్రియకు ఖరారు చేశారు. అయితే, మార్పుల్లో భాగంగా అక్కడి నుంచి రామకృష్ణనే అభ్యర్థిగా ప్రకటించనున్నారు.ఇవి కాకుండా కూటమి పొత్తుల్లో బాగంగా మరో రెండు స్థానాల్లో కూడా సందిగ్ధత కొనసాగుతోంది. అనపర్తి, దెందులూరు స్థానాల్లో అభ్యర్థుల విషయంలో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. అనపర్తి స్థానాన్ని బీజేపీకి కేటాయించడంతో.. అక్కడ టీడీపీ టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. చంద్రబాబు సైతం ఆయనకు స్వయంగా ఫోన్ చేసి నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. తాను టీడీపీ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. అయితే, పొత్తుల్లో భాగంగా సీట్ల కేటాయింపు విషయంలో సమస్యలు తలెత్తడంతో.. ఆయన్ను బీజేపీ నుంచి పోటీ చేయాలని టీడీపీ అధిష్టానం సూచించింది. ఈ క్రమంలో నల్లమిల్లి అనపర్తిలో బీజేపీ తరఫున పోటీ చేసే అవకాశం ఉంది. అనపర్తి స్థానంపై పూర్తి స్పష్టత వచ్చాకే దెందులూరు, తంబళ్లపల్లె అభ్యర్థులకు బీ ఫారాలను అందించనున్నట్లు సమాచారం.మరోవైపు, 144 అసెంబ్లీ స్థానాలకు, 17 ఎంపీ స్థానాలకు సంబంధించి అభ్యర్థులకు టీడీపీ అధినేత చంద్రబాబు విజయవాడలో ఆదివారం బీ ఫారాలు అందజేయనున్నారు. అలాగే, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచార శైలిపై దిశానిర్దేశం చేయనున్నారు. అటు, చంద్రబాబు ఆదేశాలతో తోట సీతారామలక్ష్మిని పొలిట్ బ్యూరో సభ్యురాలిగా, ఉమ్మడి ప.గో జిల్లా ఎన్నికల సమన్వయకర్తగా నియమించారు. అలాగే, నర్సాపురం పార్లమెంట్ పార్టీ అధ్యక్షులుగా నియమించారు.ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ కూటమి అభ్యర్థులు ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ కలిసి అభ్యర్థుల తరఫున ప్రచారంలో పాల్గొంటున్నారు. మరోవైపు, ప్రధాని మోదీ సైతం ఎలక్షన్ క్యాంపెయిన్ లో భాగంగా 4 బహిరంగ సభల్లో పాల్గొంటారని కూటమి నేతలు పేర్కొంటున్నారు.

# త్రిముఖ పోటీలో అసమ్మతి కుంపట్లు...

నెల్లూరు, ఏప్రిల్ 22 ఎన్నికల వేళ కూటమిలో అసమ్మతి కుంపట్లు కాక రేపుతూనే ఉన్నాయి. నామినేషన్ల పర్వం కొనసాగుతున్నా టిక్కెట్ల వేడి ఇంకా చల్లారడం లేదు. టిక్కెట్లు దక్కకపోవడంతో పలువురు నేతలు తాడోపేడో తేల్చుకునేందుకు రెడీ అవుతున్నారు. ప్రత్యర్థుల సంగతి ఏమోగానీ.. స్వపక్షంలోనే విపక్షం తయారు కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కూటమి అభ్యర్థులు. తాజాగా.. నెల్లూరు జిల్లా టీడీపీలో రెబల్స్ బెడద క్యాండేట్లకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ఇంతకీ.. నెల్లూరు జిల్లాలో రెబల్స్ బెడద ఎవరెవర్ని వెంటాడుతోంది.? రెబల్స్‌తో కూటమి నేతలు ఎలాంటి చర్చలు చేస్తున్నారు.?ఏపీ రాజకీయాలు హాట్‌హాట్‌గా కొనసాగుతున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ ఎవరికివారు జోరుగా ప్రచారం చేస్తున్నారు. గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్తున్నారు. అయితే.. నామినేషన్ల గడువు ముగింపు దశకు చేరుకుంటున్నా.. కూటమిలో మాత్రం కుంపట్లు చల్లారడం లేదు. దానికి తగ్గట్లే.. నెల్లూరు జిల్లా టీడీపీలో నేతల అసమ్మతి రోజురోజుకీ ముదురుతోంది. ప్రధానంగా.. కందుకూరు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. కందుకూరు టిక్కెట్ టీడీపీ అధిష్టానం ఇంటూరి నాగేశ్వరరావుకి ఇవ్వగా.. అవకాశం దక్కకపోవడంతో ఇంటూరి రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు టిక్కెట్ దక్కలేదనే కోపంతో రెబల్‌గా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. దానిలో భాగంగా ఆత్మీయ సమావేశం నిర్వహించిన ఇంటూరి రాజేష్.. కీలక వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. అంతేకాదు.. కందుకూరులో టీడీపీని ఓడించి తీరుతానని రాజేష్ శపథం చేయడం ఆసక్తిగా మారుతోంది. టీడీపీ అధిష్టానంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైన కందుకూరు రెబల్ అభ్యర్థి రాజేష్‌కి స్థానికంగానూ మద్దతు పెరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత దివి శివరాం రాజేష్‌కు మద్దతు ప్రకటించడం ఆసక్తిగా మారింది. టీడీపీ అధిష్టానం టిక్కెట్ ఇచ్చిన ఇంటూరు నాగేశ్వరరావుకు మద్దతు ఇవ్వబోనని తేల్చి చెప్పారు శివరాం. రాజేష్ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. తమ కుటుంబాన్ని దూషించిన నాగేశ్వర్ రావుకు ఎట్టిపరిస్థితుల్లో మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు దివి శివరాం.మరోవైపు.. నెల్లూరు జిల్లా కావలిలోనూ రెబల్ రచ్చ ముదురుతోంది. కావలి టీడీపీ అభ్యర్థిగా కావ్య క్రిష్ణారెడ్డి బరిలో దిగుతుండగా.. బీజేపీ నేత పసుపులేటి సుధాకర్ రెబల్‌గా పోటీకి సిద్ధమయ్యారు. బీజేపీని వీడి టీడీపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన ఆయన.. చంద్రబాబు మోసం చేశారంటూ మండిపడ్డారు. ఈ క్రమంలోనే.. ఇండిపెండెంట్‌గా బరిలో దిగేందుకు నిర్ణయం తీసుకున్నారు పసుపులేటి సుధాకర్. రేపు నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అటు.. జోరుగా ప్రచారం చేస్తున్న పసుపులేటి సుధాకర్‌ని టీడీపీ నేతలు బుజ్జగించినా ఫలితం దక్కలేదు. ఇదిచాలదన్నట్లు.. ఎన్నికల్లో పోటీ చేసి సత్తా ఏంటో చూపిస్తానన్నారు పసుపులేటి సుధాకర్. దాంతో.. కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా.. నెల్లూరు జిల్లా కందుకూరు, కావలి నియోజకవర్గాల్లో రెబల్స్ బెడదతో కూటమి క్యాండేట్లు తలలు పట్టుకుంటున్నారు. అయితే.. కూటమి అగ్రనేతలు రంగంలోకి దిగి రెబల్స్‌ను బుజ్జగిస్తున్న నేపథ్యంలో..

# గుంతకల్లు లో వ్యూహాలు, ప్రతి వ్యూహాలు

అనంతపురం, ఏప్రిల్ 22 ఆ నియోజకవర్గంలో ఆ నేతకు టికెట్ ఇస్తే సహకరించే పరిస్థితి లేదన్నారు. పక్క జిల్లా నుంచి వచ్చి పార్టీలో చేరితే టికెట్ ఎలా ఇస్తారు అంటూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పైనే ప్రత్యక్షంగా విమర్శలు కూడా గుప్పించారు. అవన్నీ లెక్కచేయని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆ నేత పార్టీలోకి చేరగాని గుంతకల్లు అసెంబ్లీ టికెట్లు కేటాయించారు. ఇంతకు ఆ నేత ఎవరు ఆ నేతపైన చంద్రబాబు నాయుడుకి అంత నమ్మకం ఏంటి ఈ స్టోరీలో తెలుసుకుందాం. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాలు పార్టీలో చాలామందికి మింగుడు పడటం లేదు. పార్టీ నేతలు సీనియర్లు ఎంత చెప్పినా వినకుండా గెలుపే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆ పార్టీ నేతలు చెవులు కోరుకుంటున్నారు. అందులో భాగంగానే గుంతకల్లు నియోజకవర్గం అసెంబ్లీపై చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టిని సారించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆలూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గుమ్మనూరు జయరాం.. ముఖ్యమంత్రి జగన్ క్యాబినెట్లో కార్మిక శాఖ మంత్రిగా కొనసాగుతున్న సమయంలోనే వైసీపీ పార్టీలో ఇమడలేక కొన్ని అనివార్య కారణాలతో ఆ పార్టీని విడాల్సి వచ్చింది. దీంతో గుమ్మనూరు జయరాం ఏ పార్టీలోకి వెళ్తారు అని పెద్ద చర్చని కొనసాగింది.

అనుకోకుండా గుమ్మనూరు జయరాం టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం కండువా కప్పుకున్నారు. పార్టీలోకి చేరిన వెంటనే అధినేత చంద్రబాబు నాయుడు మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం కు ఏకంగా గుంతకల్లు అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించారు. వాల్మీకి (బీసీ) సామాజిక వర్గంలో అనతి కాలంలోనే గుర్తింపు తెచ్చుకున్న నేతగా గుమ్మనూరు జయరాంకు పేరుంది. ఆలూరు నియోజకవర్గం నుంచి 2009 ఎన్నికల్లో పిఆర్పి తరపున పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం వైఎస్ఆర్సిపి పార్టీ తరపున 2014, 2019 ఎన్నికల్లో విజయం సాధించారు. జగన్ క్యాబినెట్లో మంత్రిగా కూడా పనిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకి సామాజిక వర్గంలో గుర్తింపు తెచ్చుకున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు గుంతకల్లు నియోజకవర్గం అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో గుంతకల్లు నియోజకవర్గం వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీలో తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. అవేమీ లెక్క చేయని గుమ్మనూరు జయరాం ఎన్నికలు నాటికి అందర్నీ ఏకతాటిపై తెచ్చేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీంతో నియోజకవర్గంలోని వ్యతిరేకులను,అసంతృప్తులను ఏకం చేసేందుకు జయరాం సోదరుడు నారాయణస్వామి, కుమారుడు ఈశ్వర్ రంగంలోకి దిగారు. మండలాల వారీగా నాయకులతో కలుస్తూ వ్యతిరేకులను అసంతృప్తులను కలిసి పార్టీకి పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో తెలియజేస్తూ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ క్యాడర్ ను ఏకతాటిపైకి తెచ్చి గుంతకల్లు నియోజకవర్గంలో గెలుపు దిశగా అడుగులు వేస్తున్నారు. ఎన్నికల్లో టికెట్ రాకపోవడంతో మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ తీవ్ర అసంతృప్తితో ఉండడంతో గుంతకల్లు నియోజకవర్గంలోని అసంతృప్తులను ఏకం చేసేందుకు అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి రంగంలోకి దింపి జితేంద్ర గౌడ్ ను పార్టీ కోసం పనిచేయాలని ఆదేశించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అధినేత చంద్రబాబు నాయుడు జితేంద్ర గౌడ్ కి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానంటూ హామీ ఇచ్చారు. స్వయంగా అధినేత హామీ ఇవ్వడంతో శాంతిచ్చిన మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ గుమ్మనూరు జయరాంకు సహకరించలని నియోజకవర్గ తెలుగుదేశం క్యాడర్ కు పిలుపునిచ్చారు. పార్టీలో ఎన్ని సమస్యలు ఉన్నా కూడా మన అధినేత చంద్రబాబునాయుని ముఖ్యమంత్రిని చేసుకోవాలని పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచే విధంగా పలు సందర్భాల్లో మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ ప్రసంగించారు. గుంతకల్లు నియోజకవర్గం వ్యాప్తంగా వాల్మీకి (బీసీ) ఓటర్లు అధికంగా ఉండడంతో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన గుమ్మనూరు జయరాంకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు టికెట్ ఇచ్చినట్లు జోరుగా చర్చ సాగుతుంది. మరోవైపు జిల్లా వ్యాప్తంగా గుంతకల్లు,రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గం లో కూడా బీసీ ఓటర్లు అధికంగా ఉండడంతో ఆ సామాజిక వర్గానికి అధినేత చంద్రబాబు నాయుడు ప్రాధాన్యత ఇచ్చినట్లు కూడా తెలుస్తోంది. మరోవైపు వైఎస్ఆర్సిపి పార్టీ నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి వైసీపీ తరపున బరిలో నిలుస్తున్నారు.

# మర్రిచెట్టు తొర్రలో 66 లక్షలు

ఒంగోలు, ఏప్రిల్ 22 మర్రిచెట్టు తొర్రలో రూ.66 లక్షల నగదును చూసిన పోలీసులు అవాక్కయ్యారు. ఓ ఏటీఎం వ్యానులో నగదు చోరీ చేసిన దొంగలు ఎక్కడ దాచాలో తెలియక చెట్టు తొర్రలో సొమ్ము దాచారు. నిందితులను గుర్తించిన పోలీసులు నగదు రికవరీ చేశారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న ఒంగోలులోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎం దగ్గర చోరీ జరిగింది. ఒంగోలు – కర్నూల్ రోడ్డులోని ఓ పెట్రోల్ బంకు ఆవరణలో ఏటీఎంల్లో నగదు నింపే సీఎంఎస్ ఏజెన్సీకి చెందిన వ్యాన్ వచ్చి ఆగింది. ఈ వాహనంలో రూ.68 లక్షల నగదు ఉండగా.. సిబ్బంది మధ్యాహ్నం సమయం కావడంతో భోజనం చేసేందుకు వెళ్లారు. వారు తిరిగి వచ్చి చూసే సరికి వ్యానులో నగదు మాయమైంది. సినీ ఫక్కీలో జరిగిన ఈ ఘటనపై సీఎంఎస్ ఏజెన్సీ పోలీసులకు సమాచారం ఇచ్చింది. వాహనం నుంచి సుమారు రూ.66 లక్షల నగదు దోపిడీకి గురైనట్లు సంస్థ లోకల్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యాన్ డోర్ మధ్యలో ఉన్న హోల్ లో నుంచి చెయ్యి పెట్టి లాక్ ఓపెన్ చేసిన దుండగులు.. అక్కడే బ్యాగులో ఉన్న రూ.66 లక్షలు దోచుకుని వెళ్లారు. ఈ నెల 18న ఒంగోలు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎం దగ్గర చోరీ జరిగింది. ఒంగోలు–కర్నూలు రోడ్డులోని ఓ పెట్రోల్ బంకు ఆవరణలో ఏటీఎంలలో నగదు నింపే సీఎంఎస్ ఏజెన్సీకి చెందిన వ్యాను వచ్చింది. ఈ వ్యానులో రూ.68 లక్షల నగదు ఉంది. మధ్యాహ్నం సమయం కావడంతో నగదు ఉన్న వ్యాను పెట్రోల్ బంక్ ఆవరణలో నిలిపి ఏటియం సెంటర్ వెనుక వైపు భోజనం చేసేందుకు వెళ్లారు. సిబ్బంది తిరిగి వచ్చే సరికే వ్యానులో నగదు మాయం అయింది. సినీ ఫక్కీ జరిగిన ఈ చోరీ ఘటనపై సీఎంఎస్ ఏజెన్సీ పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఈ వాహనం నుంచి సుమారు రూ. 66 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్టు సీఎంఎస్ సంస్థ లోకల్ మేనేజర్ కొండారెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వ్యాన్ డోర్ మధ్యలో ఉన్న హోల్‌లో నుంచి చెయ్యి పెట్టి లాక్ ఓపెన్ చేసి లోపలికి వెళ్లిన దుండగులు... అక్కడే ఉన్న బ్యాగులో రూ.66 లక్షలు సర్దుకుని పరారయ్యాడు. రెండు లక్షలను అక్కడే వదిలేశాడు. లంచ్ చేసి వచ్చిన సిబ్బంది వ్యాను డోర్ తీసి ఉండడంతో వెంటనే నగదు కోసం చూశారు. క్యాష్ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల దర్యాప్తులో సీఎంఎస్ ఉద్యోగులే నిందితులని తేలిపింది. దొంగిలించిన డబ్బు మొత్తాన్ని నిందితులు ఓ మర్రి చెట్టు తొర్రలో దాచి పెట్టడం ఇక్కడ విశేషం. ఒంగోలు సీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ కొండారెడ్డి, సీఎంఎస్ మాజీ ఉద్యోగి మహేష్‌బాబు, రాచర్ల రాజశేఖర్ చోరీ చేసినట్లు గుర్తించారు. టెక్నికల్ ఆధారాలతో ముందు మహేష్ బాబును పట్టుకున్నామన్నారు. అతడిని విచారించగా... అసలు విషయం తెలిసిందన్నారు. చోరీ చేసిన నగదును మర్రి చెట్టు తొర్రలో దాచారని, డబ్బు రికవరీ ప్రకాశం ఎస్పీ గరుడ్ సుమిత్ అనీల్ తెలిపారు. లింగారెడ్డి కాలనీలోని సీఎంఎస్ కార్యాలయం వద్ద రాజశేఖర్, కొండారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. పనిచేస్తున్న కంపెనీకే కన్నం వేయాలని ప్రయత్నించి నిందితులు దొరికిపోయారు.

# తాడిపత్రిలో తొడగొట్టేది ఎవరు..

అనంతపురం, ఏప్రిల్ 22 గత ఎన్నికల్లో తాడిపత్రి నియోజకవర్గంలో సంచలనం నమోదయింది. దశాబ్దాలుగా ఏలిన జేసీ కుటుంబానికి కంచుకోటను కేతిరెడ్డి పెద్దారెడ్డి బద్దలు కొట్టగలిగారు. అప్పట్లో జగన్ వేవ్ తో అందరూ ఓటమిపాలయినట్లుగానే తాము ఓడిపోయామని జేసీ బ్రదర్స్ సర్ది చెప్పుకున్నారు. ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికల్లో జేసీ ప్రభాకర్ రెడ్డి గెలిచి ఇక్కడ పట్టు తమకు సడలలేదని నిరూపించారు. అందుకే ఈసారి తాడిపత్రి నియోజకవర్గంలో ఎన్నిక మాత్రం మామూలుగా లేదు. మొన్నటి వరకూ పెద్దారెడ్డి అసలు సరిపోదని భావించిన ప్రజలు గెలిపించారు. రెండోసారి ఆయనకు ఛాన్స్ ఇస్తారా? లేక జేసీ అస్మిత్ రెడ్డిని ఆశీర్వదిస్తారా? అన్నది మాత్రం పెద్ద ప్రశ్నగానే ఉందిఎమ్మిగనూరు ఏమవుతుందో? పెద్దారెడ్డి నమ్మకం... రాయలసీమలో వైసీపీ బలంగా ఉంది. అందులో ఏమాత్రం సందేహం లేదు. అదే సమయంలో జేసీ కుటుంబానికి కూడా పట్టున్న తాడిపత్రిలో మాత్రం గెలుపోటములను అంచనా వేయలేని పరిస్థితి. 2019 ఎన్నికలకు ముందు వరకూ అది జేసీ బ్రదర్స్ అడ్డా. కానీ ఆ పేరును పెద్దారెడ్డి చెరిపేశారు. జేసీ సోదరులకు ఇక్కడ ఏమీ లేదని నిరూపించారు. ఐదేళ్లలో తనను తాను నాయకుడిగా నిరూపించుకునే ప్రయత్నం చేశాడు పెద్దారెడ్డి. నియోజకవర్గాన్ని వదలకుండా.. అక్కడే అంటిపెట్టుకుని ఉన్న పెద్దారెడ్డి తనను మరొకసారి ఆశీర్వదించాలని కోరుతున్నారు. సంక్షేమ పథకాలు అందరికీ అందాలంటే తనను గెలిపించాలని ఆయన ఇంటింటికీ తిరుగుతున్నారుమరోవైపు గత ఎన్నికల్లో ఓటమి బాధతో కసితో ఉన్న జేసీ ఫ్యామిలీ ఈసారి కూడా జేసీ ప్రభాకర్ రెడ్డి కుమారుడైన అస్మిత్ రెడ్డిని బరిలోకి దించింది. గత ఎన్నికల్లో ఓటమి పాలయిన సానుభూతితో పాటు జేసీ బ్రదర్స్ కుటుంబానికి ఉన్న పట్టు కూడా తన గెలుపునకు ఉపయోగపడుతుందని అస్మిత్ రెడ్డి భావిస్తున్నారు.

పెద్దారెడ్డితో పోలిస్తే తాను యువకుడిని కావడంతో తాను గెలిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పుకుంటూ ఇల్లిల్లూ తిరుగుతున్నారు. జేసీ కుటుంబానికి ఈ ఎన్నికల్లో ఒకే సీటు రావడం... అదీ తాడిపత్రి కావడంతో అందరూ తాడిపత్రిపైనే ఫోకస్ పెట్టారు. తలా ఒక దిక్కుకు వెళ్లి ప్రచారాన్ని చేస్తున్నారుఇక ఆర్థికంగా కూడా ఇటు వైసీపీ, అటు టీడీపీ నేతలు బలమైన వారు కావడంతో డబ్బులు తాడిపత్రి నియోజకవర్గంలో బాగానే ఖర్చవుతున్నాయంటున్నారు. జేసీకుటుంబం ఈసారి అస్మిత్ రెడ్డి గెలుపును ప్రెస్టీజియస్ గా తీసుకోగా, పెద్దారెడ్డి తనను ఖచ్చితంగా ప్రజలు దగ్గరకు తీసుకుంటారన్న గట్టి నమ్మకంతో ఉన్నారు. ఇద్దరూ ఆర్థికంగా, సామాజికంగా బలమైన వారే. బలం, బలగం కూడా ఇద్దరికీ సమానంగానే ఉంది. కానీ ప్రజల నాడి మాత్రం ఎవరికీ అర్థం కావడం లేదు. జేసీ కుటుంబం ఈసారి గెలిచి కోల్పోయిన ప్రతిష్టను తిరిగి నిలబెట్టుకోవాలని చూస్తుండగా, కేతిరెడ్డి పెద్దారెడ్డి సయితం గెలిచి తొడకొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. మరి జనం ఎవరికి జేజేలు కొడతారన్నది చూడాల్సి ఉంది.

## జనం మడుగు గ్రామంలో విజయసాయి ప్రచారం

కోవూరు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి జనం మడుగు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో అడుగుపెట్టిన ప్రసన్న విజయ సాయి రెడ్డి లకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సందర్భంగా ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరులో నా ఇల్లు ఉంది.. నా ఇంటికి వచ్చిన ఎస్సీ ఎస్టీ బిజీ ముస్లిం మైనారిటీలను పక్కన కూర్చుని పెట్టుకుని మాట్లాడే సంస్కారమైన వ్యక్తినని గుర్తు చేశారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో తప్పు చేస్తే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు.ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఎంపీ అభ్యర్థిగా విజయసాయి రెడ్డికి ఫ్యాను గుర్తుపై ఓటు వెయ్యాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం

వరల్డ్ బుక్ డే లేదా వరల్డ్ బుక్ మరియు కాపీరైట్ డే, పఠనం, ప్రచురణ మరియు కాపీరైట్ ప్రోత్సహించడానికి యునెస్కో ద్వారా ప్రతి సంవత్సరం 23 ఏప్రిల్ న ప్రపంచ పుస్తకదినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. యునైటెడ్ కింగ్డమ్ లో, బుక్స్కి ఒక రోజు కావాలని మార్చి మొదటి గురువారం గుర్తించారు . వరల్డ్ బుక్ డే ఏప్రిల్ 1995, 23 న మొదటి సారి జరుపుకున్నారు. ఇలా ఈరోజు నే జరుపుకోవాలని ఎందుకు అనుకున్నారంటే దానికి చాలా కారణాలు వున్నాయి. సెవాంతెస్, షేక్స్పియర్, ఇన్కా గర్సి లాసో, వేగా అను రచయితలు 1616 ఇదే రోజున మరణించారు. అంతేకాదు జోసెఫ్ ప్లా, వ్లాదిమర్, మారిస్ ద్రువాం ఇలా ఇంకా చాలా మంది ప్రపంచ ప్రఖ్యాత రచయితలు ఇదే రోజున మరణించడమో, జన్మించడమో జరగడం విశేషం. ఇదే రోజున సెయింట్ జార్జ్ జన్మది నాన్ని స్పెయిన్లో జరుపుకుంటారు. ఇప్పటికీ స్పెయిన్లో ప్రతి పుస్తక కొనుగోలు పై ఒక గులాబీని గిఫ్ట్గా ఇస్తారు. ఇన్ని ప్రత్యేకతలున్న ఈ రోజును1995 లో యునెస్కో 'ప్రపంచ పుస్తక దినం' గా ప్రకటించిండమేకాదు, ప్రపంచ పుస్తక మరియు కాపీ హక్కుల దినంగా జరపాలని, రచయితలను, ప్రచురణకర్తలను, పాఠకులను, ఉపాధ్యాయులను ఈ రోజున గౌరవించాలని సూచించింది. అంతర్జాలం, మీడియా కొంత వరకూ పుస్తకం మనుగడను అడ్డుకుంటున్నాయి అనటంలో ఎటువంటి సందేహము లేదు కదా . పుట్టినరోజులకు బహుమతులుగా మంచి పుస్తకాలను ఇస్తే చాలా బాగుంటుంది. అప్పుడు పిల్లలందరు చదవటానికి బాగుంటుంది. పుస్తక పఠనం వల్ల విజ్ఞానం పొందటమే కాకుండా, మానసిక ఉల్లాసం కూడా పెరుగుతుంది, మనిషిని మనిషిలా వుంచుతుంది, కోపం వచ్చినప్పుడు పుస్తకం చదివితే మనకు తెలియకుండానే కోపం పోతుంది ఇది నిజం. పుస్తకం మంచి స్నేహితుడివంటిది. ఇంకా చాలా ఉపయోగాలు వున్నాయి. అందుకే పుస్తక పఠనం చేయండి. ఇంకెందుకు ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ఈరోజు నుండే పుస్తక పఠనం మొదలుపెట్టండి. ప్రపంచ పుస్తకదినోత్సవ శుభాకాంక్షలు.

# ఖజనా గలగల.....
# 20 లక్షల కోట్లు...

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22, ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు పెరిగాయి. 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో, మన దేశంలో నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ. 19.58 లక్షల కోట్లకు చేరాయి. వార్షిక ప్రాతిపదికన 17.70 శాతం ఇవి పెరిగాయి. 2022-23 ఫైనాన్షియల్ ఇయర్‌లో ఈ మొత్తం రూ. 16.64 లక్షల కోట్లుగా ఉంది. కేంద్ర బడ్జెట్ సమయంలో, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 18.23 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్ను వసూళ్లను అంచనా వేశారు. తర్వాత దానిని రూ. 19.45 లక్షల కోట్లకు సవరించారు. అయితే, ఆదివారం విడుదల చేసిన గణాంకాలు ఈ అంచనాను కూడా కూడా దాటాయి. రివైజ్డ్ ఎస్టిమేషన్స్ కంటే దాదాపు రూ. 13 వేల కోట్లు ఎక్కువగా భారత ప్రభుత్వ ఖజానాలోకి చేరాయి. బడ్జెట్ అంచనాలతో పోలిస్తే ఏకంగా 1.35 లక్షల కోట్లు ఎక్కువగా వసూలయ్యాయి. ఇది 7.40 శాతం వృద్ధి.ఈఆ24లో స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లురూ. 23.37 లక్షల కోట్లుగా ఉన్నాయని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 18.48 శాతం తగ్గి రూ. 19.72 లక్షల కోట్లకు పరిమితమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో స్థూల కార్పొరేట్ పన్ను వసూళ్లు 13.06 శాతం పెరిగి రూ. 11.32 లక్షల కోట్లకు చేరాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ. 10 లక్షల కోట్లు. అఃఆ గణాంకాల ప్రకారం, నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు కూడా ఈఆ23 కంటే ఈఆ24లో 10.26 శాతం పెరిగి రూ. 9.11 లక్షల కోట్లకు చేరుకున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య రూ. 8.26 లక్షల కోట్లుగా ఉంది.గత ఆర్థిక సంవత్సరంలో స్థూల వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు 24.26 శాతం పెరిగి రూ. 12.01 లక్షల కోట్లకు చేరాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య రూ. 9.67 లక్షల కోట్లు. నికర వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు కూడా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 25.23 శాతం పెరిగి రూ. 10.44 లక్షల కోట్లను అధిగమించాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ. 8.33 లక్షల కోట్లుగా ఉంది. అఃఆ లెక్కల ప్రకారం, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 3.79 లక్షల కోట్ల విలువైన రిఫండ్స్ జారీ అయ్యాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలోని రూ. 3.09 లక్షల కోట్ల రిఫండ్స్‌తో పోలిస్తే గత ఫైనాన్షియల్ ఇయర్‌లో ఇవి 22.74 శాతం పెరిగాయి.

# నందమూరి కుటుంబంతోనే నేను

హైదరాబాద్, ఏప్రిల్ 22 ఏపీలో ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ దివంగత నందమూరి తారకరత్న సతీమణి అలేఖ్య రెడ్డి చేసిన ట్వీట్ ఒకటి చర్చనీయాంశం అవుతోంది. ఆమె తాను ఎవరికి సపోర్ట్ చేస్తున్నాననే విషయాన్నే ఆ ట్వీట్ చేశారు. నిజానికి అలేఖ్య రెడ్డి వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ వైపు నిలుస్తారనే విషయం అందరిలోనూ ఆసక్తిగా ఉంది. ఇందుకు కారణాలు కూడా ఉన్నాయి. అలేఖ్య రెడ్డి భర్త తారకత్నది నందమూరి వంశం పైగా టీడీపీ కుటుంబం. అలాగే అలేఖ్య రెడ్డికి వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డికి చాలా దగ్గరి బంధుత్వం ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవల ఉగాది వేడుకలను అలేఖ్య రెడ్డి ఇంట్లోనే విజయసాయి రెడ్డి జరుపుకున్నారు.తారకరత్న చనిపోయిన సందర్భంలో కూడా విజయసాయి రెడ్డి నందమూరి కుటుంబ సభ్యులతో చేతులు కలిపి ఆ క్రతువులు అన్నింటిని పూర్తి చేశారు. రాజకీయ, వ్యక్తిగత వైరుధ్యాలు ఎక్కడా చూపకుండా విజయసాయి రెడ్డి నందమూరి కుటుంబంతో ఆ సమయంలో కలిసిపోయారు. తర్వాత రాజకీయాల పరంగా వేర్వేరుగానే ఉంటున్నారు. పరస్పర విమర్శలు కూడా ఉంటున్నాయి. అయినా, వ్యక్తిగత జీవితంలో అలేఖ్య రెడ్డి విజయసాయి రెడ్డిని తన తండ్రి లాగే చూస్తుంటారు. మా జీవితంలో నాన్నలాంటి గొప్పవ్యక్తి విజయసాయిరెడ్డి అంకుల్ అని.. ఆయన ఆశీర్వాదాలు మాకు ఎప్పుడూ ఉంటాయని అలేఖ్య రెడ్డి ఓ సందర్భంలో అన్నారు. తమ కష్టసుఖాల్లో వెంటనే ఉండి ధైర్యం చెప్పారని అన్నారు.

ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉండి కూడా ఉగాది తమతో జరుపుకోవడం చాలా సంతోషకరం అని అన్నారు. తాజాగా అలేఖ్య రెడ్డి చేసిన ఓ ట్వీట్ ప్రాధాన్యం సంతరించుకుంది. రాబోయే ఎన్నికల్లో తాను తన బాలయ్య మామయ్య వైపే నిలుస్తానంటూ ట్వీట్ చేశారు. తన ఇన్‌స్టా, ఫేస్ బుక్, ట్విటర్ లలో బాలక్రిష్ణ, మోక్షజ్ఞతో తాను తన పిల్లలు ఉన్న ఫొటోను అలేఖ్య రెడ్డి షేర్ చేశారు. నేను ఏ వైపు ఉన్నానని తనను కొంత మంది అడుగుతున్నారని.. తన సమాధానం ఇదే అని అన్నారు. తాను, తన పిల్లల పట్ల అంగీకారం, ప్రేమ ఉన్న వైపే తాము ఉంటామంటూ పోస్ట్ చేశారు. దీంతో ఆమె నందమూరి వంశానికే, అంటే టీడీపీకే మద్దతిస్తున్నట్టు ప్రకటించారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో వామపక్షాల దారెటు..

హైదరాబాద్, ఏప్రిల్ 22, అసెంబ్లీ ఎన్నికల్లో స్నేహహస్తం చాచారు. కానీ సీట్ల దగ్గర కాస్త తేడా వచ్చేసరికి లెఫ్ట్‌పార్టీల్లో సీపీఐ సహకరిస్తే, సీపీఎం దూరంగా ఉండిపోయింది. నాలుగునెల్లు తిరిగేలోపే పార్లమెంట్ ఎన్నికలొచ్చేశాయి. దీంతో తెలంగాణలో లెఫ్ట్‌పార్టీలతో కాంగ్రెస్ దోస్తీపై ఊహాగానాలే తప్ప క్లారిటీ లేదిప్పటిదాకా. అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షం సీపీఐకి కొత్తగూడెం సీటిచ్చింది కాంగ్రెస్. దీంతో ఆ పార్టీకి అసెంబ్లీలో ప్రాతినిధ్యం దక్కింది. సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవటంతో ఒంటరిపోరుకు దిగిన సీపీఎం ఎక్కడా గెలవలేకపోయినా.. కాంగ్రెస్‌తో మాత్రం ఫ్రెండ్లీగానే ఉంది.పార్లమెంట్ ఎన్నికల్లో తమకు బలమున్న ఒక్క సీటైనా ఇవ్వాలని లెఫ్ట్‌పార్టీలు రెండూ కోరుకున్నాయి. ఒక సీటయినా ఇస్తే ఫ్రెండ్‌షిప్ మరింత స్ట్రాంగ్ అవుతుందంటూ కాంగ్రెస్ ముందు నాలుగుసీట్లు ఆప్షన్‌గా పెట్టింది సీపీఐ. సీపీఎం కూడా తమకు బలమున్న చోట ఓ సీటిస్తే చాలనుకుంది. కానీ పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ లెఫ్ట్‌పార్టీలతో సీట్లు షేర్ చేసుకునే పరిస్థితుల్లో లేదు. దీనిపై సీపీఐ వేచిచూసే ధోరణితో ఉండగా, సీపీఎం ఇప్పటికే భువనగిరి నుంచి అభ్యర్థిని ప్రకటించింది. ఆ పార్టీ అభ్యర్థిగా ఎండీ జహంగీర్ నామినేషన్ కూడా వేశారు. దీంతో తెలంగాణలో సీపీఎం మద్దతుకోసం కాంగ్రెస్ నాయకత్వం రంగంలోకి దిగింది. ఆ పార్టీ ప్రతినిధిగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సీపీఎం రాష్ట్ర కార్యాలయానికి వచ్చి ఆ పార్టీ ముఖ్యనేతలతో చర్చించారు.కాంగ్రెస్ నాయకత్వం అభిప్రాయాన్ని.. భట్టి సీపీఎం నేతలతో పంచుకున్నారు. తమ అభిప్రాయాలు, ఆక్షేపణలను లెఫ్ట్ నేతలతో ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇండియాకూటమిలో లెఫ్ట్ పార్టీలు భాగస్వామ్యపక్షాలుగా ఉన్నాయి. కేరళలాంటి రాష్ట్రంలో కొన్ని అభిప్రాయభేదాలు తలెత్తినా మిగిలిన చోట్ల కాంగ్రెస్-సీపీఎం మధ్య స్నేహపూర్వక వాతావరణమే ఉంది. సీట్లు ఇవ్వలేకపోయినా నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఉంటుందని సీపీఎం నేతలకు భట్టి హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి మినహా అన్ని స్థానాల్లో కాంగ్రెస్‌కి మద్దతిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. అయితే కీలకమైన భువనగిరిలో కూడా సీపీఎం పోటీతో నష్టం జరగక్కుండా చూసుకోవాలనుకుంటోంది కాంగ్రెస్.అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌నుంచి సానుకూల ప్రకటన కోసం చివరిదాకా వేచిచూసింది సీపీఎం. కానీ కోరుకున్న సీట్ల విషయంలో కాంగ్రెస్ ససేమిరా అనటంతో ఒంటరిగా పోటీకి దిగింది. ఈసారి కూడా కాంగ్రెస్‌నుంచి సానుకూల సంకేతాలేమీ లేకపోవటంతో ఒంటరిపోరుకు సిద్ధమై భువనగిరిలో అభ్యర్థిని ప్రకటించింది. అయితే బీజేపీని ఓడించడమే ప్రధాన లక్ష్యం కాబట్టి మిగిలిన స్థానాల్లో కాంగ్రెస్‌కి మద్దతిచ్చేందుకు ముందుకొచ్చింది సీపీఎం.మాటల్లేవ్ అనకుండా డిప్యూటీసీఎంని చర్చలకు పంపటంతో సీపీఎం మెత్తబడినట్లే కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో సహకరిస్తే ఎమ్మెల్సీ లేదా కీలకమైన కార్పొరేషన్ పదవి ఇస్తామని కాంగ్రెస్ ప్రతిపాదించినట్లు చెబుతున్నారు. ఒంటరిపోరుతో నష్టమే తప్ప లాభం ఉండదని కామ్రేడ్లకు కూడా తెలుసు. అందుకే ఎర్రజెండా పార్టీలు కూడా తెగేదాకా లాగాలనుకోవడం లేదు. అయితే కేరళ ప్రచారంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి లెఫ్ట్ ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని సీపీఎం తప్పుపడుతోంది. కాంగ్రెస్ కూడా కలిసొచ్చే పార్టీలనుంచి ఎలాంటి తల్నొప్పులు వద్దనుకుంటోంది. భట్టి ఎంట్రీతో ఆల్‌ఈజ్ వెల్ అనుకుంటోంది అధికారపార్టీ. అటు సీపీఐ కూడా కాంగ్రెస్‌తో కుదిరిన స్నేహాన్ని చెడగొట్టుకోదని భావిస్తున్నారు. స్నేహపూర్వకపోటీకి లెఫ్ట్‌పార్టీలు సిద్ధమైనా జాతీయస్థాయిలో అగ్రనాయకత్వం మాట్లాడకుంటే తెలంగాణలో కాంగ్రెస్‌కి బేషరతుగా మద్దతు పలికే అవకాశం కనిపిస్తోంది

## స్వర్ణరథంపై శ్రీ భూ సమేత శ్రీ మలయప్పస్వామి

తిరుమల శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాల్లో భాగంగా రెండవరోజైన సోమవారం ఉదయం శ్రీ మలయప్పస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుమాడ వీధుల్లో స్వర్ణరథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఇందులో భాగంగా ఉదయం 8 నుండి 10 గంటల నడుమ అత్యంత వైభవంగా సాగిన స్వర్ణరథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని గోవిందనామాలు జపిస్తూ రథాన్ని లాగారు. స్వర్ణరథోత్సవాన్ని దర్శించడంవల్ల- లక్ష్మీదేవి కరుణతో సంపదలు, భోగభాగ్యాలూ, భూదేవి కరుణతో, సమస్తధాన్యాలూ, శ్రీవారికరుణతో సర్వశుభాలూ, సుఖాలూ చేకూరుతాయని భక్తుల విశ్వాసం..

# హంగ్ వస్తే... జమిలి లెక్కేంటీ

ఎప్పటి నుంచో వినిపిస్తున్నట్లుగానే మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ జమిలి ఎన్నికలకు జైకొట్టింది. ఈ కమిటీ తను నివేదించిన నివేదికలో పలు అంశాలకు సిఫార్సు చేసింది. హంగ్ వచ్చినా, అవిశ్వాస తీర్మానం వంటి పరిస్థితులు నెలకొన్నా,మళ్ళీ ఎన్నికలు నిర్వహించి కొత్త సభను ఏర్పాటుచేయాలని సూచించింది. ఎల్లవేళలా,అధికారంలో ఉండే పార్టీలకు సంపూర్ణమైన మెజారిటీ ఉండకపోవచ్చు.సంకీర్ణంగా ప్రభుత్వాలు నడిపే క్రమంలో, విభేదాల వల్ల ప్రభుత్వం పడిపోయినప్పుడు,ఎన్నికలు మళ్ళీ నిర్వహించాల్సి వస్తుంది. ఇటువంటి సందర్భాల్లో ఏమి చేయాలి? అనే సందేహాలు ఉన్నాయి. ఇలా జమిలి ఎన్నికల అంశంలో అనేక అనుకూల, ప్రతికూల అంశాలు,సందేహాలు, అనుమానాలు ఉన్నాయి. వీటన్నింటిపై దేశ వ్యాప్తంగా సమగ్రమైన చర్చ జరగాలి. ప్రజామోదాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలి.చర్చలో అన్ని పార్టీలు పాల్గొనాలి.మంచిచెడు, లాభనష్టాలు బేరీజువేసుకోవాలి. "కేవలం ఇది చర్చించే విషయం కాదని,భారత్ కు ఎంతో అవసరం", అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేకమార్లు ఉద్ఘాటించారు. పార్టీల రాజకీయ స్వార్థాలు ఎట్లా ఉన్నా,దేశ ప్రజల మంచికి,దేశ ప్రగతికి పట్టంకట్టే విధానాలను స్వాగతించవచ్చు.ఒకప్పటి ఏకకాల ఎన్నికలను పునరుద్ధరించాలన్నది ప్రధాన సిఫార్సు.దేశానికి స్వాతంత్ర్య లభించిన తొలిరోజుల్లో ఈ వ్యవస్థ ఉండేది. ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేయడంతో పాటు దేశ ప్రజల ఆకాంక్షలను సాకారం చేయడానికి జమిలి ఎన్నికలు ఉపయోగపడతాయని బిజెపి ప్రభుత్వం చెబుతున్న మరోమాట. అసెంబ్లీ,లోక్ సభ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం తొలిదశ కాగా,ఈ ఎన్నికలు జరిగిన 100రోజుల లోపే మున్సిపాలిటీలు, పంచాయతీలకు కూడా ఎన్నికలు నిర్వహించడం రెండో దశలో జరగాల్సిన కార్యాచరణగా ఉండాలని ఈ కమిటీ బలంగా చెబుతోంది. కాకపోతే,దీనికోసం ఆర్టికల్ 325ను సవరించాలి. ఈ సవరణకు రాష్ట్రాల సహకారం అవసరం. రేపటి ఎన్నికల ఫలితాల తర్వాత కానీ,ఆ యా పార్టీల బలాబలాలు తెలియరావు. సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసే దిశగా కమిటీ పనిచేయడం కూడా ప్రారంభించింది. ప్రజల నుంచి సూచనలు, సలహాలను ఆహ్వానించింది. స్పందన కూడా విశేషంగా వచ్చింది. వేలాదిగా ఈ -మెయిల్స్ వచ్చాయి. కేంద్రం మొన్నామధ్యనే 6 జాతీయ పార్టీలు, 33 ప్రాంతీయ పార్టీల నుంచి అభిప్రాయాలు కోరింది. ఇప్పటివరకూ 35 పార్టీల నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు తెలుస్తోంది.జమిలి ఎన్నికలకు సంబంధించి న్యాయ కమిషన్ నుంచి కూడా సలహాలు తీసుకుంది. మరి కొన్ని నెలల వ్యవధిలోనే సాధారణ ఎన్నికలు జరగాల్సిన నేపథ్యంలో,ప్రతిపక్ష పార్టీల వ్యాఖ్యల వేడి పెరుగుతోంది.అనేకసార్లు లోక్ సభ రద్దయిందని, భవిష్యత్తులో కూడా అటువంటి పరిస్థితులు తలెత్తుతాయనే భయాన్ని వ్యక్తం చేస్తున్నారు.ఓటర్ల ఎన్నికల విశ్వాసాన్ని ఉల్లంఘించడం న్యాయమా? అని ఆమె ప్రశ్నిస్తున్నారు.తృణమూల్ పాటు మిగిలిన ప్రతిపక్ష పార్టీలకు అనేక భయాలు ఉన్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు ఎన్నో అనుమానాలు ఉన్నాయి.'జమిలి' అంటే రాష్ట్రాలపై దాడి చేయడమేనని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శనా బాణాలు సంధిస్తునే వున్నారు.ఈ ఎన్నికల వల్ల సామాన్యులకు ఒరిగేదేంటని కేజ్రీవాల్ ప్రశ్నిస్తున్నారు. 2029 నుంచి లోక్ సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేలా లా కమిషన్ ఓ ఫార్ములా రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. లా కమిషన్ ఇంకా తుది నివేదికను తయారుచేయాల్సివుంది. పంచాయతీల నుంచి పార్లమెంట్ దాకా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలన్నది బిజెపి ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. ముఖ్యంగా,దీనివల్ల డబ్బు ఆదా అవుతుందని,ఆ ధనాన్ని అభివృద్ధి పనుల కోసం కేటాయించవచ్చని మోదీ సర్కార్ వాదిస్తోంది.ఈ చర్చ ఈనాటిది కాదు.2019లో రెండవసారి అధికారంలోకి వచ్చిన వెనువెంటనే అన్ని పార్టీలను ఆహ్వానించి దీనిపై చర్చ కూడా జరిపారు.అప్పట్లో దేశ వ్యాప్తంగా మొత్తం నలభై రాజకీయ పార్టీలను ఈ సమాలోచనకు ఆహ్వానించారు. 21పార్టీలు మాత్రమే హాజరయ్యాయి.తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రాంతీయ పార్టీలు అప్పట్లో జమిలి ఎన్నికలకు జై కొట్టాయి. వచ్చిన మిగిలిన పార్టీలు విభిన్న స్వరాలను వినిపించాయి. కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగానే ఉంది. లోక్ సభకు,శాసనసభలకు సమాంతరంగా ఏకకాలంలో జరపడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి, ప్రధానంగా ఖర్చు కలిసివస్తుందన్నది వాస్తవమే. వివిధ ఎన్నికల కోడ్ పేరుతో జరగాల్సిన కార్యక్రమాలు జరగకుండా పనులు ఆగిపోవడం, సమయం వృధా అవ్వడం మొదలైన వాటికి అడ్డుగోడ పడుతుంది.తద్వారా పనిరోజులు పెరుగుతాయి.ప్రతి సంవత్సరం ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. కనీసం రెండు,మూడు రాష్ట్రాలలో ఎన్నికలు తప్పనిసరిగా వస్తుంటాయి.ఈ నేపథ్యంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోడానికి వెనుకాడే పరిస్థితి వస్తుంది.అదే అన్ని చోట్ల సమాంతర ఎన్నికల విధానం అందుబాటులో ఉంటే,కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి మరింతగా పరిపాలనపై దృష్టి సారించే వెసులుబాటు ఉంటుంది. ఐదేళ్లకొకసారి అన్ని వ్యవస్థలకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల రాజకీయ సుస్థిరత నెలకొనే అవకాశం ఉంది.బిజెపి ప్రతిపాదిస్తున్న జమిలి ఎన్నికలపై కొందరు అనేక అనుమానాలు, సందేహాలు,అభ్యంతరాలు వ్యక్తం చేశారు.ఈ ప్రతిపాదన వల్ల ఎటుచూసినా,కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికే ఎక్కువ మేలుజరుగుతుందనీ,అందుకే, దీనిపై బలంగా ప్రచారం చేస్తోందనే భావంలో ప్రతిపక్షాలు ఉన్నాయి.కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి సహజంగా ఆధిక్యత వస్తుందనీ,దాని వల్ల ప్రాంతీయ పార్టీలకు నష్టం జరుగుతుందనే భయంలో కొన్ని ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి.దీని వల్ల వారు అనుసరించే విధానాల వల్ల దేశ సమగ్రతకు జమిలి ఎన్నికల వల్ల భంగం కలిగే ప్రమాదం ఉందనీ కొందరు విమర్శిస్తున్నారు.పరోక్షంగా అధ్యక్ష వ్యవస్థకు నిర్మాణం చేపట్టే ప్రతిపాదనలు దీని వెనకాల దాగి ఉన్నాయనే భయాలు కొందరిలో లేకపోలేదు.ఈ భయాలన్నీ ప్రధాన జాతీయ పార్టీ కాంగ్రెస్ కు, ఆ పార్టీని అనుసరిస్తున్న కొన్ని పార్టీలకు ఉన్నాయి.

జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే, కొన్ని శాసనసభల పదవీకాలాన్ని కుదించాలి,కొన్నింటిని పొడిగించాలి.ఇటువంటి కీలకమైన చర్యలకు రాజ్యాంగ సవరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది.దీనికి సరిపడా బలం ఉభయ సభల్లోనూ బిజెపికి ఉంది. 'సమాంతర ఎన్నికల'పై, 2018 ఆగస్టులో లా కమిషన్ ఒక ముసాయిదా నివేదిక సమర్పించింది. చట్ట సవరణ జరిగిన తర్వాత, దేశంలోని సగం రాష్ట్రాల శాసనసభలు ఆమోదం తెలపాల్సిన అవసరం కూడా ఉంది.ఇక్కడ కూడా బిజెపికి వాతావరణం అనుకూలంగానే ఉంది.లోక్ సభ, శాసనసభలకు ఎన్నికలు జరిగినప్పుడు కొన్నిచోట్ల క్రాస్ ఓటింగ్ జరుగుతూ ఉంటుంది. శాసనసభకు స్థానిక పార్టీకి వేసి, లోక్ సభకు జాతీయ పార్టీకి వేసే మైండ్ సెట్ కొందరు ఓటర్లలో ఉంటుంది.ఫలితాలు తదనుగుణంగా వచ్చిన అనేక ఉదాహరణలు ఉన్నాయి.

# 12 నియోజకవర్గాల్లోనే కేసీఆర్ యాత్ర

హైదరాబాద్, ఏప్రిల్ 22, తెలంగాణలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఒకవైపు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. ఇంకోవైపు కూతరు అరెస్ట్.. మరోవైపు పార్టీని వీడుతున్న నేతలు.. ఇలా వరుస పరిణామాలతో బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ తరుణంలో లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. ఇప్పటికే క్యాడర్‌లో నిస్తేజం.. నైరాష్యం నెలకొంది. ఈ పరిస్థితిలో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు, క్యాడర్‌లో ఉత్సాహం, ఉత్తేజం నింపడమే లక్ష్యంగా కేసీఆర్ ఎత్తులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే బస్సు యాత్ర చేయాలని నిర్ణయించారు. ఏప్రిల్ 24 నుంచి తెలంగాణ వ్యాప్తంగా బస్సు యాత్రకు శ్రీకారం చుట్టబోతున్నారు. మే 10వ తేదీ వరకు నిర్వహించే ఈ యాత్రలో 24 రోడ్‌షోలు నిర్వహించబోతున్నారు. ఈమేరకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇది పూర్తిగా ఎన్నికల ప్రచార యాత్రం. కానీ, దీనిని అధికారికంగా ఆ పార్టీ ప్రకటించుకోలేని పరిస్థితి. ప్రజల సమస్యల పరిష్కార యాత్రగా పరిష్కారం చేసుకుంటోంది. ఇదిలా ఉంటే కేసీఆర్ బస్సు యాత్రలో ఐదు నియోజకవర్గాలను వదిలేశారు. 12 నియోజకవర్గాల్లో మాత్రమే సాగాలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. దీంతో ఆ ఐదు నియోజకవర్గాలను ఎవరి కోసం వదిలేశారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కేసీఆర్ బస్సు యాత్రలో ఆదిలాబాద్, చేవెళ్ల, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ నియోజకవర్గాలు లేవు. దీంతో ఆ నియోజకవర్గాలను కేసీఆర్ కావాలనే తప్పించారని తెలుస్తోంది. వాటిలో మల్కాజ్‌గిరి, చేవెళ్ల, సికింద్రాబాద్, ఆదిలాబాద్ స్థానాలను బీజేపీకి వదిలేసినట్లు తెలుస్తోంది. ఇక హైదరాబాద్ స్థానాన్ని ఎంఐఎంకు కేటాయించారని ప్రచారం జరుగుతోంది.కూతురు కవితను జైలు నుంచి బయటకు తీసుకు వచ్చేందుకు కేసీఆర్ ఇప్పటికే బీజేపీ నుంచి సుపారీ తీసుకున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందులో భాగంగానే లోక్‌సభ ఎన్నికల్లో పలు స్థానాల్లో డమ్మీ అభ్యర్థులను నిలిపారని తెలిపారు. ఇప్పుడు రేవంత వ్యాఖ్యలను నిజం చేసేలా కేసీఆర్ బస్సు యాత్రను 5 నియోజకవర్గాలను మినహాయించారు. ఆదిలాబాద్, చేవెళ్ల, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ నియోజకవర్గాల్లో బస్సు యాత్ర లేదు. దీంతో బీజేపీ ? బీఆర్ఎస్ ఒక్కటే అన్న కాంగ్రెస్ ఆరోపణలకు బలం చేకూరుతోంది.ఇదిలా ఉంటే.. బస్సు యాత్ర లేని నియోజకవర్గాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్నారు. కానీ ఏప్రిల్ 24 నుంచి మే 10వ తేదీ వరకు పూర్తిగా కేసీఆర్ షెడ్యూల్ ఖరారైంది. ఈ నేపథ్యంలో ఐదు నియోజకవర్గాల్లో సభలు లేనట్లే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. హైదరాబాద్‌లో మాత్రం కేటీఆర్, హరీశ్‌రావుతో రోడ్‌షోలు నిర్వహిస్తారని సమాచారం. మిగతా నాలుగు నియోజకవర్గాలను బీజేపీ కోసం వదిలేసినట్లే అని తెలుస్తోంది.

## కాంగ్రెస్ పార్టీలో దీక్షలు ,ఏంటీరా...బాబు..

హైదరాబాద్, ఏప్రిల్ 22 తెలంగాణ కాంగ్రెస్‌లో సీనియర్ నేతల దీక్షలు.. కొందరు నిమ్మరసం ఇవ్వడాలు చర్చనీయాంశం అవుతున్నాయి. నాలుగు రోజుల క్రితం మోత్కుపల్లి దీక్ష చేయగా.. సీనియర్ నేత వీ.హనుమంతరావు దీక్షకు సంఘీభావం తెలుపగా సర్వే సత్యనారాయణ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఇప్పుడు.. వీహెచ్ మౌన దీక్ష చేయగా.. దానం నాగేందర్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేయడం ఆసక్తి రేపుతోంది.పార్లమెంట్ ఎన్నికల వేళ తెలంగాణ పాలిటిక్స్ ఇంట్రస్టింగ్ మారుతున్నాయి. ఒకవైపు.. ప్రధాన పార్టీలన్నీ ప్రచారంలో దూసుకెళ్తుంటే.. టీ. కాంగ్రెస్‌లో మాత్రం దీక్షల సీజన్ నడుస్తోంది. కొందరు సీనియర్లు దీక్ష చేస్తుంటే.. మరికొందరు ఆ దీక్షలకు మద్దతు తెలిపి.. నిమ్మరసం ఇచ్చి విరమింపజేస్తున్నారు. తాజాగా.. హైదరాబాద్ అంబర్ పేటలోని తన నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మౌన దీక్షకు దిగారు. తన వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేలా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బీజేపీకి అనుకూలంగా మాట్లాడినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అవాస్తవాలు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వీహెచ్ డిమాండ్ చేశారు. ఇక.. బీజేపీలోకి వెళ్తున్నట్లు జరుగుతోన్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన.. జీవితాంతం కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. బీజేపీలోకి వెళ్తున్నాననే ప్రచారానికి చెక్ పెట్టేందుకే ఒక్కరోజు మౌన దీక్ష చేశానన్నారు వీహెచ్.ఇదిలావుంటే.. మూడు రోజుల క్రితం మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత మోత్కుపల్లి నరసింహులు కూడా ఒక్క రోజు దీక్ష చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగ సామాజికవర్గాలకు కాంగ్రెస్ రెండు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ మోత్కుపల్లి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నిరసన దీక్ష చేపట్టారు. తన ఇంట్లో దీక్ష చేపట్టిన మోత్కుపల్లికి కాంగ్రెస్ సీనియర్ నేత వీ.హనుమంతరావు సంఘీభావం తెలిపారు. సర్వే సత్యనారాయణ మోత్కుపల్లికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఇక.. 80 లక్షల మంది ఉన్న మాదిగ సామాజిక వర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుత ఎన్నికల్లో ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు మోత్కుపల్లి నరసింహులు. అటు.. మోత్కుపల్లి నిరసన దీక్షకు వివిధ జిల్లాల దళిత సంఘాల నేతలు హాజరై సంఘీభావం ప్రకటించారు. మొత్తంగా.. తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేతల వరుస దీక్షలు హాట్‌టాపిక్‌గా మారాయి. అటు.. మోత్కుపల్లి, ఇటు వీహెచ్.. ఇద్దరు దీక్షలు చేపట్టడం.. వారికి టీ.కాంగ్రెస్ నేతలే నిమ్మరసం ఇచ్చి విరమింపజేయడాలు ఆసక్తి రేపుతున్నాయి

# పొలిటికల్ మైండ్ గేమ్ లో పార్టీలు

హైదరాబాద్, ఏప్రిల్ 22, తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ గెలుపు కోసం తమ అస్త్రశస్త్రాల సిద్ధం చేశాయి. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను బేరీజు వేసుకుని పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ గెలుపు అంతా సీఎం రేవంత్ రెడ్డి తన భుజాల మీద వేసుకుని 10-12 స్థానాలు గెలుచుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. మరో జాతీయ పార్టీ బీజేపీకి మళ్లీ మోదీ క్రేజే గెలుపు గుర్రమని భావిస్తోంది. గులాబీ పార్టీ గెలుపునకు మాజీ సీఎం ఆ పార్టీ అధినేత కేసీఆర్ రంగంలోకి దిగారు. ఈ మూడు పార్టీలు తమ తమ బలాబలాలను సమీకరించుకుని 17 ఎంపీ స్థానాల్లో మెజార్టీ స్థానాలు గెలవడానికి కృషి చేస్తున్నాయి. దీని కోసం అన్ని పార్టీలు మైండ్ గేమ్ స్టార్ట్ చేశాయి. గెలుపు తమదేనంటూనే... ప్రత్యర్థి పార్టీ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ వ్యాఖ్యలు చేస్తున్నాయి. ఈ ఎన్నికల తర్వాత ప్రభుత్వం కూలుతుందని ఓ పార్టీ అంటే, మరో పార్టీ ఈ ఎన్నికల తర్వాత కొన్ని పార్టీలు ఉనికి కోల్పోతాయని జోస్యం చెబుతోంది. అయితే ఈ మూడు పార్టీలు తమదైన శైలిలో మానసిక యుద్ధానికి తెర లేపాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 స్థానాలు గెల్చుకోగా, మిత్రపక్షం సీపీఐ ఒక స్థానంలో గెలిచింది. గ్రేటర్ హైదరాబాద్ మినహా ఉత్తర, దక్షిణ తెలంగాణలో మెజార్టీ అసెంబ్లీ సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంది. ఈ లెక్కన దాదాపు 12 సీట్ల వరకు తాము గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ పరిపాలన, ఆరు గ్యారంటీల అమలు, రాహుల్ గాంధీ పాదయాత్ర, బీజేపీ వ్యతిరేక గాలి తమకు కలిసి వస్తుందన్నది హస్తం పార్టీ అంచనా. అసెంబ్లీ ఎన్నికల్లో చెక్ పెట్టిన బీఆర్ఎస్ మళ్లీ కోలుకోకుండా ఉండేందుకు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టింది. సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కింది స్థాయి బీఆర్ఎస్ క్యాడర్ లక్ష్యంగా ఈ ఆపరేషన్ సాగుతోంది. తెలంగాణలో తమ ప్రధాన ప్రత్యర్థి బీజేపీనే తప్ప బీఆర్ఎస్ కాదని నేతలు చెబుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుందని, దాదాపు 25 మంది ఎమ్మెల్యేలు కారు దిగడం ఖాయమని చెబుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ లో నలుగురు మాత్రమే ఉంటారని, మిగతా వారంతా బయటకు రావడం ఖాయమని గులాబీ నేతలను మానసికంగా కృంగదీసే వ్యాఖ్యలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా, కోమటి రెడ్డి వంటి మంత్రులు ఇలాంటి వ్యాఖ్యలతో మైండ్ గేమ్ లో దిగారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో 4 స్థానాల్లో మాత్రమే కమలం పార్టీ విజయం సాధించింది. ఈ దఫా దశ తిరిగి పది స్థానాలకుపైగా తెలంగాణలో దక్కించుకుంటామని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే మాత్రమే బీజేపీ నుంచి గెలిచారు. కాని 4 ఎంపీ స్థానాల్లో ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, సికింద్రాబాద్‌లలో గెలిచి బీజేపీ సంచలనం సృష్టించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 7 శాతం ఓట్లతో ఒక్క స్థానం గెలిచిన బీజేపీ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో 14 శాతం ఓట్లతో 8 స్థానాలు గెల్చుకుంది. అంతే కాకుండా దాదాపు 19 స్థానాల్లో రెండో స్థానంలో బీజేపీ నిలబడటం విశేషం . ఇందులో ఎక్కువ గ్రేటర్ హైదరాబాద్ అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తప్పనిసరిగా 10 స్థానాల వరకు గెలుస్తామని కమలం నేతలు చెబుతున్నారు. ఇప్పటికే ఆ పార్టీ కూడా ఆపరేషన్ ఆకర్ష్ స్టార్ చేసి బీఆర్ఎస్, కాంగ్రెస్ అసంతృప్త నేతలను తమ పార్టీలో చేర్చుకుంది. కొందరికి టికెట్లు కూడా ఇవ్వడం జరిగింది. ఇదే క్రమంలో బీజేపీ మా ఎమ్మెల్యేలను టచ్ చేస్తే ప్రభుత్వాన్ని కూల్చేస్తాం అని అల్టిమేటం జారీ చేయడం విశేషం. తమ పార్టీ గేట్ ఓపెన్ చేస్తే 48 గంటల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని జోస్యం చెబుతున్నారు. బొటా బొటి మెజార్టీతో ఉన్న కాంగ్రెస్, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అనుకున్న స్థానాల్లో గెలవకపోతే ప్రభుత్వ మనుగడ కష్టమేనని కమలం నేతలు తమ అంతర్గత సంభాషణల్లోను చెబుతున్నారు. ఏది ఏమైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందా.. ఊడుతుందా అంటూ...పొలిటికల్ మైండ్ గేమ్‌తో అధికార కాంగ్రెస్‌ను డిఫెన్స్‌లోకి నెట్టేందుకు కమలం నేతలు సన్సేషనల్ కామెంట్స్ చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా బీఆర్ఎస్ చతికిలబడటం, కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న ప్రచారం, ఎమ్మెల్సీ కవిత మద్యం కుంభకోణంలో జైలుకు వెళ్లడం, ముఖ్యనేతలు అనుకున్న వారంతా కారు దిగి హస్తం పార్టీలోకో, బీజేపీ గూటికో చేరడం వంటి పరిణామాలతో గులాబీ పార్టీ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. దీంతో పార్టీ క్యాడర్లో జోష్ నింపేందుకు కేసీఆర్ రంగంలోకి దిగారు. రైతుల పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని చెప్పేందుకు జిల్లా యాత్రలు చేపట్టారు. రైతులను పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీతోనే రైతులకు లాభం జరుగుతుందని యాత్ర ద్వారా చెప్పే ప్రయత్నం చేశారు. 39 అసెంబ్లీ స్థానాలు గెలవడంతో ఈ దఫా పార్లమెంట్ ఎన్నికల్లో కూడా 1 లేదా రెండు స్థానాల్లోనే గెలుస్తుందని సర్వేలు చెప్పడంతో కారు క్యాడర్‌లో నిరుత్సాహం ఆవహించింది. దాన్ని పొగొట్టే ప్రయత్నంలో కేసీఆర్ ఉన్నారు. ఈ క్రమంలోనే ఆయన పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో గందర గోళ రాజకీయాలు ఉంటాయని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలే సూచనలు ఉన్నట్లు చెపుతున్నారు. 104 మంది ఎమ్మెల్యేలు ఉంటేనే తన ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం బీజేపీ చేసిందని, 64 స్థానాలున్న కాంగ్రెస్ ను కూల్చడం పెద్ద కష్టం కాదని కేసీఆర్ సూత్రీకరిస్తున్నారు. కేటీఆర్, హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు లాంటి నేతలు కొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందని, రేవంత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీజేపీలో చేరడం ఖాయమని ప్రచారం చేస్తున్నారు. ఇదంతా చూస్తుంటే పార్టీ క్యాడర్ ను , లీడర్లను కాపాడుకోవడంతో పాటు ఈ ఎన్నికల్లో గరిష్ట ఎంపీ స్థానాలు గెల్చుకునే వ్యూహంతోనే బీఆర్ఎస్ నేతలు ఈ మైండ్ గేమ్ కు సిద్ధమయినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో గెలవడానికి ఎలాంటి అస్త్రలనైనా ఉపయోగించేందుకు రాజకీయ పార్టీలు వెనుకాడవు. అయితే కాంగ్రెస్ పార్టీ కూలుతుందని బీజేపీ-బీఆర్ఎస్ నేతలు చెప్పడం రానున్న రోజుల్లో ఈ రెండు పార్టీల మైత్రికి ఇదేమైనా నాందియా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. బీజేపీకి ప్రధాన శత్రువు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ మాత్రమే. బీఆర్ఎస్ జాతీయ పార్టీ అయినా దాని ప్రభావం జాతీయ రాజకీయాల్లో ఏ మాత్రం లేదు. కాబట్టి దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ కన్నా ప్రాంతీయ పార్టీలు ఉంటేనే బీజేపీకి లాభం. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు- మిత్రులు ఉండరన్న నానుడి బీజేపీ- బీఆర్ఎస్ కు వర్తిస్తుంది. అదే రీతిలో శత్రువు-శత్రువు మిత్రువు అన్న నానుడి కూడా ఈ రెండు పార్టీలకు వర్తిస్తుంది. ఎందుకంటే.. జాతీయ స్థాయిలో బీజేపీకి శత్రువు కాంగ్రెస్, రాష్ట్ర స్థాయిలో బీఆర్ఎస్ కు శత్రువు కాంగ్రెస్. ఈ సూత్రం ప్రకారం... బీజేపీ- బీఆర్ఎస్ లు రానున్న రోజుల్లో అంటే పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ను గద్దె దింపే ప్రయత్నాలు చేసే అవకాశం లేకపోలేదు.

ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీనే అటు బీఆర్ఎస్,బీజేపీ ఎమ్మెల్యేలను చేర్చుకుని కౌంటర్ ఎటాక్ చేస్తుందా... లేక కమలం, గులాబీ పార్టీలు కలిసి తెలంగాణలో కాంగ్రెస్ కు చెక్ పెడతాయా అన్నది మాత్రం వేచిచూడాల్సిందే. ఏది ఏమైనా. అన్ని పార్టీలు తమదైన శైలిలో మైండ్ గేమ్ స్టార్ట్ చేశాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ గేమ్ లో ఎవరు విన్ అవుతారో పార్లమెంట్ ఎన్నికల తర్వాతే తేలనుంది.

# నాలుగు జిల్లాలకు వరంగల్ నియోజకవర్గం..?

వరంగల్, ఏప్రిల్ 22, పార్లమెంట్ నియోజకవర్గం ఒక్కటే. కానీ ఆ నియోజకవర్గ నాలుగు జిల్లాల్లో విస్తరించి ఉంది. ఇలా ఒకటి కాదు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు పార్లమెంటు నియోజకవర్గం నాలుగు జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్, మహబూబాబాద్ రెండుపార్లమెంటు నియోజకవర్గాలు ఉన్నాయి ఈ రెండు నియోజకవర్గాలు ఒకటి ఎస్సీ నియోజకవర్గం కాగా మరొకటి ఎస్టీ నియోజకవర్గం. ఒక్కొక్క పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఎస్టీ రిజర్వుడ్ అయిన మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలోకి మహబూబాబాద్, ములుగు, నర్సంపేట, భద్రాచలం పినపాక, ఇల్లంద, డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గం వస్తాయి. అయితే ఈ నియోజకవర్గాలన్నీ నాలుగు జిల్లాల్లో విస్తరించి ఉండటం విశేషం. మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్, డోర్నకల్ ఉండగా వరంగల్ జిల్లా పరిధిలో నర్సంపేట, ములుగు జిల్లా పరిధిలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో భద్రాచలం, పినపాక, ఇల్లంద అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఈ ఏడు నియోజకవర్గాల్లో నర్సంపేట మినహా మిగితా ఆరు నియోజకవర్గాలు ఎస్టీ నియోజకవర్గాలు. ఇక వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి కూడా వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్ పూర్, పాలకుర్తి, పరకాల, భూపాలపల్లి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఇందులో వర్ధన్నపేట, స్టేషన్ ఘన్ పూర్ ఎస్సి నియోజక వర్గాలు కాగా మిగితా ఐదు నియోజకవర్గాలు జనరల్ స్థానాలు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం వరంగల్, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి జిల్లాల పరిధిలో ఉన్నాయి. ఈ రెండు నియోజకవర్గాల్లో గెలిచిన ఎంపి లు నాలుగు జిల్లాల్లో ప్రోటోకాల్ తీసుకోవడంతోపాటు నాలుగు జిల్లాల అధికారులతో కలిసి నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడాల్సిన అవసరం ఉంటుంది. ఒక్క జిల్లాలో ఉన్న రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు చిన్న జిల్లాల ఏర్పాటుతో నాలుగు, నాలుగు జిల్లాల పరిధిలోకి వెళ్ళాయి. 2014లో పది జిల్లాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ ఏర్పడే నాటికి సగటున 35 లక్షలకుపైగా జనాభా జిల్లాల్లో ఉండేది. 2016 అక్టోబరులో 30 జిల్లాలు ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత వనపర్తి, ములుగు, జోగులాంబ గద్వాలను ప్రత్యేక జిల్లాలుగా ఏర్పాటు చేసింది ప్రభుత్వం. దీంతో తెలంగాణలో జిల్లాల సంఖ్య 33కు చేరింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా విభజన తర్వాత ఏడు జిల్లాల పరిధిలోకి వెళ్లింది. ఎంపీ ఏదైనా సమస్యను పరిష్కరించాలంటే ఐదు జిల్లాల అధికారులతో మాట్లాడాల్సి వస్తుంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిషత్‌లో సభ్యుల సంఖ్య కేవలం ఐదు. వారిలో ఒకరు చైర్మన్ కాగా, మరొకరు వైస్ చైర్మన్‌గా ఉన్నారు. ఈ ఐదుగురితోనే జిల్లా పరిషత్ నడుస్తోంది. తెలంగాణలో జిల్లాల విభజన తర్వాత ఇలాంటి విచిత్రాలు చాలా చోటు చేసుకున్నాయి.

# మాగంటి ప్రధాన అనుచరుడి అరెస్ట్



హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రధాన అనుచరుడు తన్ను ఖాన్ను మధురా నగర్ పోలీసులు అరెస్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రౌడీ షీటర్ తన్నుఖాన్ తన సహచ రులు జకీ, సలీమ్లతో కలిసి జనవరి 24న ఓ వ్యక్తిపై దాడి చేశారు. మరొక ఘటనలో లాక్డౌన్ సమయంలో నలుగురు బాధితులను ఎటువంటి కారణం లేకుండా దారుణంగా కొట్టాడు. బాధితులు భయంతో పోలీసు లకు ఫిర్యాదు చేయలేదు. నవంబర్ 2023లో ఈ సంఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో మధురానగర్ పోలీసులు అతనిపై సుమోటోగా కేసు నమోదు చేశారు. ఇక మూడో కేసు లో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారని, అలాగే ప్రభుత్వ నాలాను అక్రమంగా ఆక్రమించారని, ప్రభుత్వ స్థలంలో ఫెన్సింగ్ వేసి జంతువులను పెంచుతున్నారని తన్నుఖాన్ పై ప్రజలు, జీహెచ్ఎంసీ అధికారులు మధురానగర్ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు. జనవరి 20 నుంచి పరార్లోలో ఉన్న తన్నుఖాన్ను విశ్వసనీయ సమాచారం మేరకు మధురానగర్ పోలీసులు శని వారం మాదాపూర్లో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరి చారు. మేజిస్ట్రేట్ అతనికి మే 4వ తేదీ వరకు రిమాండ్ విధించిందని పోలీసులు తెలిపారు.

# జలాశయాల్లో పుష్కలంగా నీరు...

హైదరాబాద్, ఏప్రిల్ 22, హైదరాబాద్ మహానగరానికి వేసవి నీటి కష్టాలు గట్టెక్కించేందుకు జలమండలి శ్రీకారం చుట్టింది. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్, సింగూరు జలాశయాల్లో పుష్కలంగా నీరుందని, హైదరాబాద్ మహా నగర తాగునీటి సరఫరాకు ఎలాంటి ఢోకా లేదని స్పష్టం చేశారు. అవసరమైతే రెండు రిజర్వాయర్ల నుంచి ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా తాగునీరు అందించడానికి జలమండలి సిద్ధంగా ఉందన్నారు. నీటి వినియోగదారులందరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎండీ విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే, నాగార్జున సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 508 అడుగులకు చేరింది. నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో.. ఈ ప్రభావం హైదరాబాద్ తాగునీటి మీద పడకుండా. ఉండేందుకు ఏడేళ్ల తర్వాత అత్యవసర పంపింగ్ ప్రారంభించారు. చివరి సారిగా 2017 లో పంపింగ్ చేశారు. సాగర్ జలాశయంలోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి పుట్టగండి అప్రోచ్ కెనాల్ ద్వారా నీటిని లిఫ్ట్ చేసి, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా నీటిని సేకరిస్తున్నారు. అక్కడ నీటిని శుద్ధి చేసి.. వాటిని హైదరాబాద్ కు తరలిస్తున్నారు. అందుకోసం నాగార్జున సాగర్ జలాశయంలో ఎమర్జెన్సీ పంపింగ్ మొదలుపెట్టింది. 10 పంపులను ఉన్నతాధికారుల సమక్షంలో హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండీ సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. నాగార్జున సాగర్ లో నగర తాగునీటి అవసరాల దృష్ట్యా ఎమర్జెన్సీ పంపింగ్ ప్రారంభించినట్లు ఎండి తెలిపారు. అవసరమైతే, రెండో దశ అత్యవసర పంపింగ్ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. నీటిలో తేలియాడే సబ్ మెర్సిబుల్ పంపుల ద్వారా నీటి సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. మే నెల 15 తేదీ నుంచి ఎల్లంపల్లి జలాశయంలో అత్యవసర పంపింగ్ ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ఓఆర్ఆర్ వరకు విస్తరించిన హైదరాబాద్ మహా నగర వాసుల తాగునీటి అవసరాల కోసం జలమండలి సరఫరా చేస్తోంది. నాగార్జున సాగర్ జలాశయం, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్ ? 1, 2, 3 ద్వారా రోజుకి 270 ఎంజీడీల నీటిని తరలిస్తోంది. ఈ లెక్కన నెలకు 1.38 టీఎంసీల నీటిని సరఫరా చేస్తుంది. అయితే ఏప్రిల్ 20వ తేదీ నాటికి నాగార్జున సాగర్ నీటి నిల్వ సామర్థ్యం 127.630 టీఎంసీ, 507.600 అడుగులు ఉంది. గతేడాది ఇదే రోజున 156.670 టీఎంసీలు, 524.000 అడుగుల నీరు ఉంది. ఈ ఏడాది నగరానికి సరఫరా చేసే సామర్థ్యం 2600 ఎంఎల్డీలకు పెంచారు. గతేడాదితో పోలిస్తే.. ఈ సంవత్సరం 175 ఎంఎల్డీల అదనపు నీటిని సరఫరా చేస్తురు. ఈ నీటిని ప్రధానంగా బోర్ వెల్స్ ఎండిపోయిన ప్రాంతాల్లో సరఫరా చేస్తున్నట్లు వాటర్ వర్క్స్ అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే ఏప్రిల్15వ తేదీ నుంచి హిమాయత్ సాగర్ నుంచి అదనంగా 7 ఎంజీడీల నీటి సరఫరా చేస్తున్నట్లు జలమండలి పేర్కొంది. వచ్చే నెల 15 నుంచి మరో 30 ఎంఎల్డీల అదనపు నీరును సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది. ఇక ఏప్రిల్ 10వ తేదీ నుంచి ఉస్మాన్ సాగర్ నుంచి 5 ఎంఎల్డీల నీరు సరఫరా చేశారు. రెండు మైక్రో ఫిల్టర్స్ ను ఆక్టివేట్ చేశారు. వచ్చే నెల 5 నుంచి మరో 4 మాడ్యులర్ నీటి శుద్ధి కేంద్రాల ద్వారా 12 ఎంఎల్డీల నీటిని సరఫరా చేయనున్నట్లు హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు తెలిపింది.

# అన్నీ వేళ్లూ పల్లా వైపే ఎందుకు...

హైదరాబాద్, ఏప్రిల్ 22 భారత రాష్ట్ర సమితిని నాయకులు పార్టీని వదిలి వెళుతున్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికలలో ఓటమి పాలు కావడంతో అధికారంలోకి వచ్చిన పార్టీలోకి జంప్ చేస్తున్నారు. ఎమ్మెల్యేలు అస్సలు ఆగడం లేదు. పదేళ్లు కీలక పదవులు అనుభవించిన వారు కూడా కారు దిగి వెళ్లిపోతున్నారు. అందులో కేసీఆర్ నాయకత్వంపై నమ్మకం లేక కాదు. ఈసారి ఓడిపోయారంటే కేసీఆర్ ఇక భవిష్యత్ లో గెలవరన్న గ్యారంటీ అయితే లేదు. ఇప్పుడు కాకపోయినా మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని అంచనా వేయలేని పిచ్చోళ్లు కాదు. కానీ వదిలి వెళుతున్నారంటే ఇన్‌స్టంట్ ప్రయోజనాలేనన్నది ఒక కారణంగా వినిపిస్తుంది. అందుకే పార్టీని వీడి వెళుతున్న వారంతా ఒక వ్యక్తి వైపు వేలు చూపి వెళుతున్నారు. ఆయనే పల్లా రాజేశ్వర్ రెడ్డి. పల్లా చెబుతున్న మాటలు వింటూ కేసీఆర్ మిగిలిన నేతలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నది వదలి వెళుతున్న నేతల ఆరోపణ. కడియం శ్రీహరి కూడా ఇదే రకమైన ఆరోపణ చేసి పార్టీని వీడి వెళ్లారు. తాజాగా శాసనమండలి గుత్తా సుఖేందర్ రెడ్డి కూడా పరోక్షంగా అదే రకమైన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ చెప్పుడు మాటలు వింటున్నారని, ఆయన మిగిలిన నేతలను పట్టించుకోవడం లేదని, ఎవరినీ కలవరని కూడా ఆయన అన్నారంటే అది పల్లా రాజేశ్వర్ రెడ్డి గురించి అని గులాబీ పార్టీలో నేతలు గుసగుసలాడుకుంటున్నారు. నిజంగా పల్లా రాజేశ్వర్ రెడ్డిపై పార్టీలో అంత వ్యతిరేకత ఉందా? అంటే నేతల వ్యాఖ్యలను బట్టే కాదు... ముఖ్యంగా 2018 నుంచి 2023 వరకూ ప్రభుత్వం, పార్టీలో జరిగిన పరిణామాలను చూసి అవుననాలనిపిస్తుందంటున్నారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఎవరినీ కలవరు. ఎక్కువ సేపు నేతలతో రాజకీయాల గురించి మాట్లాడటానికి ఇష్టపడరు. తాను చెప్పిందే ఆచరించాలి. అంతే తప్ప నేతల నుంచి ఫీడ్ బ్యాక్ ను తీసుకునే ప్రయత్నం చేయరన్న అపవాదు ఎప్పటి నుంచో ఉంది. అయితే 2018 ఎన్నికల తర్వాత పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రాధాన్యత పార్టీలో బాగా పెరిగిందంటున్నారు. ఆయన చెప్పిన వారికే టిక్కెట్లు ఇవ్వడం దగ్గర నుంచి కొందరు నేతలకు పదవులు ఇప్పించడంలోనూ పల్లా ప్రముఖ పాత్ర పోషించాడంటారు. అది గులాబీ పార్టీలో అందరూ ఒప్పుకునేదే. ఎక్కడకు వెళ్లినా కేసీఆర్ పక్కన పల్లా రాజేశ్వర్ రెడ్డి ఉండటం కూడా ఆ అనుమానాలకు, వెలిబుచ్చుతున్న సందేహాలకు మరింత ఊతమిస్తుంది. పల్లాను ఎందుకు అంతగా కేసీఆర్ నమ్మారంటే చెప్పలేరు కానీ నేరుగా కేసీఆర్ దగ్గరకు వెళ్లగలిగిన నేత బీఆర్ఎస్ లో ఎవరైనా ఉన్నారంటే ఆయన పల్లా రాజేశ్వర్ రెడ్డి అని చెప్పవచ్చు. పల్లా రాజేశ్వర్ రెడ్డికి తొలుత రైతు సమితి అధ్యక్షుడిని చేశారు. తర్వాత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయించారు. మరోసారి కూడా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్ రెడ్డినే ఎంపిక చేశారు కేసీఆర్. అంతే కాదు శాసనసభ ఎన్నికల్లో పల్లాకు జనగామ టిక్కెట్ ను కూడా ఇవ్వడంతో ఆయన కేసీఆర్ వద్ద ఎంత పట్టు సంపాదించారో చెప్పకనే అర్థమవుతుందన్నది నేతల నుంచి వినిపిస్తున్న వాదన. ఇలాంటి పరిస్థితుల్లో నేతలు వెళ్లకుండా ఉండాలంటే పల్లా రాజేశ్వర్ రెడ్డిని పక్కన పెట్టాల్సిన పరిస్థితి తప్పదంటున్నారు. కేటీఆర్, హరీశ్‌రావును మించి పల్లా రాజేశ్వర్ రెడ్డిపై నేతలందరూ విమర్శల దాడి చేసి వెళ్లడం చూస్తుంటే.. ఆయన ఇప్పటికైనా కేసీఆర్ పక్కన పెట్టి నేతల జంప్ లకు ఫుల్ స్టాప్ పెడతారా? లేక కంటిన్యూ చేసి ఎవరు పోయినా నో ప్రాబ్లం అంటూ ముందుకుసాగుతారా? అన్నది చూడాల్సి ఉంది.

# 25 నుంచి తెలంగాణకు బీజేపీ జాతీయ నేతలు

హైదరాబాద్,,ఏప్రిల్ 22 తెలంగాణలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలపై బీజేపీ అగ్రనాయకత్వం దృష్టి సారించింది. ఇప్పటికే తెలంగాణలోని కీలక నేతలు ఆయా నియోజకవర్గాల్లో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల చివరి వారంలో కేంద్ర అగ్ర నాయకులు కూడా తెలంగాణలో ప్రచారానికి రానున్నారు. ముఖ్య నాయకుల ప్రచారంతో జోరు పెంచేందుకు బీజేపీ సిద్ధమవుతోంది. ఈ నెల 25న నామినేషన్ల దాఖలు గడవు ముగియనున్ననేపథ్యంలో పలువురు జాతీయ నేతలు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ప్రచారానికి వస్తున్నారు. ఈ నెల 25న బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా వరంగల్‌తోపాటు మరో మూడు చోట్ల ఆయన ప్రచారం చేస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో పార్టీ ముఖ్య నేతలతో ఆయన సమావేశం కానున్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల పరిధిలో పార్టీ పరంగా నిర్వహిస్తున్న ప్రచారం, ప్రజలకు చేరవయ్యేందుకు అమలు చేస్తున్న కార్యాచరణ, పోలింగ్ బూత్ స్థాయిల్లో జరుగుతున్న కృషి, ఎన్నికలకు సంబంధించిన ఇతర అంశాలను ఆయన రాష్ట్ర ముఖ్య నేతలతో ఆయన సమీక్షించనున్నారు. ఇదే విషయాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడించారు. అమిత్ షాతోపాటు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ కూడా ఆది, సోమవారాల్లో వివిధ సమావేశాల్లో పాల్గొంటారని ఆయన వెల్లడించారు. పార్టీ ఎన్నిలకు సిద్ధమవుతున్న తీరు, క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న ప్రచారంపై ఆయన సమీక్షించనున్నట్టు కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలోని పలు పార్లమెంట్ స్థానాల పరిధిలో ప్రచారాన్ని నిర్వహించేందుకు ప్రధాని మోదీ కూడా రానున్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదు. ఈ నెలాఖరులో గానీ, మే మొదటి వారంలోగానీ పర్యటనకు రానున్నట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రధాని మోదీ ఇప్పటికే ఒకసారి ప్రచారానికి వచ్చారు. మలి విడత ప్రచారానికి రానున్న ప్రధాని మోదీ మూడు నాలుగు సభలతోపాటు రోడ్ షోల్లో పాల్గొంటారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ప్రధాని పాల్గొననున్న సభలు, రోడ్ షోలకు సంబంధించిన వివరాలను పార్టీ నాయకత్వం ఖరారు చేయాల్సి ఉంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా ఈ నెలాఖరు లేదా మే పదో తేదీలోగా రాష్ట్రానికి వస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాల్లో పది నుంచి 12 స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అగ్ర నేతలు తెలంగాణలో ప్రచారానికి వస్తున్నారు. ఈ మేరకు ఆయా స్థానాలు గెలిచేందుకు ఉన్న అవకాశాలు, అక్కడ అనుసరించాల్సిన వ్యూహాలపైనా రాష్ట్ర నాయకులకు పార్టీ అగ్రనాయకత్వం దిశా, నిర్దేశం చేసింది. క్షేత్రస్థాయిలో తమకు సానుకూలంగా ఉన్న అంశాలను మరింత బలోపేతం చేసుకోవడంతోపాటు ముఖ్య నేతల ప్రచారం కూడా తోడైతే విజయం సాధించడం సులభమవుతుందన్న భావనను ఆ పార్టీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. అందుకు అనుగుణంగానే ఆ పార్టీ అగ్ర నేతలు రాష్ట్ర పర్యటనకు క్యూ కడుతున్నారు. పార్టీ ప్రచారానికే కాకుండా ముఖ్య నేతలు నామినేషన్ దాఖలు కార్యక్రమానికి కూడా కొందరు కేంద్ర మంత్రులు, జాతీయ నాయకులు హాజరయ్యే అవకాశాలు ఉన్నట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి

# టీడీపీ ప్రభంజనం ఖాయం

చంద్రగిరి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో టీడీపీ ప్రభంజనం రోజురోజుకు పెరిగిపోతోందని, ఈ ప్రభజనంలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమని టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్ రావు, టీడీపీ చిత్తూరు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ లు జోస్యం చెప్పారు. శనివారం తిరుచానూరు పంచాయతీలోని రంగనాథం వీధి, వేపమాను వీధి, రేణిగుంట రోడ్డు ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులతో కలిసి వారు పెద్ద ఎత్తున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ పల్లెకు వెళ్లినా ప్రజలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ఐదేళ్ల వైసిపి రాక్షస పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నట్లు సంసిద్ధంగా ఉన్నారని అన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీ వాళ్ళు ఓటుకు 10వేలు ఇచ్చిన ప్రజా మద్దతు తమకే ఉందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం వారిని టీడీపీ నాయకులు భారీ గజమాల, దుశ్శాలువా లతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, కిషోర్ రెడ్డి, మునిరత్నం రెడ్డి, హరిరాం రెడ్డి, దామినేడు రమేష్, సాల్మన్రాజు, కలీమ్, మోహన్ రెడ్డి, రమణ రాయల్, జనసేన వెంకట్ రాయల్, బీజేపీ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ఆకర్ష్... ఫెయిలైందా... ముగ్గురితో ముగింపేనా

హైదరాబాద్, ఏప్రిల్ 22 తెలంగాణ కాంగ్రెస్ పార్టీ హైప్ ఇచ్చిన ఎమ్మెల్యేల చేరికల అంశం క్రమంగా బెదిరింపుల జాబితాలోకి చేరుతోంది. పార్లమెంట్ ఎన్నికలకంటే ముందే ఎమ్మెల్యేలను పెద్ద ఎత్తున చేర్చుకుంటామని బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకుంటామని ప్రకటనలు చేశారు. కానీ ఇప్పుడు ప్రత్యేకమైన కారణాలతో చేరిన ముగ్గురు ఎమ్మెల్యేలు తప్ప మిగిలిన వారు వెనుకడుగు వేస్తున్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమైన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కూడా చివరి క్షణంలో ఆగిపోయారు. తన మనవరాలితో తన తాత కాంగ్రెస్ పార్టీలో చేరడం లేదన్న ప్రకటన చేయించారు.

ప్రభుత్వాన్ని కూల్చేస్తామన్న హెచ్చరికలు క్రమంగా పెరుగుతూండటంతో రేవంత్ రెడ్డి ముందు జాగ్రత్త పడుతున్నారు. మొదట్లో ఆయన ఎమ్మెల్యేలను చేర్చుకోవాలని అనుకోలేదు. కానీ ప్రభుత్వ మనుగడపై పదే పదే బీఆర్ఎస్, బీజేపీ నేతలు వ్యాఖ్యలు చేస్తూండటంతో ఆయన ఎమ్మెల్యేలను ఆకర్షించాలని నిర్ణయించుకున్నారు. చాలామంది ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారని సంకేతం ఇవ్వడానికి ముందస్తుగా మర్యాదపూర్వక భేటీలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీతో పాతిక మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారన్న అభిప్రాయాన్ని కల్పించేందుకు ప్రయత్నించారు. బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోయే నేతలు పెరిగిపోతూండటంతో.. బీఆర్ఎస్ఎల్పీ విలీనం ఖాయమనుకున్నారు. కానీ రాను రాను పరిస్థితి నెమ్మదించింది. లోక్ సభ టిక్కెట్లు ఆఫర్ చేసిన వారు మాత్రమే పార్టీలో చేరారు. మిగిలిన వారు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకుంటామని ఇరవై ఐదు మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతారని చేస్తున్న ప్రచారం అంతా డొల్లగా తేలుతోంది. ముందుకు వచ్చిన ఒక్కో ఎమ్మెల్యేకు కండువా కప్పుతున్నారు కానీ..అందర్నీ ఒకే సారి చేర్చుకుని షాకివ్వాలని అనుకోవడం లేదు. ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ఎల్పీ విలీనం పూర్తి చేసి.. కేసీఆర్ నైతిక స్థైర్యం దెబ్బతీయాలని అనుకున్నారన్న ప్రచారం జరిగింది. కానీ అక్కడొక ఎమ్మెల్యే.. ఇక్కడొక ఎమ్మెల్యే తప్ప.. అందరూ కలసి కట్టుగా వచ్చి చేరే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పటికే ముగ్గురు మాత్రమే కాంగ్రెస్ లో చేరారు. దానం నాగేందర్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడం కోసం చేరారు. ఒక వేళ ఓడిపోతే ఆయనకు మంత్రి పదవి ఇస్తారమని ఆఫర్ ఇచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. కడియం శ్రీహరి కూడా పార్టీలో చేరారు. ఆయన కుమార్తెకు లోక్ సభ టిక్కెట్ ఖరారు చేశారు. అలాగే ఖమ్మం జిల్లాకు చెందిన ఏకైక బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజకీయ గురవు. అందుకే ఆయన ఫలితాలు వచ్చిన రోజునే కాంగ్రెస్ పార్టీ క్యాంపులో కనిపించారు. రవఆయన చేరికపై పెద్దగా ఎవరూ ఆశ్చర్యపోలేదు. ఇటీవల తుక్కుగూడలో నిర్వహించిన బహిరంగసభలోనే పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతారని ప్రచారం చేశారు. ఓ పదహారు మంది ఎమ్మెల్యేల పేర్లు ప్రచారంలోకి వచ్చారు. దాదాపుగా అందరూ ఖండించారు. ఎవరూ పార్టీలో చేరలేదు కూడా. నిజానికి చేరుతారని కాంగ్రెస్ పార్టీ కూడా ప్రకటించలేదు. తాజాగా కేసీఆర్ తమతో ఇరవై మంది ఎమ్మెల్యేల టచ్‌లో ఉన్నారని ప్రకటించగానే.. ఓ ఎమ్మెల్యేను అయినా పార్టీలో చేర్చుకుని షాకివ్వాలనుకన్నారు. ప్రకాష్ గౌడ్ చేరేందుకు సిద్ధమైనా ఆయన ఆగిపోయారు. ఇలాంటి వారు చాలా మంది ఉన్నారని పార్టీలో చేరేందుకు సమయం కావాలని అడుగుతున్నారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ఫలితాల ఆధారంగానే చేరికలు ఉంటాయి. కాంగ్రెస్ పార్టీ పది స్థానాల వరకూ గెల్చుకుంటే ఆ పార్టీకి తిరుగు ఉండదు. బీజేపీ మెజార్టీ స్థానాలను దక్కించుకుంటే రాజకీయం అంతా మారిపోతుందన్న అంచనాలు ఉన్నాయి. బీజేపీకి పరోక్షంగా సాయం చేసేందుకు బీఆర్ఎస్ రెడీ అయిందని చెబుతున్నారు. ఈ క్రమంలో ఇప్పుడే? కాంగ్రెస్ పార్టీలో చేరితే.. తర్వాత సమస్యలు వస్తాయని.. పరిస్థితుల్ని బట్టి నిర్ణయాలు తీసుకుందామన్న ఆలోచనలో ఇతర ఎమ్మెల్యేలు ఉన్నారు. లోక్ సభ ఎన్నికల తర్వాత రేవంత్ ప్రభుత్వం స్థిరంగా ఉంటుదనుకుంటే.. పోలోమంటూ ఎమ్మెల్యేలు చేరిపోడం ఖాయం అనుకోవచ్చు. బీఆర్ఎస్ పార్టీ మెజార్టీ లోక్ సభ సీట్లు గెల్చుకోవడం అసాధ్యమని అందరూ నమ్ముతున్నారు. ఆ పార్టీ నేతలు కూడా నమ్మకంగా లేరు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీజేపీ ఉపేక్షించదని అనుకుంటున్నారు. కేసీఆర్ కూడా అదే చెబుతున్నారు. కానీ అదంతా మైండ్ గేమ్ రాజకీయమని.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు పది కన్నా తక్కువ సీట్లు వచ్చే అవకాశమే లేదని కాంగ్రెస్ నేతలు నమ్ముతున్నారు.

కాంగ్రెస్ లో చేరేందుకు అంత ఆసక్తి చూపించకపోయినా బీఆర్ఎస్ లో మాత్రం ఎవరూ యాక్టివ్ గా ఉండం లేదు. పార్టీలో ఉన్నామంటే ఉన్నామన్నట్లుగా సమావేశాలుక హాజరవుతున్నారు కానీ లోక్ సభ ఎన్నికల ప్రచారంలో అంత యాక్టివ్ గా కనిపించడం లేదు. పైగా కాంగ్రెస్ అభ్యర్థులకు కొన్ని చోట్ల.. బీజేపీ అభ్యర్థులకు కొన్ని చోట్ల సహకరిస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీకి దగ్గరగానే ఉంటున్నారు. సుధీర్ రెడ్డి లాంటి వారి సంగతి చెప్పాల్సిన పని లేదు. రేవంత్ రెడ్డితో మర్యాదపూర్వక భేటీలకు హాజరై.. తమకు ఉన్న సమస్యలను పరిష్కరించుకున్నారు కానీ పార్టీ మారే ఆలోచన చేస్తున్నారో లేదో స్పష్టత లేదు. పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చే ఫలితాలను బట్టే తర్వాత రాజకీయం ఉంటుందని భావిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ తమ ఓటు బ్యాంక్ ను కూడా నిలుపుకోవడానికి కష్టపడితే అప్పుడు మిగిలిన ఎమ్మెల్యేల తమ దారి తాము చూసుకునే అవకాశం ఉంది. అయితే వారి చాయిస్ కాంగ్రెస్ నా బీజేపీనా అన్నది కూడా ఎన్నికల్లో వచ్చే ఫలితాలను బట్టే ఉండవచ్చు.

# అందరి చూపు పుంగనూరు వైపు...

## ముగ్గురు రామచంద్రుల్లో గెలిచేదెవరు? నాలుగో సారి మంత్రి పెద్దిరెడ్డి సత్తా చాటుకుంటారా ? ఉత్కంఠ గా మారిన పుంగనూరు రాజకీయ సమీకరణాలు.

పుంగనూరు నియోజకవర్గం అంటే రాష్ట్రంలోనే ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎందుకంటే రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన పాత్రను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని చెప్పుకోవచ్చు. అసెంబ్లీ ఎన్నికల బరిలో వైకాపా తరపున రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తెలుగుదేశం పార్టీ తరఫున చల్లా రామచంద్రారెడ్డి, బీసీవై పార్టీ తరఫున ఆ పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ లు నేటి వరకు బరిలో ఉన్నారు.

చివరకు వీరి పేర్లే ఖరారు అయితే అందరి పేర్లలోనూ రామచంద్ర ఉండడంతో ఈసారి ఏ రామచంద్రుడు విజయ శంఖం పూరిస్తాడో అని ప్రజలలో చర్చలు మొదలయ్యాయి. పుంగనూరు నియోజకవర్గం అంటే ఒకప్పుడు తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉండేది.మాజీ ఎంపీ దివంగత నేత నూతన కాల్వ రామకృష్ణారెడ్డి ఓటమి ఎరుగని నాయకుడిగా, పుంగనూరు నుంచి పలుసార్లు ఎమ్మెల్యేగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎంపీగా తెలుగుదేశం జెండా ఎగురవేశారు.

సదుం, పులిచెర్ల, రొంపిచర్ల మండలాలు పుంగనూరులో కలవడంతో ప్రస్తుత రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీలేరు నియోజకవర్గం వదిలి పుంగనూరు నుంచి బరిలో దిగారు. 2009 వ సంవత్సరం నుండి తెలుగుదేశంకు కంచుకోటలా ఉన్న పుంగనూరులో తన ఎదురులేని నాయకత్వ పఠిమతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మూడుసార్లు హ్యాట్రిక్ విజయం సాధించారు.

2009 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున 84083 ఓట్లు, 2014 వైకాపా తరుపున 1,04587 ఓట్లు, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 1,07431 ఓట్లు సాధించి ప్రతిపక్ష అభ్యర్థులపై భారీ మెజారిటీతో పుంగనూరును వైయస్సార్ పార్టీ కంచుకోటగా మార్చేశారు.

ఇక ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీ (2009) నుంచి గత మూడు పర్యాయాలు ఓటమి చెందింది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు 2009 అసెంబ్లీ ఎన్నికల్లో 43356 ఓట్లు, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 72856 ఓట్లు, 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 63876 ఓట్లు సాధించింది. పుంగనూరులో అభ్యర్థి ఎవరైనా తెలుగుదేశం పార్టీకి 60 వేలకు పైగా ఓటు బ్యాంకు గ్యారెంటీ అని నిరూపించడానికి ఇది సంకేతం. ప్రస్తుతం పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా చల్లా రామచంద్రారెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు, గతంలో (1989) పీలేరు అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై పోటీ చేసిన అనుభవం, తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి వారసత్వం అనుచరగణం రాజకీయ పరంగా చల్లా బాబుకు కలిసొచ్చే అంశం. ప్రస్తుతం చల్లా రామచంద్రారెడ్డి ఎన్నికల మహాసంగ్రామానికి ఎంతవరకు ముందుకు తీసుకెళ్తారనేది ఇన్చార్జి చల్లా బాబు నాయకత్వానికి పెద్ద సవాల్ గా మారనుంది. జనసేన మద్దతు జన సైనికుల సహకారం చల్లాబాబుకు ప్లస్ పాయింట్ కానుందా అనేది వేచిచూడాలి.

ఇక భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు యువ నాయకుడు బోడే రామచంద్ర యాదవ్ పుంగనూరు నియోజకవర్గంలో తనదైన ముద్ర వేయాలని పావులు కదుపుతున్నారు. ఈయన గత 2019 అసెంబ్లీ ఎన్నికలో జనసేన తరఫున బరిలో దిగి 16,452 ఓట్లు సాధించారు. రాజకీయ అనుభవం లేకున్నా అంతుచిక్కని వ్యూహాలతో ప్రత్యర్థి నాయకులకు రాజకీయ సవాళ్లు విసురుతుంటారు. అధికార పక్షం నాయకులతో ప్రత్యక్ష యుద్ధమే చేస్తున్నారు. ఈసారి పుంగనూరు నుంచి బీసీవై పార్టీ అభ్యర్థిగా ఆయన బరిలో దిగనున్నారు. బోడే రామచంద్ర యాదవ్ కు ఢిల్లీ స్థాయిలో, జాతీయ నేతలతో, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మంచి సంబంధాలు ఉండడం, యాదవ సామాజిక వర్గం, వై ప్లస్ కేటగిరి భద్రత కలిగి ఉండడం బోడె రామచంద్ర యాదవ్ కు కలిసొచ్చే అంశాలు. పుంగనూరు నియోజకవర్గంలో రామచంద్ర యాదవ్ ను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేరుగా ఢీకొట్టలేకపోతున్నారని, రామచంద్ర యాదవ్ తలపెట్టే అన్ని కార్యక్రమాలను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన అధికార బలంతో, పోలీసును అడ్డుపెట్టుకుని తాను తలపట్టే కార్యక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇది నేటి వరకు పుంగనూరులో ముగ్గురు రామచంద్రుల రాజకీయ చిత్రం

# కాలనీ వాసులతో ముచ్చటించిన ఈటెల

సికింద్రాబాద్ మల్కాజిగిరి : మల్కాజిగిరి నియజికవర్గం లోని వినాయక్ నగర్ డివిజన్ లో స్థానిక బిజెపి కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తో కలిసి బిజెపి ఓఖ అభ్యర్థి ఈటెల రాజేందర్ పలు కాలనీ వాసులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ రాబొయ్యే ఎన్నికల్లో ప్రజలు భారతీయ జనతా పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ చేసిన హామీలు కేవలం నామమాత్రమే అని అవి అమలు అయ్యేవి కాదు అని విమర్శించారు.

# ప్రజా ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి - ఆది మూలాపు సతీష్

సి. బెలగల్ మండలంలోని మూడుమాల, పల్దొడ్డీ,రంగాపురం గ్రామాలలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో వైఎస్ఆర్సీపీ అభ్యర్థి డాక్టర్ ఆది మూలపు సతీష్,కోడుమూరు వైఎస్ఆర్సీపీ సమన్వయ కర్త కోట్ల హర్ష వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్య క్రమంలో వైఎస్ఆర్సీపీ అభ్యర్థి డాక్టర్ ఆది ములపు సతీశ్ మాట్లడుతూ జగన్ మోహన్ రెడ్డి మన కోసం 130 సార్లు బటన్ నొక్కితే మనం ఆయనను ముఖ్య మంత్రి చేయడానికి 2 సార్లు బటన్ నొక్కి ఎంఎల్ఏ అభ్యర్థి అయిన నన్ను ఎం.పి అభ్యర్తి అయిన బి.వై రామయ్య కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.మీ పిల్లలకు భవిష్యత్లో విద్య , వైద్యం అందించే బాధ్యత నాది అని పేర్కొన్నారు.అనంతరం కోడుమూరు వైఎస్ఆర్సీపీ సమన్వయ కర్త కోట్ల హర్ష వర్ధన్ రెడ్డి మాట్లడుతూ చంద్ర బాబు నాయుడు 14 సంవత్సరాలు ముఖ్య మంత్రిగా పరిపాలన చేసిన చెప్పుకోవడానికి ఒక్క మంచి పథకం కూడా లేదు.కానీ మన జగన్ మోహన్ రెడ్డి ఈ 5 సంవత్సరాల్లోనే నాడు నేడు ద్వార స్కూల్, హాస్పటల్ రూపు రేఖలు మార్చారు . మన గ్రామాలలో మన ఎదుటనే రైతు భరోసా కేంద్రాలు, సచివాలయలు ఏర్పాటు చేసి ప్రతి సంక్షేమ పథకాలు మన ఇంటి దగ్గరకే వస్తున్నాయి అని పేర్కొన్నారు. ఇన్ని మంచి పనులు చేసే ప్రజా ప్రభుత్వాన్ని మరో సారి అవకాశం కల్పించాలని కోరారు.ఈ కార్య క్రమంలో మాజీ ఎమ్మల్యే కొత్తకోట ప్రకాష్ రెడ్డి, మణి గాంధీ,వైఎస్ఆర్సీపీ స్టేట్ కమిటీ మెంబర్ సంధ్య విక్రమ్, ఎం.పి.పి బొంతల మున్నెప్ప, మండల కన్వీనర్ సోమ శేఖర్ రెడ్డి,తులసి రెడ్డి, రఘు రెడ్డి,ఎంపీటీసీ ప్రేమమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, శంకర్ రెడ్డి , సర్పంచులు రత్నమ్మ,మద్దిలేటి,గుండ్రేవులు సర్పంచ్ శ్రీనివాస రెడ్డి,పాండు రంగన్న,ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వార్డులో మౌళిక సదుపాయాలను కల్పిస్తాం -మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమా సురేష్ రెడ్డి



మంథని మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో మౌళిక సదుపాయాలను కల్పిస్తామని మంథని మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమా సురేష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మంథని మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్ పల్లి లో వార్డు సందర్శనలో భాగంగా

మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమ సురేష్ రెడ్డి పర్యటించారు. కుచిరాజ్ పల్లి లోని పలు వీధుల్లో తిరుగుతూ ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడ అవసరం ఉంటే అక్కడ వీలైనంత తొందరగా మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఏర్పాటుకు మంత్రి శ్రీధర్ బాబు సహకారం తీసుకుని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అదేవిధంగా హనుమాన్ జయంతి సందర్భంగా పారిశుధ్యం కు సంబంధించిన పనులను దగ్గరుండి ఆమె పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బాణయ్య, కౌన్సిలర్ నక్క నాగేంద్ర, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# గడ్డం వంశి కృష్ణ నుఅత్యధిక మెజార్టీతో గెలిపించా




కమాన్ పూర్ పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నేత ల శీను బాబు అన్నారు. సోమవారం రామగిరి మండలం కలవచర్ల శ్రీరామాంజనేయ స్వామి దేవాలయంలో పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ తో కలిపి శీను బాబు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా శీను బాబు మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ప్రతి కార్యకర్త గెలుపు నకు కృషి చేయాలని అన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చూడడమే ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ధ్యయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్లతిరుపతి యాదవ్ ఎంపీపీ ఆ రెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య బర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఓటు విలువ తెలుసుకోవాలి

కమాన్ పూర్ ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలని సాంస్కృతిక కళామండలి కళాకారులు పాటల రూపంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ వారి ఆధ్వర్యంలో ముత్తారం మండలం ఒడేడ్ గ్రామంలో ఓటు హక్కు ప్రాధాన్యత పైన మరియు పరిసరాల పరిశుభ్రత పైన బేటి బచావో బేటి పడావో పైన . తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం తమ ఆట పాటల ద్వారా అవగాహన కల్పించడం జరిగినది.

# గోపాల్ రావు పేట శ్రీ ప్రగతిలో ఘనంగా ప్రజ్వలన్ 24 వేడుకలు



రామడుగు కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్ రావు పేట లోని శ్రీ ప్రగతి పాఠశాల ప్రజ్వలన్ 24 వార్షికోత్సవ వేడుకలు స్థానిక శుభం గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ హాజరై జ్యోతి ప్రజ్వలను చేసి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం యాదగిరి శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని సూచించారు. మంచి లక్ష్యంతో ముందుకెళ్లి చదువుకోవాలని చదువుతోపాటు సంస్కారం అలవర్చుకోవాలని వారు సూచించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ మాట్లాడుతూ గతంలో పాఠశాల యాజమాన్యంతో ఉన్న కీర్తిశేషులు మండవ నాగేశ్వరరావు లేని లోటు తీర్చలేనిదని అన్నారు. విద్యను డిజిటల్ రూపంలో మార్చేందుకు కృషి చేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ ప్రధానోపాధ్యాయులు ఆలే వెంకటరమణ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్ ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షులు ఎడవల్లి నరేందర్ రెడ్డి పాఠశాల డైరెక్టర్లు ఉప్పుల శ్రీనివాస్ కాసర్ల ఆనంద్ బాబు అట్ల శ్రీనివాస్ రెడ్డి ముచ్చంతల మునీందర్ రెడ్డి బేతి భూమయ్య ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సినిమా



## పెళ్లి వార్తలపై స్పందించిన మీనా..!



టాలీవుడ్ , కోలీవుడ్ ఇండస్ట్రీ లలో కొన్ని సంవత్సరాల పాటు టాప్ హీరోయిన్ గా కెరియర్ ను కొనసాగించిన మీనా గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీ లో సీనియర్ స్టార్ హీరోలుగా కెరియర్ ను కొనసాగిస్తున్న మెగాస్టార్ చిరంజీవి, నందమూరి నట సింహం బాలకృష్ణ, టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున, విక్టరీ వెంకటేష్ లాంటి హీరోలతో ఎన్నో సినిమాలలో నటించి ఎన్నో విజయాలను అందుకొని తెలుగు లో కొన్ని సంవత్సరాల పాటు తిరుగులేని హీరోయిన్ గా కెరియర్ ను కొనసాగించింది. అలాగే తమిళ్ లో కూడా ఈమె స్టార్ హీరోల సరసన నటించి అద్భుతమైన కెరియర్ ను కోలీవుడ్ ఇండస్ట్రీ లో కూడా కొనసాగించింది. ఇకపోతే ప్రస్తుతం ఈమె ఎన్నో సినిమాల్లో నటిస్తూ ఫుల్ బిజీగా కెరియర్ ను ముందుకు సాగిస్తుంది. ఇది ఇలా ఉంటే కొంత కాలం క్రితం మీనావిద్యాసాగర్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకున్న విషయం మనకు తెలిసిందే. వీరి సంసార జీవితం ఎన్నో సంవత్సరాల పాటు ఎంతో సంతోషంగా ముందుకు సాగింది. కానీ అనుకోకుండా కొంత కాలం క్రితమే విద్యాసాగర్ మరణించారు. ఇక విద్యాసాగర్ మరణించిన తర్వాత మీనా రెండో పెళ్లి చేసుకోబోతుంది అని ఇప్పటికే అనేక సార్లు వార్తలు వైరల్ అయ్యాయి. ఇక ఎట్టకేలకు ఈ వార్తలపై మీనా చాలా గట్టిగా స్పందించింది. తన భర్త మృతి విషాదం నుంచి ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాను. అంతలోనే తనను రెండో పెళ్లి వార్తలు మరింత బాధించాయని మీనా ఆవేదన వ్యక్తం చేశారు. రెండో పెళ్లి వార్తలు మాత్రమే కాకుండా నటుడు ధనుష్ తో తనకు సంబంధం అంటగట్టడం మరింత దురదృష్టకరమని ఈమె పేర్కొన్నారు. జీవితంలో అవర్కి ఎప్పుడేం జరుగుతుందో చెప్పలేమని ... తన భర్త చనిపోతారని తాను ఏమాత్రం ఊహించలేదని మీనా చెప్పారు. జీవితం గురించి ప్రస్తుతానికైతే ఏమీ ఊహించుకోవడం లేదని ఈమె పేర్కొంది.

## ఒకే నెలలో కమల్ రెండు సినిమాలు..?



లోక నాయకుడు కమల్ హాసన్ కొంత కాలం క్రితం లోకేష్ కనకరాజు దర్శకత్వంలో రూపొందిన విక్రమ్ అనే సినిమాలో హీరోగా నటించిన అదిరిపోయే రేంజ్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న విషయం మన అందరికీ తెలిసిందే. ఈ మూవీ తర్వాత కమల్ వరుస పెట్టి సినిమాలను ఓకే చేస్తూ వస్తున్నాడు. ఇకపోతే కమల్ విక్రమ్సినిమా కంటే ముందే శంకర్ దర్శకత్వంలో "ఇండియన్ 2" అనే మూవీ ని మొదలు పెట్టాడు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ సినిమా ఆగిపోయింది. ఇక విక్రమ్ సూపర్ హిట్ విజయం సాధించడంతో కమల్ క్రేజ్ ఒక్క సారిగా పెరగడంతో మళ్లీ తిరిగి "ఇండియన్ 2" ను ప్రారంభించారు. అందులో భాగంగా ఇప్పటికే "ఇండియన్ 2" సినిమాకు సంబంధించిన షూటింగ్ మరియు ప్రొడక్షన్ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. కొన్ని రోజుల క్రితమే ఈ మూవీ ని ఈ సంవత్సరం జూన్ నెలలో విడుదల చేయనున్నట్లు ఈ మూవీ యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఇకపోతే కమల్ ప్రస్తుతం ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న "కల్కి 2898 ఏడి" సినిమాలో ప్రతి నాయకుడి పాత్రలో నటిస్తున్నాడు. ఇకపోతే ఈ సినిమాను కూడా ఈ సంవత్సరం జూన్ నెలలోనే విడుదల చేసే ఆలోచన లో ఈ మూవీ బృందం ఉన్నట్లు అందుకు సంబంధించిన అధికారిక ప్రకటనలు మరో కొన్ని రోజుల్లో విడుదల చేయబోతున్నట్లు ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది . ఒక వేళ ఈ వార్త కనుక నిజం అయినట్లు అయితే కమల్ నటించిన రెండు క్రేజీ మూవీ లు ఒకే నెలలో విడుదల అవుతాయి. ఈ వార్త కనుక నిజం అయితే ఇది కమల్ అభిమానులకు అదిరిపోయే న్యూస్ అమే చెప్పవచ్చు.

## 'గిల్లి' రీ రిలీజ్ పై స్పందించిన త్రిష..!



మోస్ట్ బ్యూటిఫుల్ నటీమని త్రిష తెలుగు తో పాటు తమిళ శని పరిశ్రమలో కూడా ఎన్నో సంవత్సరాలు టాప్ హీరోయిన్ లలో ఒకరిగా కెరియర్ ను కొనసాగించిన విషయం మన అందరికీ తెలిసిందే. ఇకపోతే తమిళ సినీ పరిశ్రమలో త్రిష కు అనేక బ్లాక్ బస్టర్ విజయాలు ఉన్నాయి. అందులో గిల్లి మూవీ ఒకటి. ఈ సినిమాలో విజయ్ హీరోగా నటించగా ... ధరణి ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. ఇకపోతే ఈ మూవీ సూపర్ స్టార్ మహేష్ బాబు హీరో గా భూమిక చావ్లాహీరోయిన్ గా గుణశేఖర్ దర్శకత్వంలో రూపొంది తెలుగు లో భారీ బ్లాక్ బస్టర్ విజయం సాధించిన ఒక్కడు మూవీ కి అధికారిక రీమేక్ గా రూపొందింది. ఇలా ఒక్కడు మూవీ కి అధికారిక రూపొందిన గిల్లి సినిమా ఆ సమయంలో తమిళ బాక్స్ ఆఫీస్ దగ్గర అద్భుతమైన విజయం అందుకుంది. ఈ మూవీ తో త్రిష కి కూడా కోలీవుడ్ ఇండస్ట్రీ లో సూపర్ క్రేజీ లభించింది. ఇకపోతే ఆ టైమ్ లో అద్భుతమైన విజయాన్ని అందుకొని భారీ కలెక్షన్ లను వసూలు చేసిన ఈ సినిమాని తాజాగా ఏప్రిల్ 20 వ తేదీన రీ రిలీజ్ చేశారు. ఇకపోతే ఈ మూవీ రీ రిలీజ్ లో భాగంగా అద్భుతమైన కలెక్షన్ లను వసూలు చేస్తూ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ సినిమా తాజాగా రీ రిలీస్ కావడంతో త్రిష తాజాగా తన సోషల్ మీడియా వేదికగా స్పందించండి ... మళ్ళీ అప్పటి రోజులు గుర్తుకు వచ్చాయి. నిజానికి ఫస్ట్ డే ఫస్ట్ షో ఎక్స్ పీరియన్స్ గుర్తుకు వచ్చింది అంటూ త్రిష పెట్టిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇకపోతే ప్రస్తుతం త్రిష , మెగాస్టార్చిరంజీవి హీరోగా మల్లాడి వశిష్ట దర్శకత్వంలో రూపొందుతున్న విశ్వంభర అనే తెలుగు సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఈ మూవీ పై తెలుగు సినీ ప్రేమికులు మంచి అంచనాలు పెట్టుకున్నారు.

## మంచి కంటెంట్ ఉన్న సినిమా



మంచి కంటెంట్ ఉన్న సినిమాఅజయ్ ఘోష్, చాందినీ చౌదరిలు ప్రముఖ పాత్రలు పోషించిన చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. ఈ సినిమాను ఫ్లై హై సినిమాస్ బ్యానర్ మీద హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మించారు. శివ పాలడుగు ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించారు. ఈ చిత్ర టీజర్‌ను శనివారం రిలీజ్ చేశారు. ఈ ఈవెంట్‌లో అజరు భూపతి ముఖ్య అతిథిగా విచ్చేసి చిత్రయూనిట్‌ను అభినందించారు. భాను చందర్ మాట్లాడుతూ,'ఇదొక కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా. ఇందులో నేను హీరోయిన్ ఫాదర్‌గా నటించాను. ప్రస్తుతం పిల్లలకు, తల్లిదండ్రులకు బాగా గ్యాప్ ఉంది. ఈ మూవీలో అది చక్కగా చూపించారు' అని తెలిపారు. 'ఇందులో ఒక జీవితం కనిపిస్తుంది. మన జీవితాల్లో మనం ఏమేం కోల్పోయి ఏ స్థితిలో ఉన్నామో చెబుతుంది. ఇందులో నేను హీరో కాదు. కథే హీరో. మా దర్శకుడు శివ చాలా మంచి కథను రాసుకున్నాడు. ఇది చాలా మంచి చిత్రం అవుతుంది' అని అజరు ఘోష్ అన్నారు. చాందినీ చౌదరి మాట్లాడుతూ, 'ఈ సినిమా మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతుంది. ఇందులో భిన్న మనస్తత్వాలున్న రెండు పాత్రల ప్రయాణం అందరినీ ఆకట్టుకుంటుంది. విజువల్స్, మ్యూజిక్ బాగుంటాయి' అని చెప్పారు. 'బడ్జెట్ పెరిగినా ఓ మంచి సినిమాను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతోనే పూర్తి చేశాం. ఈ సినిమా ప్రేక్షకులందరికీ కనెక్ట్ అవుతుంది' అని నిర్మాత హర్ష గారపాటి తెలిపారు. దర్శకుడు శివ పాలడుగు మాట్లాడుతూ,'నన్ను నమ్మి ఈ కథను ఒప్పుకున్న అజరు ఘోష్‌కి, సినిమాను నిర్మించిన నిర్మాతలకు థ్యాంక్స్' అని అన్నారు.

## నాగ చైతన్య మూవీ నుండి తప్పుకున్న మహానటి!



టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో మహానటి గా గుర్తింపు పొందిన నటి కీర్తి సురేష్. ఒకప్పుడు హోమ్లీ గా సినిమాలు మాత్రమే చేసే కీర్తి ప్రస్తుతం బోల్డ్ సీన్స్ కు కూడా ఒకే చెప్పడం ఆశ్చర్యం వేస్తుందని ఆమె అభిమానులు అంటున్నారు. అలాంటి అందాల ముద్దుగుమ్మ మహానటి గా పాపులారిటి సంపాదించుకున్న కీర్తి సురేష్ ఆ క్రేజీ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుందా..?అంటే అవునన్నా సమాధానమే వినిపిస్తుంది.

టాలీవుడ్ఇండస్ట్రీ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న హీరోయిన్కీర్తి సురేష్ ప్రెసెంట్ టాలీవుడ్ –కోలీవుడ్ –బాలీవుడ్ సినిమా లతో బిజీ గా ముందుకు వెళుతుంది . మరి ముఖ్యంగా తెలుగు లో భోళా శంకర్సినిమా ఫ్లాప్ అయిన తర్వాత అమ్మడి కెరియర్ మొత్తం కొలప్స్ అయిపోతుందని ఎంత అనుకున్నారు .కానీ కీర్తి సురేష్ ఎవరు ఊహించిన విధంగా బాలీవుడ్ సినిమాల కు ఓకే చేసింది. అక్కడ బోల్డ్ పాత్ర లో కనిపించడానికి కూడా సిద్ధంగా ఉంది అంటూ ప్రచారం జరిగింది. తాజాగా టాలీవుడ్ లో ఆమె నాగ చైతన్య సరసన తండేల్ అనే సినిమా లో నటించడానికి ఓకే చెప్పింది అంటూ ప్రచారం జరిగింది. అయితే సడన్గా ఏమైందో ఏమో కానీ ఈ ప్రాజెక్టు నుంచి కీర్తి సురేష్ తప్పుకుంటున్నట్లు ఓ న్యూస్ వైరల్ గా మారింది .ఆమెకున్న బిజీ షెడ్యూల్స్ కారణం గా ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుందా..? లేక హీరోయిన్ సాయి పల్లవి కావడంతో తన క్యారెక్టర్ కి పెద్దగా డిమాండ్ ఉండదు అని ఆలోచించే సినిమా నుంచి బయటకు వచ్చేసిందా..? తెలియాల్సి ఉంది. మొత్తానికి కీర్తి సురేష్ తీసుకున్న ఒక్క నిర్ణయం ఇప్పుడు ఆమె పేరు ఇండస్ట్రీ లో మారు మ్రోగియేలా చేస్తుంది. చూద్దాం మరి ఇది ఎంతవరకు వెళు తుందో..? ఆమెకు ఎలాంటి పేరు తెచ్చిపెడుతుందో..?

## డార్లింగ్‌గా ప్రియదర్శి



డార్లింగ్‌గా ప్రియదర్శి'హను-మాన్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాత నిరంజన్ రెడ్డి, చైతన్య సమర్పణలో తమ తదుపరి సినిమాని అనౌన్స్ చేశారు . ప్రియదర్శి, నభా నటేష్ జంటగా రొమ్-కామ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి అశ్విన్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి 'డార్లింగ్' అనే టైటిల్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. 'వై దిస్ కొలవెరి' అనేది ట్యాగ్‌లైన్. ఈ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ.'నిరంజన్ చాలా ప్యాషన్ ఉన్న నిర్మాత. 'హనుమాన్' విడుదలకు సిద్ధమౌతున్న సమయంలో దర్శితో సినిమాని టేకప్ చేశారు. ఇంత మంచి కథని వదులుకోలేనని చెప్పారు. దర్శకుడు అశ్విన్‌కి చాలా ప్యాషన్, ఎనర్జీ ఉంది. నభా లాంటి మంచి నటి ఈ ప్రాజెక్ట్‌లో ఉండటం అన్నీ సరిగ్గా సమకూరినట్లయింది. 'హనుమాన్' ఎంత పెద్ద సక్సెస్ అయ్యిందో డార్లింగ్ కూడా అంతటి పెద్ద విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. 'నన్ను నమ్మి ఈ కథని నాతో చేసిన దర్శక, నిర్మాతల నమ్మకం హనుమాన్ అంత బలాన్ని ఇచ్చింది. ప్రభాస్‌కి, ఫ్యాన్స్ అందరికీ ధన్యవాదాలు. ప్రభాస్‌ని ప్రేమతో పిలుచుకునే టైటిల్ ఈ సినిమాకి పెట్టడం మాకు చాలా గర్వకారణం. ఈ సినిమాతో ఖచ్చితంగా ప్రేక్షకులని ఎంటర్‌టైన్ చేస్తాం. ఇది డార్లింగ్ ప్రామిస్' అని హీరో ప్రియదర్శి అన్నారు. నిర్మాత నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ,'దర్శకుడు అశ్విన్ నమ్మింది అద్భుతంగా తెరపై తీసుకొచ్చారు. తప్పకుండా ఈ సినిమా ప్రేక్షకులని అలరిస్తుందని నమ్ముతున్నాం' అని తెలిపారు. 'ప్రియదర్శికి ఈ కథ చెప్పగానే తప్పకుండా చేద్దామని మాటిచ్చారు. మా కలలని నమ్మే వ్యక్తి కోసం ఎదురుచూశాం. నిర్మాత నిరంజన్, చైతన్య మా కలల్ని సాకారం చేశారు. కథ చెప్పగానే నమ్మారు. శరవేగంగా సినిమాని చేశాం' అని దర్శకుడు అశ్విన్ రామ్ చెప్పారు.



# క్రీడలు



## ఈ సీజన్లో ప్రత్యర్థులను వణికిస్తున్న సన్రైజర్స్..?



గత రెండు , మూడు సీజన్ లుగా హైదరాబాద్ సన్రైజర్స్ జట్టు (ఐ పీ ఎల్) లో భారీ స్కోరులను నమోదు చేయడంలో చాలా వెనుకబడిపోయింది. కానీ ఈ సీజన్ లో మాత్రం ఊహకందని స్కోర్ లను ప్రత్యర్థుల ముందు ఉంచుతుంది. ఇకపోతే ఇప్పటికే ఈ సీజన్ లో సన్రైజర్స్ జట్టు చాలా భారీ స్కోర్ లను తమ ఆపోజిట్ టీం ల ముందు ఉంచింది. ఒక వేళ హైదరాబాద్ జట్టు గనుక మొదట బ్యాటింగ్ చేసినట్లు అయితే ప్రత్యర్థి టీం లు ఎలాగో ఈ జట్టు భారీ కోరను కొడుతుంది అనే స్థితికి వెళ్లే విధంగా విరు ప్రతి మ్యాచ్ లోను అద్భుతమైన స్కోర్ లను నమోదు చేస్తూ వస్తున్నారు. ఇప్పటికే ఈ సంవత్సరం సీజన్ ప్రారంభం అయ్యాక ఇంత వరకు (ఐ పీ ఎల్) చరిత్రలో ఎవ్వరు కొట్టని స్కోరును సన్రైజర్స్ జట్టు కొట్టింది. ఇప్పట్లో ఈ జట్టు కొట్టిన స్కోర్ ను ఎవరు బీట్ చేయలేరు అనుకున్నారు. అంతలోనే సన్రైజర్స్ జట్టు తమ రికార్డును తామే బ్రేక్ చేసుకున్నారు. ఇక ఆ తర్వాత మళ్లీ ఈ స్కోరు దరిదాపుల్లోకి సన్రైజర్స్ జట్టు ఇప్పట్లో రాదు అని చాలా మంది అనుకున్నారు. ఇకపోతే నిన్న హైదరాబాద్ మరియు ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 20 ఓవర్లు పూర్తి అయ్యేసరికి ఏడు వికెట్ల నష్టానికి 266 పరుగులు చేసింది. ఇక ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 19.1 ఓవర్ లు పూర్తి అయ్యే సరికి 10 వికెట్లు నష్టపోయి 199 పరుగులు చేసింది. దీనితో హైదరాబాద్ జట్టు ఘన విజయాన్ని అందుకుంది.

## పంజాబ్‌పై గుజరాత్ గెలుపు



ఛండీగడ్: పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మరో మ్యాచ్‌లో గుజరాత్ జట్టు సునాయాసంగా గెలిచింది. తొలుత పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 142పరుగులకే ఆలౌట్ కాగా.. ఆ లక్ష్యాన్ని గుజరాత్ జట్టు 19.1ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ సీజన్‌లో తొలిసారి బౌలర్ల హవా కొనసాగింది. ముల్లన్‌పూర్‌లో జరిగిన ఈ మ్యాచ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. కెప్టెన్ శామ్ కరన్(20), ఓపెనర్ ప్రభ్ సిమ్రన్ సింగ్(35), హర్ ప్రీత్ బ్రార్(29) మాత్రమే రాణించగా.. రిలీ రూసో(9), జితేశ్ శర్మ(13), లివింగ్‌స్టోన్(6), శశాంక్ సింగ్(8), అశుతోష్ శర్మ (3) నిరాశపరిచారు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో సాయి కిశోర్‌కు నాలుగు, మోహిత్ శర్మ, నూర్ అహ్మద్‌కు రెండేసి, రషీద్ ఖాన్‌కు ఒక వికెట్ దక్కాయి. ఛేదనలో గుజరాత్ ఓపెనర్ సాహా(13) నిరాశపరిచినా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(35), సాయి సుదర్శన్(31) రాణించారు. ఆ తర్వాత బ్యాటర్లు నిరాశపరిచారు. చివర్లో తెవాటియా(36నాటౌట్) లోయర్ ఆర్డర్ బ్యాటర్ల సాయంతో మ్యాచ్‌ను ముగించాడు. దీంతో గుజరాత్ జట్టు 19.1 ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 146పరుగులు చేసి గెలిచింది. పంజాబ్ బౌలర్లు హర్షల్ పటేల్‌కు మూడు, లివింగ్‌స్టోన్‌కు రెండు వికెట్లు దక్కాయి.

## పారిస్ ఒలింపిక్స్‌కు కోటా సాధించిన వినీష్ ఫోగట్, అన్ను



ఆసియా ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నిలో భాగంగా ఫైనల్ చేరడం ద్వారా వినేశ్ పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు కోటాను ఖాయం చేసింది. 50 కేజీల కేటగిరీలో ఆమె అర్హత సాధించింది. శనివారం జరిగిన బౌట్‌లలో వినేశ్ వరుసగా మిరాన్ చియాన్ (కొరియా), స్మానంగ్ దిట్ (కంబోడియా)లను ఓడించి సెమీ ఫైనల్లోకి అడుగు పెట్టింది. సెమీస్‌లో కజకిస్తాన్‌కు చెందిన లౌరా గనికిచ్‌ను ఓడించడంతో ఫైనల్ చేరడంతో పాటు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖాయమైంది. వినేశ్‌తో పాటు మరో ఇద్దరు భారత రెజ్లర్లు కూడా బెర్త్‌లు సంపాదించారు. 2021 వరల్డ్ చాంపియన్‌షిప్ రజత పతక విజేత అన్షు మలిక్ (57 కేజీలు), అండర్-23 వరల్డ్ చాంపియన్ రితిక (76 కేజీలు) కూడా ఫైనల్ చేరడంతో ద్వారా పారిస్‌కు టికెట్ సాధించారు. దీంతో రెజ్లింగ్ మహిళల విభాగంలో నాలుగు కోటాలు ఖరారయ్యాయి. గత ఏడాదే భారత్‌నుంచి అంతిమ్ పంఘాల్ (57 కేజీలు) ఒక కోటాను సాధించింది. టోక్యో ఒలింపిక్స్‌లో కూడా భారత్‌నుంచి నలుగురు బరిలోకి దిగారు. మరో వైపు పురుషుల విభాగంలో భారత్‌నుంచి ఇంకా ఒక్క ఒలింపిక్స్ కోటా కూడా ఖాయం కాలేదు.

## గెలుపుముంగిట బెంగళూరు బోల్తా



కోల్‌కతా: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సిబి)జట్టు కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో అనూహ్యంగా ఓటమిపాలైంది. 223పరుగుల భారీ ఛేదనలో భాగంగా బెంగళూరు చివరి ఓవర్లో 21పరుగులు చేయాల్సి రాగా.. తొలి నాలుగు బంతుల్లో కరణ్ శర్మ మూడు సిక్సర్లు కొట్టి విజయతీరాలకు తీసుకెళ్లాడు. ఆ తర్వాత రెండు బంతుల్లో మూడు పరుగులు చేస్తే బెంగళూరుదే విజయం అనుకున్న దశలో.. వరుసగా రెండు వికెట్లు కోల్పోయి అనూహ్యంగా ఓటమిపాలైంది. దీంతో బెంగళూరు ఒక్క పరుగు తేడాతో ఓటమిని చవిచూసింది. దీంతో జాక్స్, రజత్ పాటిదార్ చెరో అర్ధ సెంచరీతో చెలరేగినప్పటికీ లాభం లేకుండా పోయింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఆండీ రస్సెల్‌కు లభించింది.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ దిగిన కోల్‌కతా బ్యాటర్లు అదిరే ఆరంభం ఇచ్చారు. ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ చెలరేగి ఆడాడు. వరుసగా ఫోర్లు, సిక్సర్లతో చెలరేగాడు. కేవలం 14బంతుల్లోనే 48 పరుగులు చేశాడు. ఈ క్రమంలో 4.2 ఓవర్ వద్ద సిరాజ్ వేసిన బంతికి భారీ షాట్‌కు యత్నించి ఔటయ్యాడు. మరో ఓపెనర్ సునీల్ నరైన్ 10 పరుగులకే ఔటయ్యాడు. సాల్ట్, నరైన్ తర్వాత క్రీజులోకి వచ్చిన రఘువంశీ(3), వెంకటేశ్ అయ్యర్(16) ప్రభావం చూపించలేకపోయారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, రింకూ సింగ్ దూకుడుగా ఆడారు. 13.1 ఓవర్‌లో రింకూ సింగ్(24) ఔటయ్యాక శ్రేయస్ అర్ధ సెంచరీ చేసి వెంటనే ఔటయ్యాడు. చివరలో ఆంఢ్రీ రస్సెల్(27), రమణ్‌దీప్ సింగ్(24) రాణించడంతో కోల్‌కతా నిర్ణీత 20ఓవర్లు ముగిసేసరికి 6 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. భారీ ఛేధనకు దిగిన బెంగళూరు జట్టు ఆరంభంలోనే తడబాటుకు గురైంది. పవర్ ప్లే పూర్తయ్యేలోపే విరాట్ కోహ్లీ(18), డుప్లెసిస్(7) వికెట్లు కోల్పోయింది. మూడో ఓవర్‌లో మొదటి బంతికే విరాట్ కోహ్లీ ఔటయ్యాడు. హర్షిత్ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. నాలుగో ఓవర్‌లో తొలి బంతికే డుప్లెసిస్ కూడా ఔటయ్యాడు. కోహ్లీ, డుప్లెసిస్ ఔటయిన తర్వాత క్రీజులోకి వచ్చిన జాక్స్(55), రజత్ పటీధర్ (52) అర్ధసెంచరీలతో బెంగళూరును లక్ష్యం దిశగా పయనింపజేశారు. అయితే 12వ ఓవర్ నుంచి బెంగళూరుకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి.

## కోహ్లీ ఆగ్రహానికి కారణమదే: డుప్లెసిస్



ఐపీఎల్ 17వ సీజన్‌లో బెంగళూరు ప్లేఆఫ్స్ అవకాశాలు దాదాపు మూసుకుపోయాయి. కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో ఒక్క పరుగు తేడాతో ఆ జట్టు ఓడిపోయింది. ఆడిన 8 మ్యాచుల్లో కేవలం ఒక్క విజయం మాత్రమే సాధించగలిగింది. కోల్‌కతాతో మ్యాచ్‌లో ఓటమి, విరాట్ కోహ్లీ ఔట్, ప్రస్తుత సీజన్‌లో తమ ప్లేఆఫ్స్ అవకాశాలపై బెంగళూరు కెప్టెన్ డుప్లెసిస్ కీలక వ్యాఖ్యలు చేశాడు. తన ఔట్‌పై విరాట్ (%ఎఱతీష్%) కూడా అసహనం వ్యక్తం చేస్తూ అంపైర్లతో చర్చించిన సంగతి తెలిసిందే. "చివరి వరకూ పోరాడి కేవలం ఒక్క పరుగుతో ఓటమిపాలు కావడం నిరుత్సాహానికి గురి చేసింది. అయితే, మా జట్టు ఆటతీరుపై గర్వంగా ఉన్నా. ఈ సీజన్‌లో పెద్దగా ఆకట్టుకోని బౌలింగ్ విభాగం రాణించింది. భారీ లక్ష్య ఛేదనలో శుభారంభమే దక్కినా.. స్వల్ప వ్యవధిలో వికెట్లను చేజార్చుకున్నాం. విరాట్ కోహ్లీ ఔట్ విషయంలో నిబంధనలు అలా ఉన్నప్పుడు మనమేం చేయలేం. కానీ, బంతి నడుంపైకి వస్తున్నట్లు అనిపించింది. అయితే, థర్డ్ అంపైర్ క్రీజ్‌ను బేస్ చేసుకుని నిర్ణయం తీసుకున్నట్లు ఉంది. ఒక జట్టుకు ఇది కరెక్ట్ అనిపించినా.. అవతలి వారికి సరైంది కాదనే అభిప్రాయం ఉండటం సహజమే. రజత్ పటీదార్ - విల్ జాక్స్ మంచి భాగస్వామ్యంతో మ్యాచ్‌లో మేం ముందుండేలా చూశారు. నరైన్ ఓవర్ మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో బ్యాటర్లకు ఎక్కువ సమయం దొరకడం లేదు. క్రీజ్‌లో కుదురుకుని ఆడటం కాకుండా.. వచ్చీ రావడంతోనే దూకుడుగా ఆడాల్సిన పరిస్థితి. కానీ, సునీల్ నరైన్ వంటి బౌలర్‌ను అడ్డుకోవాలంటే ఎలాంటి పరిస్థితుల్లోనైనా కష్టమే. పవర్ ప్లేలో వేగంగా పరుగులు చేస్తే తర్వాత ఒత్తిడి పెద్దగా ఉండదు. ఈ ఎడిషన్‌లో మా బౌలింగ్ పెద్దగా ప్రభావం చూపలేదు. కానీ, కోల్‌కతాపై గతంతో పోలిస్తే చాలా మెరుగయ్యాం. ఇంకా భారీ స్కోరు దిశగా వెళ్తున్న ఆ జట్టును కట్టడి చేయగలిగాం. బెంగళూరుకు ఉన్న పెద్ద సానుకూలాంశం అభిమానుల మద్దతు. వారిని సంతోష పెట్టడానికి చివరి వరకూ ప్రయత్నిస్తాం" అని డుప్లెసిస్ తెలిపాడు.

## కోహ్లీ గిఫ్ట్ ను విరగొట్టేసిన ఆటగాడు..!



ఇండియన్ క్రికెట్ టీం లో అత్యంత క్రేజ్ కలిగిన ఆటగాలలో విరాట్ కోహ్లీ ఒకరు. ఈయన ఇప్పటి వరకు తన అద్భుతమైన ఆట తీరుతో తన జట్టుకు ఎన్నో విజయాలను అందించాడు. అలాగే ఎన్నో ట్రోఫీలను కూడా అందించాడు. ఇంతటి సామర్థ్యం కలిగిన ఈ ఆటగాడు చాలా సంవత్సరాల పాటు ఇండియన్క్రికెట్ టీం కు కెప్టెన్ గా కూడా వ్యవహరించాడు. ఇకపోతే తన సారథ్యంలో ఇండియన్క్రికెట్ టీం అద్భుతమైన ఎన్నో ఇన్నింగ్స్ లను ఆడి , ఎన్నో విజయాలను సాధించింది. ఇకపోతే ప్రస్తుతం విరాట్ కోహ్లీఇండియన్ ప్రీమియర్ లీగ్ "ఐ పీ ఎల్ 2024" లో ఆడుతూ ఫుల్ బిజీగా ఉన్నాడు. ఈయన ప్రస్తుతం "ఐ పి ఎల్" లో బెంగళూరు రాయల్ చాలెంజర్స్ టీం తరపున ఆడుతున్నాడు. ఈ టీం ప్రస్తుతం చాలా ఘోరమైన ప్రదర్శనను కనబరుస్తున్నప్పటికీ ఈయన మాత్రం తన అద్భుతమైన ఇన్నింగ్స్ తో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాడు. ఇకపోతే కొన్ని రోజుల క్రితమే బెంగళూరు జట్టు కోల్కతా తో తలపడింది. ఇందులో బెంగళూరు ఓడిపోయింది. కోల్కతా గెలిచింది. కోల్కతా గెలిచిన అనంతరం కోహ్లీ తన బ్యాట్ ను రింకూ కి గిఫ్టుగా ఇచ్చారు. అయితే రింకు ఓ స్పిన్నర్ బౌలింగ్ లో ఆడుతున్న సమయంలో ఆ బ్యాట్ విరిగిపోయిందట. తాజాగా ఈ విషయాన్ని కోహ్లీ కి రింకు చెప్పాడు. ఈ ఇద్దరి మధ్య జరిగిన ఈ సరదా సంభాషణను కోల్కతా నైట్ రైడర్స్ జట్టు తన సోషల్ మీడియా హ్యాండ్ లో పోస్ట్ చేసింది.

# ధాన్యం కొనుగోలుపై బండి సంజయ్ ఫైర్

హన్మకొండ ఎల్కతుర్తి మండలంలో గత రెండు రోజుల క్రితం అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని కరీంనగర్ పార్లమెంటు బిజెపి అభ్యర్థి బండి సంజయ్ కుమార్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద పరిశీలించారు. తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా ఏం లేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొనుగోలు కేంద్రంలో కొంత మాత్రమే వరి ధాన్యం తడిస్తే దానిని ఆసరా తీసుకొని దళారులు మొత్తం ఈ సెంటర్లోని ధాన్యం తడిసిపోయిందని క్వింటాలకు 6 నుంచి పది కిలోలు కట్ చేస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారని అన్నారు. అధికారులు తడిసిన ధాన్యం పరిశీలించడానికి ఒకటి,రెండు సార్లు వచ్చి వెళ్లిన వెంటనే దళారులు ఇష్టం వచ్చినట్లు కొనుగోలు చేస్తున్నారని, వారి పై చర్యలకు ఈ ప్రభుత్వం తీసుకోవడం లేదని అన్నారు.

రైతులకు 500 బోనసిస్తా అని చెప్పి ఇప్పుడు ఆ మాట దాటేసారని ఏ రైతు అకౌంట్లో డబ్బులు వేశారు తెలపాలని డిమాండ్ చేశారు. భగవద్గీత,బైబిల్, ఖురాన్ మీద ప్రమాణం చేసి హామీలు అమలు చేస్తమని తెలిపిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలు ఎక్కడ లేదని,అంటే వాటి మీద గౌరవం లేనట్లు, నమ్మకం లేనట్లేనా అని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో గతంలో కంటే నేడు వరి ధాన్యానికి మద్దతు ధర పెరిగిందని రైతులు ఒకసారి ఆలోచన చేయాలని కోరారు.

## దేశాన్ని ప్రపంచంలో నిలబెట్టాడమే ప్రధాని మోడీ లక్ష్యం

## చేవెళ్ల పార్లమెంటు బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

రంగారెడ్డి దేశాన్ని ప్రపంచంలో నిలబెట్టాడమే ప్రధాని మోడీ లక్ష్యం అని చేవెళ్ల పార్లమెంటు బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఆయన కేంద్రమంత్రి పియుష్ గోయల్ కలిసి రాజేంద్రనగర్ లోని రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల్లో మరో మారు కేంద్రంలో బిజెపి సర్కారు ఏర్పడుతుందన్నారు. నాలుగు వందల స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్మన్నారు. మోడీ ఆధ్వర్యంలో దేశ ప్రజలకు సుపరిపాలన అందుతుందన్నారు. ప్రధాని మోదీ పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందన్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ప్రతి రాష్ట్రంలో ఒక సిద్ధాంతమ అన్నారు. బిజెపి ఒకే సిద్ధాంతంతో ముందుకు సాగుతుందని తెలిపారు. వచ్చేఎన్నికల్లో మూడు లక్షల మెజారిటీతో విజయంసాధిస్తాననిపేర్కొన్నారు. ప్రధాని యుగపురుషుడని తెలిపారు. అంతకుముందు విశ్వేశ్వర్ రెడ్డి తన సతీమణి సంగీతారెడ్డి తో కలిసిబండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాళీ మందిర్లోప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో గ్రామాల్లోకనీసంటాయిలెట్స్ కూడా ఉండేవి కావని,మోడీ ప్రధాని అయిన తర్వాత ఆ పరిస్థితిపూర్తిగా మారిపోయింది అన్నారు. అనివృత్తులకు చేయూత అందించేందుకు ముద్ర లోన్స్ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ గ్యారంటీలతో ఒరిగిందేమీ లేదని ధ్వజమెత్తారు. మాఫీచేసేందుకు 35 వేల కోట్లు అవ్వాలని చెబుతున్న సర్కారు నిధుల సమీకరణ చేస్తుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బిజెపి నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

# తిరుమలలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు

తిరుపతి, ఏప్రిల్ 22 తిరుమలలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం ఉదయం శ్రీ మలయప్ప స్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుమాడ వీధుల్లో స్వర్ణరథంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోవింద నామాలు జపిస్తూ రథాన్ని లాగారు. స్వర్ణ రథోత్సవాన్ని దర్శించడంవల్ల- లక్ష్మీదేవి కరుణతో సంపదలు, భోగభాగ్యాలూ, భూదేవి కరుణతో, సమస్త ధాన్యాలూ, శ్రీవారి కరుణా కటాక్షాలతో సర్వ శుభాలూ చేకూరుతాయని భక్తుల విశ్వాసం. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీ ఏవీ ధర్మారెడ్డి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా, వసంత రుతువులో మలయప్ప స్వామికి వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు 3 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. మరోవైపు, ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. సాయంత్రం 6:30 నుంచి ప్రారంభం కానున్న కల్యాణం వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఈ క్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఇప్పటికే టీటీడీ, జిల్లా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు అన్న ప్రసాదం, తాగునీరు, మజ్జిగ అందించనున్నారు. వేసవి దృష్ట్యా గ్యాలరీల్లో ఎయిర్ కూలర్లు, స్వామి వారి కల్యాణం వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికీ ముత్యాల తలంబ్రాలు, తిరుమల నుంచి తెప్పించిన చిన్న లడ్డూలు పంపిణీ చేయనున్నారు. ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో ఈసారి దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల్ వలవన్ హాజరై పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. కాగా, అన్ని ఆలయాల్లో శ్రీరామనవమి రోజున స్వామి వారికి కల్యాణ వేడుక జరుగుతుంది. అయితే, ఒంటిమిట్టలో మాత్రం నవమి తర్వాత చతుర్దశి రోజున కల్యాణం నిర్వహిస్తారు. అటు, తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) ఈసారి రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. 2023 - 24 ఏడాదికి గాను రూ.1,161 కోట్లు, 1,031 కేజీల బంగారం శ్రీవారి హుండీ ద్వారా వచ్చినట్లు అధికారులు తెలిపారు. తాజాగా టీటీడీ ఈ మొత్తాన్ని డిపాజిట్ చేసింది.

గత ఐదేళ్లలో రికార్డు స్థాయిలో టీటీడీ ఆదాయం గణనీయంగా పెరుగుతూ వచ్చిందని వెల్లడించారు. తాజాగా రూ.1,161 కోట్లు, 1,031 కేజీల బంగారాన్ని టీటీడీ డిపాజిట్ చేయడంతో మొత్తంగా రూ.18 వేల కోట్లకు దేవస్థాన డిపాజిట్లు చేరుకున్నాయని అన్నారు. దీంతో, ప్రస్తుతం ఏటా లభించే వడ్డీ రూ.1,200 కోట్లు దాటింది. కాగా, 2018 నాటికి ఏటా లభించే వడ్డీ రూ.750 కోట్లుగా ఉంది. ఈ క్రమంలో ఐదేళ్ల కాలంలో వడ్డీ దాదాపుగా రూ.500 కోట్లు ఎక్కువకు చేరుకుంది. మరోవైపు, తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. స్వామి వారి దర్శనానికి కంపార్ట్ మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు.

# టెన్త్ క్లాస్ లో 89 శాతం ఉత్తీర్ణత

విజయవాడ, ఏప్రిల్ 22 ఆంధ్రప్రదేశ్ పదోతరగతి ఫలితాలు విడుదలయ్యాయి. ఏపీ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ ఉదయం 11 గంటలకు ఫలితాలను విడుదల చేశారు. ఎస్ఎస్సీ బోర్డు అధికారిక వెబ్సైట్లో ఫలితాలను అందుబాటులో ఉంచారు. దీంతోపాటు ఏబీపీ దేశం వెబ్సైట్లోనూ ఫలితాలు చూసుకోవచ్చు. ఈ ఏడాది పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో మొత్తం 5,34,574 (86.69 %) విద్యార్థులు అర్హత సాధించారు. ఏపీ టెన్త్ రిజల్ట్స్ కోసం క్లిక్ చేయండి

ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. పాసైనవారిలో 89.17 శాతం బాలికలు, 84.32 శాతం బాలురు ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా 96.37 శాతంతో మొదటి స్థానంలో నిలవగా.. 62.47 శాతంతో చివరిస్థానంలో నిలిచింది. ఫలితాల్లో 69.26 శాతం ఫస్ట్ క్లాస్లో పాసయ్యారు. 11.87 శాతం సెకండ్ క్లాస్ లో పాసయ్యారు. 5.66 శాతం మూడో క్లాస్ లో ఉత్తీర్ణత సాధించారు. ఇక హిందీ మీడియంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 12 మంది ఎగ్జామ్ రాయగా, అందరూ పాసయ్యారు. ఈ ఏడాది ఏపీలో మార్చి 18 నుంచి 30 వరకు పదోతరగతి పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. పరీక్షలకు దాదాపు 7 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 6.16 లక్షలు, గతేడాది ఫెయిలై రీ ఎన్రోల్ అయిన విద్యార్థులు లక్షకుపైగా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3743 పరీక్షా కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు నిర్వహించారు.

? రెసిడెన్షియల్ 98.43 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
? ఏపీ బీసీ వెల్ఫేర్ స్కూళ్లలో 98. 40 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
? ఏపీ మోడల్ స్కూళ్లలో 92.88 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
? సోషల్ వెల్ఫేర్ 98.45 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
? ఆశ్రమ స్కూళ్లు 90.10 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
? ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్లు 89.46 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

# మహిళపై హత్యాచారం

హైదరాబాద్, ఏప్రిల్ 22 కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. చిత్తు కాగితాలు ఏరుకునే ఓ మహిళపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారు. దీంతో తీవ్ర రక్తస్రావంతో ఆమె ఘటనా స్థలంలోనే మృతి చెందింది. కూకట్పల్లి పరిధిలో ఆదివారం తెల్లవారుజామున 4:30 గంటలకు ఈ అమానుష ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ కూకట్పల్లి వై జంక్షన్ సమీపంలో (బాలానగర్ నుంచి కూకట్ పల్లి రోడ్డు) ఓ లాడ్జి పక్కనున్న భవనంలో వ్యాపార సముదాయాలున్నాయి. అక్కడి పైప్ వర్క్ షాప్ సెల్లార్ లో ఓ మహిళ మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి ఒంటిపై దుస్తులు అస్తవ్యస్తంగా ఉండడంతో పాటు తీవ్రంగా రక్తస్రావమైనట్లు ఆనవాళ్లున్నాయి. మృతదేహం పక్కన ఓ చిత్తు కాగితాలు ఏరుకునే సంచి లభ్యం కావడంతో ఆమె చిత్తు ఏరుకుని జీవిస్తుందని తెలుస్తోంది. అందులో దొరికిన ఓ చీటీపై రాసి ఉన్నది ఆమె పేరే కావొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలిపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సీసీ ఫుటేజీ పరిశీలించగా పాతికేళ్ల వయసున్న ఇద్దరు యువకులు ఘటన జరిగిన భవనం పక్కన ఉన్న గల్లీలో కొన్ని నిమిషాలు ఆమెతో మాట్లాడడం గుర్తించారు. అనంతరం ఆమెను బలవంతంగా సెల్లార్ లోని షట్టర్ వద్దకు లాక్కెళ్లారు. కొద్దిసేపటి తర్వాత ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై కూకట్పల్లి వైపు పారిపోయినట్లు సీసీ ఫుటేజీలో కనిపించింది. దీని ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నా?రు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు

## అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా...

## కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ హామీ

మంచిర్యాల పార్లమెంటు ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ హామీ ఇచ్చాడు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని దండపెల్లి లక్షట్ పేటలోఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో ఎన్నికల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటు నుండి ఎంపీగా తనని గెలిపిస్తేపెద్దపల్లి పార్లమెంటు నుండి ఎంపీగా తనను గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ముఖ్యంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ వంశీకృష్ణకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ వంశీకృష్ణ ప్రజాసేవ చేయడం కోసం రాజకీయాల్లోకి వచ్చాడని అన్నారు. అనంతరం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ గోడౌన్ లో అగ్ని ప్రమాదం

బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోన్ని కొత్తపేట గ్రామంలో షార్ట్ సర్క్యూట్ తో ప్లాస్టిక్ గోడౌన్ లో మంటలు చెలరేగడంతో అప్రాంతం అంత దట్ట మైన పొగ అలుముకోవడం తో భయందొళనలకు గురైన జనాలు.. వెంటనే స్థానిక అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో 2ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుక రావడం జరిగింది. ఎలాంటి ప్రాణానష్టం జరగకపో వడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## అవినీతి నిరూపిస్తే పోటీనుంచి తప్పుకుంటా

కోనసీమ తన హయాంలో జరిగిన అవినీతిని నిరూపిస్తే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటానని అమలాపురం వైసిపి అభ్యర్థి మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఇటీవల చంద్రబాబు టిడిపి అభ్యర్థి ఆనందరావు చేసిన అవినీతి ఆరోపణలు పై విచారణ సిద్ధమని ఆయన అన్నారు. అమలాపురం వైసిపి అభ్యర్థిగా ఈరోజు విశ్వరూప్ నామినేషన్ దాఖలు చేశారు. ప్రస్తుత టిడిపి అభ్యర్థి ఆనందరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోను తాను ఎమ్మెల్యేగా మంత్రిగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చ కి సిద్ధమంటున్నారు.

## అచ్చెన్నాయుడు నామినేషన్

శ్రీకాకుళం టెక్కలి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా సోమవారం టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి నామినేషన్ కార్య క్రమంలో పాల్గొన్నారు. కోటబొమ్మాళి కొత్త మ్మ తల్లి ఆలయం వద్ద ఉదయం 7 గంటలకు పూజలు చేసిన అనంతరం టెక్కలి-తెంబూరు రోడ్డు జంక్షన్కు చేరుకొని అక్కడి నుంచి ఊరే గింపుగా టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్నాయుడు, బీజేపీ, జనసేనముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నామినేషన్ దాఖలు చేసిన సంహాద్ర చంద్రశేఖర్

మచిలీపట్నం వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్ర శేఖర్ మచిలీపట్నం కలెక్టరేట్ లో నామినేషన్ దాఖలు చేశారు. అవనిగడ్డ నుండి మచిలీపట్నం వరకు బారి రాలీ నిర్వహించగా, రాలిలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సింహాద్రి చంద్ర శేఖర్ తో పాటు అవనిగడ్డ ఎంఎల్ఎ సింహాద్రి రమేష్ బాబు. మచిలీపట్నం అభ్యర్థి పేర్ని కిట్టు, యువ నాయకులు సింహాద్రి వికాస్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సింహాద్రి చంద్ర శేఖర్ మాట్లాడుతూ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశాను. అబద్ధాలు చెప్పం, చేయలేని పనులు చెప్పను. చేయగలిగిన పనులే చెబుతా, ఈ ప్రభుత్వం లో ప్రతి పేదవాడు ఆనందముగా ఉన్నాడు. విద్య, వైద్యం, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఈ ప్రభుత్వము ఇచ్చిందని అన్నారు..

# అందరికి అందుతున్న సంక్షేమ పథకాలు సజ్జల

పెనమలూరు ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు అందరికి అందుతున్నాయి. అజెండా లేకుండా, అధికారం కోసం చంద్రబాబు నాయుడు పోరాటం. 14 నుండి 19 వరకు ఉన్న చీకటి పాలన కావాలా, దేశానికే పేరుగాంచిన జగన్మోహన్ రెడ్డి కావాలా. పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు జోగి రమేష్ కు గతంలో వచ్చిన మెజారిటీ కంటే ఎక్కువ వస్తుంది. చంద్రబాబు నాయుడు వైసిపి పార్టీ కి అంకితం అయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ తెర పైన జగన్మోహన్ రెడ్డి ఒక వైపు, మిగతా పార్టీలు మరొక వైపని అన్నారు.

# అమెరికాలో తీవ్ర విషాదం



హైదరాబాద్, ఏప్రిల్ 22 అమెరికాలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి చెందడం తీవ్ర విషాదం నింపింది. కరీంనగర్ (, జనగామ జిల్లాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లు అక్కడి పోలీసులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణానికి చెందిన డాక్టర్ స్వాతి, డాక్టర్ నవీన్ దంపతుల కుమారుడు నివేశ్ (20), జనగామ జిల్లా స్టేషన్ ఘన్పూర్ మండలంలోని శివునిపల్లికి చెందిన స్వర్ణకారుడు పార్శి కమల్ కుమార్, పద్మ దంపతుల పెద్ద కుమారుడు గౌతమ్ కుమార్ (19) అమెరికాలోని అరిజోనా స్టేట్ విశ్వ విద్యాలయంలో బీటెక్ రెండో ఏడాది చదువుతున్నారు. శనివారం రాత్రి వీరు తమ స్నేహితులతో కలిసి వర్శిటీ నుంచి కారులో ఇంటికి వస్తుండగా.. వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ గుర్తు తెలియని వాహనం వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం వెనుక సీట్లో కూర్చున్న నివేశ్, గౌతమ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఆదివారం మధ్యాహ్నం మృతుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గౌతమ్ కుమార్ మృతదేహం స్వగ్రామం చేరుకోవడానికి రెండు, మూడు రోజుల సమయం పడుతుందని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. నివేశ్ మృతదేహాన్ని హుజూరాబాద్ తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉన్నత చదువుల కోసం స్కాట్లాండ్ వెళ్లిన ఇద్దరు తెలుగు విద్యార్థులు సైతం ఇటీవలే ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలుగు రాష్ట్రాలకు చెందిన జితేంద్రనాథ్ కరుటూరి (26), చాణక్య బొలిశెట్టి (22) స్కాట్లాండ్ లోని డూండీ యూనివర్శిటీలో మాస్టర్స్ చదువుతున్నారు. ఈ నెల 17న బుధవారం సాయంత్రం ఇద్దరు స్నేహితులతో కలిసి పెర్త్ షైర్ లోని 'లిన్ ఆఫ్ తమ్మెల్'కు వెళ్లారు. రెండు నదులు కలిసే ఈ ప్రాంతంలో వీరు ట్రెక్కింగ్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు నీటిలో జారి పడి కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న అక్కడి పోలీసులు, సహాయక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని గాలింపు చేపట్టారు. అనంతరం కొద్ది దూరంలో వీరి మృతదేహాలను గుర్తించారు. వీరి మృతి విషయంలో ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు లేవని పోలీసులు తెలిపారు. మృతుల్లో ఒకరు హైదరాబాద్ కు చెందిన వారు ఉండగా.. మరో విద్యార్థి ఏపీకి చెందిన వారు. అటు, ఈ ప్రమాదంపై లండన్ లోని భారత హైకమిషన్ అధికారి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మరోవైపు, ఈ దుర్ఘటనపై స్పందించిన యూనివర్శిటీ ఆఫ్ డూండీ ప్రతినిధిగ్ర్భ్భాంతి వ్యక్తం చేశారు. 'ఇది మనందరికీగ్ర్భ్భాంతిని గురి చేసిన ఓ విషాద ప్రమాదం. అత్యంత క్లిష్ట సమయంలో మృతుల కుటుంబాలకు మేము అండగా ఉంటాం.' అని పేర్కొన్నారు. కాగా, జితేంద్రనాథ్ గతంలో అమెరికాలోని కనెక్టికట్ వర్శిటీలో చదివినట్లు తెలుస్తోంది. చాణక్య 2022లోనే హైదరాబాద్ జేఎన్టీయూలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినట్లు సమాచారం.

## ఆదోనిలో వై సాయి ప్రసాద్ రెడ్డి నామినేషన్ దాఖలు

ఆదోని నియోజకవర్గం వైయస్సార్సీపి శాసనసభ అభ్యర్థిగా వై సాయి ప్రసాద్ రెడ్డి తమ నామినేషన్ పత్రాలను సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం లో ఆదోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ కు సమర్పించారు . అంతకు ముందు వైఎస్సార్సీపీ పార్టీ ఆధ్వర్యంలో వైయస్సార్సీపి కార్యాలయము నుండి నాయకులు కార్యకర్తలు అభిమానులు వైఎస్ఆర్సిపి శాసనసభ అభ్యర్థి తమ నామినేషన్ సమర్పణ సందర్భంగా వారి వెంట పెద్ద ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్సీపీ శాసనసభ అభ్యర్థి సాయిప్రసాద్ రెడ్డి తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి కి సమర్పించారు. ఈ సందర్భంగా వైయస్ఆర్సీపీ శాసనసభ అభ్యర్థి వై సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గెలుపు ఓటములు దైవదీనాలన్నారు. తను ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలుగా ఆదోని నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదాల తో గెలుపొందానన్నారు. ఆదోని అభివృద్ధి కి తను అహర్నిశలు కృషి చేశానన్నారు. ప్రజలు మరోసారి ఆదరించి త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లోతన విజయానికి ఆదోని నియోజకవర్గ ప్రజలు ఆదరించి తనకు అండగా నిలవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేర్చారన్నారు. ఈ ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో తనను ప్రజలు గెలిపించాలని వారు కోరారు.

# తూప్రాన్ లో హనుమాన్ జయంతి హనుమాన్ మాలాదరణ స్వాముల మధ్య విశేష పూజలతో ఉత్సవాలు .

ఇక్కడ పిలిస్తే పలికే కలియుగ దైవం.
సామూహిక సత్యనారాయణ వ్రతాలు
ఆలయ ప్రధాన అర్చకులు
సలాక ఆత్రేయ శర్మ.



తూప్రాన్, ఏప్రిల్, 22 ప్రజాబలం న్యూస్ :- ప్రకృతి రమ నీయమైన చెరువు నీళ్ల పక్కన పచ్చ తూప్రాన్ వీరాంజనేయ స్వామి ఆలయ మందిరం జయంతి ఉత్సవాలు హనుమాన్ మాలదరణ మండల దీక్ష స్వాముల మధ్య





తూప్రాన్ వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయ. రామనామ స్మరణతో జపము ప్రదక్షణ ఆలయ మందిరం రామనామ ఆంజనేయ స్మరణతో ప్రశాంత వాతావరణంలో రామనామ స్మరణతో మనసంతా రంజింప చేస్తుంది. ఆలయ అర్చకులు హనుమాన్ గురుస్వామి సలాక ఆత్రేయ శర్మ మాట్లాడుతూ దశాబ్దాల జీవన సమరంలో అలసి సొలసిన వారికి అలంబన ఇచ్చే ఆధ్యాత్మిక క్షేత్రం అని ఇప్పటికీ కులమత బేధములు లేకుండా స్వామివ జయంతి ఉత్సవాలు ఆశేష భక్తుల మధ్య ఇక్కడ ఘనంగా జరుపుతున్నామని తెలిపారు. జయంతి ఉత్సవం సందర్భంగా 21. 4. 2024 ఆదివారం క్రోధి నామ సంవత్సర చైత్ర శుద్ధ త్రయోదశి ఉదయం గణపతి పూజ పుణ్యం పుణ్యాహవాచనం అఖండ దీపారాధన అంకురార్పణము సుందరకాండ గురు చరిత్ర పారాయణంలో ప్రారంభము మన్యుసూక్త పాశు పతము, సీతారామ లక్ష్మణ విగ్రహాలకు అభిషేకం , తీర్థ ప్రసాద వితరణ,22- 4- 2024 సోమవారం నాడు సంవత్సర చైత్ర శుద్ధి చతుర్దశి రోజున గణపతి నవగ్రహ రుద్ర పంచసూక్త మన్యుసూక్త లక్ష్మీ హోమంలూ,





బిక్ష, ఇరుముడి మంగళహారతి మంత్రపుష్పం తీర్థ ప్రసాద వితరణ అన్న ప్రసాదం,

23- 04- 2024 మంగళవారం క్రోధి నామ సంవత్సర చైత్ర శుద్ధి పౌర్ణమి హనుమాన్ జయంతి హనుమత్ మన్యు పాషూ పదం, సింధూరం, లక్ష పత్ర పూజ, లక్ష పుష్పార్చన , అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చన, శ్రీశ్రీశ్రీ యతివార మాధవానంద స్వామి వారి పాద పూజ, అనుగ్రహభాషన , ఉదయం 9 గంటల నుండి ఉదయం 11 గంటల వరకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతములు తీర్థప్రసాధన వితరణ అన్నదానం మాల విరమణ ఉంటుందని మీడియాతో మాట్లాడుతూ గురుస్వాములు ఆత్రేయ శర్మ, శేఖర్, గడ్డం ప్రశాంత్ కుమార్, మల్లికార్జున్ గౌడులు తెలిపారు. దంపతులందరూ కలియుగ దైవం సత్యనారాయణ స్వామి వ్రతం చేపించుకోగలరని సత్యనారాయణ స్వామి వ్రతం చేపించుకున్న వారికి సకల దోషములు తొలగిపోవునని సాధ్యమైనంతవరకు సత్యనారాయణ స్వామి వ్రతం చెప్పించుకోగలరని కోరారు.

## పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా దండేపల్లి, లక్షెట్టిపేట,మండలం,మున్సిపల్ లో ఎన్నికల ప్రచార సభలు

### మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు





ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 : మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి,లక్షెట్టిపేట మండలం,లక్షెట్టిపేట పట్టణంలో పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభలు నిర్వహించిన మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఈ కార్యక్రమంలో చెన్నూర్ శాసన సభ్యులు గడ్డం వివేక్ వెంకట స్వామ,పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ పాల్గొన్నారు.కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ... పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ ను భారీ మెజారిటీతో గెలుపించాలని ప్రజలను కోరారు. అంతేకాకుండా రాముడి పేరుతో దేశాన్ని ముక్కలు చేసే కుట్రలను బిజెపి పార్టీ చేస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని,అందులోని రిజర్వేషన్లను తొలగించేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.బిజెపి పార్టీ ధనవంతుల పార్టీగా ఆయన అభివర్ణించారు.దళిత వర్గాలను అభివృద్ధి వైపు నడిపించిన పార్టీగా కాంగ్రెస్ పార్టీకి చరిత్ర ఉందని తెలిపారు.క్షేమం కోసం ఎన్నో చట్టాలను తీసుకువచ్చి సమాజ స్థాపనకు నాంది పలికామని అన్నారు.బిజెపి ప్రభుత్వం జాతి,మతాల మధ్య చిచ్చుపెట్టే కుట్రలు చేస్తుందని ఎద్దేవా చేశారు.మరోసారి బిజెపి పార్టీకి ఓటు వేస్తే దేశ సార్వభౌమాధికారానికి ఆటంకం కలిగే ప్రమాదం ఉందని అన్నారు. బిజెపి,బిఆర్ఎస్ పార్టీలు రెండు ఒకటేననడానికి నిదర్శనం పార్లమెంటులో బిజెపి పార్టీ ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకు బిఆర్ఎస్ పార్టీ సభ్యులు మద్దతు ఇచ్చారా లేదా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్,బిజెపి పార్టీలు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రజల ముందు వివరిస్తుందని తెలిపారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఆయన అన్నారు.దళితులు, గిరిజనులు,మైనార్టీలు,పేద వర్గల ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో దండేపల్లి , లక్షెట్టిపేట మండలం,మున్సిపల్ నాయకులు,స్థానిక ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజలు పాల్గొంటున్నారు.

## నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ





ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..అదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆత్రం సుగుణ, జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కతో కలిసి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడుమ బొజ్జు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావులు నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఐదు గ్యారెంటీలు అమలు చేశామని త్వరలోనే రెండు లక్షల రుణమాఫీ అమలు చేస్తామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. దేశంలో మోడీ ప్రభుత్వం పేద ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. వచ్చేది ఇండియా కూటమి ప్రభుత్వమని అన్నారు

## అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్





ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 : లోక్ సభ ఎన్నికల్లో భాగంగా మే 13 వ జరుగనున్న పోలింగ్ రోజున జిల్లాలో అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు.సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సబావత్ మోతిలాల్,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్,సహాయ కార్మిక శాఖ కమిషనర్ విని వినీతలతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాజ్యాంగం భారత పౌరులకు కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధం మని,ఇలాంటి ఏడా లేకుండా ప్రతి ప్రతి ఒక్కరికి సమాన హక్కు కల్పించడం జరిగిందని తెలిపారు.దేశ అభివృద్ధికి పాటుపడే సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఓటు హక్కు కల్పించడం జరిగిందని తెలిపారు.దేశభక్తి కి పాటు పాడే సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోని అవకాశం ఓటు హక్కు ద్వారా మాత్రమే ఉంటుందని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజవర్గ పరిధిలో జిల్లాలోని మంచిర్యాల,చెన్నూరు, బెల్లంపల్లి,అసెంబ్లీ సెగ్మెంట్లలలో మే 13 న జరగనున్న పోలింగ్ రోజున హర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకుని,ఇందు కొరకు పోలింగ్ కేంద్రాల, త్రాగునీరు,నీడ,ఫ్యాన్లు, నిరంతరం విద్యుత్ సరఫరా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు.85 సంవత్సరాల వయసు పైబడిన వయే వృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు.ఈ నేపథ్యంలో 18 సంవత్సరాల వయసు నుండి ఓటర్ జాబితాలో వివరాలు నమోదు చేసుకున్న అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినిపించుకునే విధంగా ప్రసార,ప్రచార కార్యక్రమాలు, కళాజాత ఓటరు సెల్ఫీలు ఏర్పాటు చేయడం జరిగిందని,ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు ప్రతి ఒక్కరు సెల్ఫీ దిగి వాట్సాప్ సోషల్ మీడియా వేదికగా అర్హత గల వారందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె చిన్నయ్య,స్వీప్ సమన్వయకర్త రామచందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ బిజెపి మధ్యనే పోటీ..

### ఆరోపణలు రుజువు చేస్తే దేనికైనా సిద్ధం...

### చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి

చేవెళ్ల గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ప్రజల సంక్షేమం కోసం పెద్దపీట వేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని మాకు పోటీ బిజెపి పార్టీ అని సంక్షేమం కోరే కాంగ్రెస్, సంక్షేమం కోరని బిజెపి పార్టీ మధ్య పోటీ ఉంటుందని ఎంపీ రంజిత్ రెడ్డి అన్నారు.సోమవారం వికారాబాద్ జిల్లా లోని పెద్దేముల్ మండలం గొట్లపల్లి, ఇందూర్, తట్టేపల్లి గ్రామాల్లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తో కలిసి చేవెళ్ల అభ్యర్థి రంజిత్ రెడ్డి పాల్గొని, ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి ముఖ్యమంత్రిని రేవంత్ రెడ్డిని చేశారని అన్నారు. ఎన్నికలు లో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందని అన్నారు. ఇప్పటివరకు నాలుగు గ్యారెంటీ హామీలు చేశామని అన్నారు. పేదల సంక్షేమం కోసం పనిచేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని దానిని ప్రజలందరూ ఆదరిస్తున్నారని అన్నారు. మాకు పోటీ బిజెపి పార్టీ అని సంక్షేమం కోరే పార్టీ కాంగ్రెస్ అని సంక్షేమం కోరని పార్టీ బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని అన్నారు. మెజార్టీ ప్రజల నిర్ణయిస్తారని గెలుపు మాత్రం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## జీవన్ రెడ్డి ఎంపీగా గెలవాలని దుబ్బరాజన్న ఆలయంలో నాయకుల అర్చనలు

జగిత్యాల, నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న , ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి విజయం సాధించాలని జగిత్యాల జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, నాయిబ్రాహ్మణ సేవా సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షులు పెండెం మహేందర్ లు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం పెంబట్లలో ప్రసిద్ధి గాంచిన దుబ్బరాజేశ్వరస్వామి దేవాలయంలో జీవన్ రెడ్డి గోత్రణామాధులతో అర్చనలు చేసి నాయకులు శివుడికి పాలాభిషేకం చేశారు. నిజామాబాద్ ఎంపీగా గెలుపొందేందుకు దుబ్బరాజేశ్వర స్వామి ఆశీస్సులుండాలని వేడుకున్నారు. అర్చకులు ఆశీర్వచనం అందించారు.

కార్యక్రమంలో వంగల అమర్, బొద్దు వనిత,గోపతి స్వప్న, మహేష్, కేశవ్, గంగారాం,రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి కౌశల్య కేంద్ర్ స్కీం(PMK) కేంద్ర ప్రభుత్వ పథకం నకు సంబందించి ఫేక్ ఫింగర్ ప్రింట్స్ ద్వారా అవకతవకలకు పాల్పడిన అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వాహకులు అరెస్ట్




ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 : రామగుండం పోలీస్ కమిషనర్ ఐపీఎస్(ఐజీ)ఎం శ్రీనివాస్ రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేసి నిందితుల అరెస్టు వివరాలు వెల్లడించడం జరిగింది.

నిందితుల వివరాలు

1) మల్లికార్జున్, ని: హైదరాబాద్
2) సలీం జాఫర్, ని: నర్సంపేట
3) వెంకటేష్, ని: నర్సంపేట
4) దేవేందర్, ని: మంచిర్యాల

రికవరీ చేయబడిన వస్తువులు

1) ఫేక్ ఫింగర్ ప్రింట్స్
2) ఫేక్ ఫింగర్ ప్రింట్ తయారీకి సంబందించిన మెటీరియల్
3) అభ్యర్థుల అటెండన్స్ రిజిస్టర్ మరియు డాక్యుమెంట్
4) ల్యాప్ టాప్,బయోమెట్రిక్ మిషన్.

వివరాల్లోకి వెళితే....

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి కౌశల్య కేంద్రం(%ూవీఖఖ%)అనే పథకం ద్వారా దేశంలోని నిరుద్యోగ యువత ఉపాధి కొరకు స్కిల్ డెవలప్మెంట్ కోసం ఉచితంగా పలు కోర్స్ లను అందిస్తుంది.

ఇట్టి స్కీం ను ప్రభుత్వం భోపాల్ కేంద్రంగా నిర్వహించబడుతున్న అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ద్వారా దేశంలోని నిరుద్యోగ యువకులలో స్కిల్స్ డెవలప్మెంట్ ను పెంపోందించడం కొరకు ఇట్టి సంస్థ కు భాద్యతలు అప్పగించినది. ఈ యొక్క సంస్థకు సంబందించి మన తెలంగాణ రాష్ట్రం లో హైదరాబాద్ నందు ఆఫీస్ ఏర్పాటు చేయడం జరిగింది. భోపాల్ లో హెడ్ ఆఫీస్ ఆర్గనైజర్ గా సాహిల్ వలి మరియు తెలంగాణ హెడ్ ఆఫీస్ అయిన హైదరాబాద్ లోని మథురానగర్ నగర్ నందు వున్న ఆఫీస్ ఇంచార్జ్ గా ఆవునురి శ్రీనివాస్ భాద్యతలు నిర్వహిస్తున్నారు.హైదరాబాద్ ఆఫీస్ పరిధిలో మన రాష్ట్రంలో మంచిర్యాల తోపాటు హుజుర్ నగర్ మరియు జనగామ లో ఈ యొక్క సంస్థ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లు వున్నాయి.

## మహా నేత పట్లోళ్ల ఇంద్రారెడ్డి 24వ వర్ధంతి



రాజేంద్ర నగర్ ప్రజా బలం ప్రతినిధి 22 ఎప్రిల్ 2024: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి గళం విప్పిన నాయకుడు మహా నేత పట్లోళ్ల ఇంద్రారెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా ఆయనకు డైరీ ఫారం చౌరస్తాలో నివాళ్ళు అర్పించిన రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, వ్యవస్థాపక అధ్యక్షుడు పోయిల జీవన్ దాస్, మాజీ అధ్యక్షుడు పచ్చ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వీర్లపల్లి నవీన్, వినాయక ప్రేతమ్ రాజ్, ఎడ్లకాడి చంద్ర శేఖర్, అనిల్ కుమార్, అరుంధతి సంఘం మాజీ అధ్యక్షుడు కోరని బాలరాజు, కోరని శ్యామ్, జాన్ పాల్, పలుగుచేరువు మహేందర్, జె.సి.ప్రకాష్, సదానందం, డి.రాజేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా వెలిచాలా రాజేందర్ రావు నామినేషన్.




కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 22 కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్ రావు నామినేషన్ సోమవారం రోజున కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు సిరిసిల్ల డిసిసి అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, కరీంనగర్ డిసిసి అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్,సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు కోడూరి సత్యనారాయణ , ఆరేపల్లి మోహన్,కరీంనగర్ కాంగ్రెస్ ఇంచార్జ్ పురిమల్ల శ్రీనివాస్ ఇతర ముఖ్య నేతలుకాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.

## మావోయిస్టు పోస్టర్లు విడుదల సమాచారం ఇచ్చినవారికి నగదు బహుమతి

### రామగుండం పోలీస్ కమిషనర్ ఐపిఎస్ ఎం శ్రీనివాస్,డిసిపి అశోక్ కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 : పోలీస్ అధికారులతో కలిసి వాల్ పోస్టర్ అవిష్కరించిన రామగుండం పోలీస్ కమిషనర్ ఐ పి ఎస్ ఎం శ్రీనివాస్. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రామగుండం పోలీస్ కమిషనర్ ఐ.పి.ఎస్,ఐజీ సిఎం శ్రీనివాస్ మంచిర్యాల డి సి పి అశోక్ కుమార్,ఐ పి స్,స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు,ఇతర అధికారులతో కలిసి ప్రజలు మావోయిస్టులకు సహకరించొద్దంటూ మావోయిస్టుల వివరాలతో పోస్టర్లు కరపత్రాలను విడుదల చేశారు.పోస్టర్లో ఉన్నవారి గురించి తెలిస్తే..తెలంగాణ పోలీసు కు సమాచారం ఇవ్వాలని సూచించారు. లేకపోతే..ఫోన్ నెంబర్లు : సి.పి.రామగుండం-08728 271333,డి.సి.పి.పెద్దపల్లి-8712656502,డి.సి.పి. మంచిర్యాల-8712656503, ఎస్ ఒ బి 8712656596, నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మావోయిస్టుల గురించి సమాచారం తెలియజేసిన వారికి పోస్టర్లలో ఉన్న విధంగా నగదు బహుమతి అందిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని భరోసా ఇచ్చారు. అదేవిదంగా అజ్ఞాతంలో ఉన్నటువంటి మావోయిస్టు సోదరులు పోరాటం చేయాల్సింది అడవిలో కాదు అందరి మధ్య ప్రజా జీవనంలోకి వచ్చి ప్రజా సమస్యల పై చట్ట బద్దంగా పోరాడాలని ప్రజలచే ఎన్నుకోబడి చట్టసభల్లోకి ఎన్నికై పోలీసుల గౌరవ వందనం పొందాలి సీపీ అన్నారు.

## చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి శ్రీ కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ కార్యక్రమం ని జయప్రదం చేయండి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



ప్రజాబలం శేరిలింగంపల్లి రాజేంద్ర నగర్ తహసీల్దార్ కార్యాలయం, 23.4.24 మంగళవారం రోజున ఉదయం 10.00గంటలకు

శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్పొరేటర్లకు ,బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులకు,అధ్యక్షులకు, బీఆర్ఎస్ పార్టీ నాయకులకు ,కార్యకర్తలకు,వార్డ్ మెంబర్లకు,ఏరియా కమిటీ ప్రతినిధులకు,ఉద్యమకారులకు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులకు ,బీఆర్ఎస్ పార్టీ శ్రేయభిలాషులకు,బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు తెలియచేయునది ఏమనగా%ొ

మన ప్రియతమ నాయకుడు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి శ్రీ కాసాని జ్ఞానేశ్వర్ రాజేంద్ర నగర్ లోని తహసీల్దార్ కార్యాలయంలో రేపు అనగా 23.4.24 మంగళవారం రోజున ఉదయం 10.00గంటలకు నామినేషన్ వేయనున్నారు.లి

కావున బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డ్ కమిటీ మెంబర్లు, బస్తి కమిటీ మెంబర్లు, ఉద్యమకారులు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, అందరూ పాల్గొనాలని కోరారు.

## అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో స్వీప్ సిబ్బంది సమన్వయంతో సాంస్కృతిక కార్యక్రమాలు




ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా ఏప్రిల్ 22:జిల్లా ఎన్నికల అధికారి %డ% కలెక్టర్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వారి ఆదేశాల మేరకు ఈరోజు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పరిధిలోని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాజాత బృందాల సహాయంతో జిల్లాలో గల అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో స్వీప్ సిబ్బంది సమన్వయంతో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడం జరిగినది. స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని కళాజాత బృందాలు అన్ని అస్సెంబ్లీ నియోజకవర్గాల వారీగా గతంలో అత్యల్ప ఓటింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా ప్రదేశాలలో గల స్వయం సహాయక సిబ్బంది, జిహెచ్ఎంసి సిబ్బంది మరియు ఇతర అన్ని డిపార్ట్మెంట్ల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ తమ యొక్క సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా జిల్లాలో ఓటింగ్ శాతం పెంపుదల యొక్క ఆవశ్యకతను వివిధ రూపాలలో తెలియపరచినారు. ఇట్టి సాంస్కృతిక కార్యక్రమాలు, సాంస్కృతిక సారధి కళాజాత బృందంచే కూకట్పల్లి అస్సెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గల నిజాంపేట్, బాలానగర్ ప్రాంతాలలో నిర్వహించడం జరిగినది. మరియు ఖుత్బుల్లాపూర్ అస్సెంబ్లీ నియోజకవర్గానికి సంబందించి, సాంస్కృతిక సారధి కళాజాత బృందంచే డిప్యూటీ కమీషనర్ కార్యాలయము నందు వోటింగ్ శాతం పెంపుదల కొరకు అందరు %దీశీశ్రీ్త రావజవశ్రీ రాటటఱవెవతీం% తో ఓటింగ్ శాతం పెంపుదల కొరకు తీసుకొనవలసిన చర్యల గురించి చర్చించడం జరిగినది. మరియు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి %డ% స్వీప్ నోడల్ ఆఫీసర్ గారి అధ్వర్యంలో సంస్కృతి ఇంజనీరింగ్ కాలేజ్, ఘట్కేసర్ విధ్యార్థిని విధ్యార్థునులకు ఓటు యొక్క ఆవశ్యకత మరియు ప్రతి యొక్క విధ్యార్థిని విధ్యార్థులు తమ వంతు భాధ్యతగా పోలింగ్ లో పాల్గొని, జిల్లా యొక్క ఓటింగ్ శాతము పెంపొందించవలసిన ఆవశ్యకత గురించి వివరించినారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com